శ్రీ

# మనువంశ పురాణము

## గ్రంధరచయితలు / ప్రచురిత దాతలు

శ్రీ మనువంశ పురాణమును తొలుతగా శ్రీ పోచిరాజు వీరనామాత్యకవి ॥ఖండకపాలాఖ్యానము॥ అను నామముతో పద్య కావ్యముగా రచించిరి. పిదప శ్రీవజ్జుల చింతామణి కవి ఈ పద్య కావ్యమును, గద్య కావ్యముగా 1903 వ సంవత్సరములో శ్రీ గణపువరపు వెంకన్న గారు సహకారముతో ప్రచురించ బడినది. కాని ఈ గ్రంధ ప్రతులు లభ్యము కాకపోవుటచే 1972 వ సంవత్సర ములో కీ॥శే॥ మునగాల రామయ్య, తెనాలి వారి జ్ఞాపకార్థం ఆయన సతీమణి శ్రీమతి నరసమ్మగారు పునఃముద్రితముచేసి ప్రచారము కొరకు పంచియున్నారు.

ఆ గద్య / వచనకావ్యమముల ఆధారముగా మన కులస్థులందరూ చదువుకొని తరించి మోక్షము పొందునట్లుగా సులభ తరమైన మన వాడుక భాషలో అనువదించు ఉద్ధేశముతో శ్రీ చిట్టాల సూర్యనారాయణమూర్తి, విజయవాడ వారు మన కులస్థులలో సంస్కృతభాషా ప్రావీణ్యము కలిగిన, సంస్కృత ఉపాధ్యాయునిగా ప్రభుత్వ కళాశాలలో పనిచేసి, పదవీవిరమణ చేసిన శ్రీ గణపువరపు భాస్కరరావు, కొవ్వూరు వారిచే అనువదింప బడినదని తెలియజేయుటకు సంతోషించుచున్నాము.

కీర్తి ప్రతిష్ఠలు కలిగిన చంద్రంశమున జన్మించి మను వంశజులు, విశ్వంభరుని శాపముతో తిలవృత్తిగా, శ్రీపరమేశ్వరుని జటాజూటమునకు తిల తైలము అందించువారి ఆశీస్సులతో జీవించున్న మనము అందరమూ ఈమనువంశ చరిత్రను చదివి తరించగలరని ప్రార్థించుచున్నాము.

శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు

# శ్రీ
# మనువంశ పురాణము
# గద్యకావ్యము

## ప్రథమ అధ్యాయము - కుమారాభ్యుదయము

మదపుటేనుగుల మదజలముచే పెరిగి పూచిన తెల్ల మల్లెపూలు ఆకాశములోని నక్షత్రాలను తమ కొమ్మలలో చిక్కించుకున్న చెట్లతో గున్నఏనుగుల తొండములచే నలుపబడిన కానుగ చివుళ్ళ సువాసనలతో ఒప్పుచున్న నైమిశారణ్యము కలదు. చమరీ మృగాలతో శోభిల్లునట్టియు, మదపుటేనుగులచే పరిపాలింప బడినట్టియు, మలయపర్వత మందలి కస్తూరి మృగముల మధ గంధముచే కూడినట్టియు, మనోహరమైన అగరు తిలకములచే అలంకరింపబడిన సీతాదేవి వలె ప్రసవించిన కుశలవులు కలదియు, పెళ్ళి వారిల్లు లాగా పచ్చని ఆకులతో కుశసమిత్‌కుశుమ శమీ వృక్షములతో శోభిల్లునట్టియు, సింహగర్జనతో మత్తెక్కికూసే కోయిలలు కలదియు, ధ్రుతవ్రత వలే దర్భలు, నారచీరలు, జడలు, కలిగినదియునై, పుష్పవతి అయినను మిక్కిలి పవిత్రమైనదియు, క్రూరజంతువులతో కూడినను మునులచే సాధుజనులచే సేవింపబడినదియునై ఒప్పుచుండెను. ఆ పుణ్యభూమిలో నివసించు శౌనికాది మహర్షులు, రోమహర్షముని కుమారుడును, పురాణ, ఇతిహాస మహారథియు సూతమహర్షిని సమీపించి, మీరు చెప్పే అద్భుతగాధ లను వింటుంటే మా శరీరములు పులకించుచున్నవి. కావున మనువంశమున జన్మించిన మానవోత్తముల సచ్చరిత్రులను మాకు వినిపింపుము సత్కులమందు పుట్టిన వారిగాధలు వినుట ఇహ పర ధర్మసాధనము కదా, అని పలికిరి. సూతమహర్షి శౌనికాది మునులతో తాపసోత్తములారా సర్వజ్ఞులైన మీకు తెలియనిదేదియు లేదు అయినను నన్ను ఇట్టు అడుగుట లోకోపకారము కొరకే కాని వేరొండుకాదు. నా గురువు  వ్యాస మహర్షి నాకు ఎరిగించిన తీరులోనే మీకు చెప్పెదను శ్రద్ధగా వినండి అని పలికిరి.

## సూతుండు శౌనికాదులకు మనువంశ క్రమము చెప్పనారంభించుట

మహాప్రళయ సమయములో దేవతలు, మనుష్యులు, పశువులు, పక్షులు మున్నగు సమస్త ప్రాణులు తమ తమ కర్మవాసనలతో మహా శక్తి స్వరూపిణి అగు మూలప్రకృతియందు అణగియుండి సమస్త సృష్టి జలమయమైనది. అట్టి సమయమున శ్రీమన్నారాయణుడు యోగ నిద్రలో యుండెను. అతని బొడ్డు నుండి బ్రహ్మ వెలువడి యధాక్రమమున పున:సృష్టి చేయునపుడు బ్రహ్మ ముఖమునుండి బ్రాహ్మణులు, బాహువుల నుండి క్షత్రియులు, తొడనుండి వైశ్యులు, పాదములనుండి శూద్రులు పుట్టి నాలుగు వర్ణములు అయ్యెను. అటుపైన క్రమముగా గొల్లలు, పద్మశాలీలు, క్షురకులు, రజకులు మొదలుగా చండాలుల వరకు 14 వర్ణాల వారు పుట్టి అష్టాదశవర్ణాలు అయ్యెను. ఇక మీరడిగిన మనువంశ కులజుల వంశక్రమము వివరించెదను ఆలకించండి.

సృష్టి స్థితి లయ కారకుడును, సురాసురలచే పూజింపబడువాడును, భక్తులను రక్షించువాడను, ఆత్మసేవాధురణ నారాయణుడును, పండితులచే రచింపబడిన పవిత్రమైన తన చరిత్రను పఠించువాడును, పండితులను పాలించువాడును అగు శివుడు సర్వమంగళ పార్వతితో కలసి జగముల నేలుచుండెను. అతడు సమాధి స్థితి నుండి బయటకు వస్తూ కళ్ళు తెరచెను. చంద్రస్వరూపమగు ఎడమకంటి నుండి అమృతము స్రవింపగా తన దోసిటితో గ్రహించెను. అమృతము వలన చక్షువు అను మహాత్ముడు జన్మించెను. ముక్కంటి కంటి చంద్రునివలన జన్మించిన ఆ చక్షువు వంశము వారందరు చంద్రవంశ సంభవులైనారు.

## సకల విదుడు తపము చేసి బ్రహ్మ వలన షోడద పుత్రులను పొందుట

పరమేశ్వరుని నేత్రామృతము నుండి పుట్టిన చక్షువుకు చాక్షసుడు అను కుమారుడు జన్మించెను. ఈ చాక్షస మనువు వలన చంద్రవంశం తామరతంపరగా అభివృద్ధి చెందినది. ఆవంశమున పుట్టిన రాజులంతా సూరులు, వీరులు, ధీరగంభీరులు, ధైర్య స్థైర్యములు కలవారు. ఆర్య సమ్మతంగా నేల నేలుచుండిరి. అట్టి సార్వభౌములలో ఒకడైన సుద్యుమ్నుని కుమారుడు సకలవిదుడు, సార్ధక నామ ధేయుడు. అతడు తండ్రి అనుమతితో బ్రహ్మను గూర్చి దేవమానంబున పదివేల సంవత్సరములు తపస్సు చేసెను. అది చూసి దేవతలు ఆశ్చర్యపడిరి. దేవతలతో కలిసి బ్రహ్మ ప్రత్యక్షమై వరము కోరుకొమ్మనెను. సకలవిదుడు సంతోషించి పుత్రులు పుట్టినచో దేవతలు, పితరులు పతులు మనస్సులో తృప్తి చెందుదురు. యమ నరకము కలగదు. తన వంశము అభివృద్ధి చెందును. దిగంతముల వరకు కీర్తి వ్యాపించును. కావున పదహారు మంది కొడుకులను ప్రసాదించమని కోరుకున్నాడు. పరమేష్ఠి అనుగ్రహించెను.

సకలవిదుడు తన నగరానికి వెళ్లి జరిగినదంతా తండ్రికి భార్య శాకల్యాదేవికి చెప్పి ఆమెతో సుఖ సంసార సంసార జీవనము గడపసాగెను. యుక్త కాలములో జనకునిచే పట్టాభిషిక్తుడై రాజ్య పాలనను చేయుచుండగా ఆ పుణ్య దంపతులకు ఒక శుభ సమయములో హిరణ్యగర్భుని వరప్రభావమున విమలవిదుడు, దాత విఖ్యాతుడు, సర్వవిదుడు, కనకదుడు, ప్రాదుర్భవుడు, పాండుడు, విశ్వహితుడు, భువనభాతి, ప్రభుడు, సుముకుడు, కాశ్యపుడు, విమలుడు, విదూషనుడు అను పేర్లు గల పదహారు మంది కుమారులు జన్మించి దినదిన ప్రవర్ధమానులై జననీ జనకులకు నయనానంద కరులై యుండిరి. సకలవిదుడు తన కుమారులను విద్యాభ్యాసానికై జాబాలి మహర్షి ఆశ్రమానికి తీసుకొని వెళ్లి ఆ మహాత్మునికి తన కుమారులను అప్పగించి గురుపూజ చేసి తన రాజధానికి వచ్చెను. ఆ గురుకులములో కుమారులు చతుర్వేదములను శిక్షా వ్యాకరణమును మున్నగు షడంగములను, కపిల, పతాంజలి, కణాద, జైమని, వ్యాస నారదాది మునులచే రచింప బడిన దర్శనములను విమర్శించుచూ అస్త్ర శస్త్ర శాస్త్రములను, గజాశ్వ శాస్త్రములను, నీతిశాస్త్రమును, లోనుగాగల అన్ని శాస్త్రములను అభ్యసించి, ప్రభుమంత్ర, ఉత్సాహ, శక్తి త్రయ సంపదలు కలిగి, సకల లిపి జ్ఞానమును, నిఖిల దేశయ భాష పాండిత్యమును, కావ్య, నాటక, ఆఖ్యానక, ఇతిహాస, చిత్ర కథలతో కూడిన పురాణ నైపుణ్యమును, ధర్మ, శబ్ద, జ్యోతిష, తర్క, మీమాంసాది సమస్త శాస్త్ర చాతుర్యమును, కామందకీయాది పఠన కౌశలంబును, వీణాది వాద్య సామర్ధ్యమును, సంగీత, సాహిత్యాది ప్రావీణ్యమును, మణి మంత్ర ఔషధాది మాయా ప్రపంచ పాటవంబును, గజ తురగాది వాహనారోహణ ప్రావీణ్యమును, వివిధ ఆయుధ ప్రయోగ చాతుర్యమును, చౌర్య, దురోదరాది కపట కళా ప్రౌడత్వమును, ఆచార్యులవలన నేర్చుకొని సకల లోకానంద కరులైనారు.

వారిలో అగ్రజుడైన విమలవిదుడు కాలి బొటన వేలు నేలపై మోపి, పంచాగ్ని మధ్యనుండి పైకి చేతులు చాపి గాలి ఆహారముగా కలవాడై త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను మనసున ధ్యానిస్తూ ఎనిమిది వేల ఏళ్ళు తపస్సు చేసెను. అది చూసి దేవతలు ఆశ్చర్యపడి బ్రహ్మ కాడకు వెళ్లి అతని తపస్సును గూర్చి తెలిపిరి. బ్రహ్మ లక్ష్మీకాంతుని మహేశ్వరుని కలసి విమలవిదునకు త్రిమూర్తులు ప్రత్యక్షమైనారు. విమలవిదుని తపస్సుకు ప్రసన్నులమైనామని అతని మనోరథము నెరవేరగలదని, తపస్సు విరమించుమని ఆనతీయగా అతడు తపస్సు చాలించి త్రిమూర్తులకు నమస్కరించి ఈ విధముగా పొగెడెను.

## త్రిమూర్తి దండకము

శ్రీ శంకరా ! భారతీనాథా ! శ్రీశ ! మీముప్పురున్ లోకముల్ ముంపగా బెంపగా జేయగానిట్లు తత్తద్గుణ ధారులై వేరు రూపంబులంబూని యున్నారలింతే కదా మీకు భేధంబు లేదంచు కైనన్ విచారించిన నిర్గుణంబున్ నిరహంబు నిత్యంబు నిర్లేపమున్ సత్యమున్ శాంత మద్వైతమున్ మౌనిగమ్యంబు నాద్యంత శూన్యంబు నిర్దేశ మచ్చంబు, దుచ్చాదిగంబున్ మనోవాగ తీతంబునై వెల్గు చిన్మాత్రమే మీరు మీకన్న వేరెద్దియున్ లేదుగా.

భుక్తి ముక్తుల్ స్వభాక్తాళికి యంగ నీరూపులౌ మీరు నీరూపంబూనుటే కాక హెత్వం తరంబున్నదే మూఢులౌ మానవుల్ కోటి జన్మార్జితనంత పుణ్యకలభ్యంబునై దుర్లభంబౌ మనుష్యత్వముంబొంది జన్మాది దుఖంబులన్ జూచుచున్ మోహవిభ్రాంతులై శాశ్వతంబైన యుష్మత్పదంబాత్మలో గోరకి తుచ్ఛ సంసార వారంబుదిన్ మున్గుచున్ దేలుచున్ దార పుత్రాదికంబే సతంబంచూ గుక్షిం భరిత్వంబునన్ నీచ సేవాపరాధీనులై కామముఖ్యారిషద్వర్గ మత్యంతముం దమ్ము భాధింపు చూడంగనా జ్ఞానులై పాప కర్మంబులన్ జేయుచున్ సంస్కృతీద్ధాబ్ధి దాటింప సిద్ధంబుగా నున్న నావన్ భవత్పాద సేవన్ మహామోహ జాత్యంధులై గానగాలేక తృష్ణ పిశాచి సమావిష్ణులై యిప్పు మాకంత బ్రాప్తించె నింకన్ లభించున్ ధనంబంచు జిత్తంబునన్ దెప్పు లబ్దాదికంబైన విత్తంబునే గోరుచున్ సర్వలోకంబులన్ మ్రింగినన్ దృష్టిలేనట్టి కాలంబు మ్రింగన్ స్వకర్మాను రూపంబుగా బుట్టుచున్ గిట్టుచున్ ఘోర సంసార చక్రంబులోనుందురో వేల్పులంబ్రోచు ముప్పేల్పులారా భవత్పాద సేవా పరాధీనులౌ జ్ఞానులెల్లప్పు మీ మూర్తులం దెద్దియేనాండు నేకాగ్రతన్ లోపలన్ నిల్పి యావాహనం బాదిగా గల్గు శ్రీపౌరుషేయాది సూక్తింబులన్ బూజులం జేయుచున్ జిత్త మత్యంత సుద్దంబు గావించి యా బ్రహ్మకీటాంతమౌ లోకమున్ నశ్వరంబంచు వైరాగ్య యుక్తిన్ జగద్భోగ జతంబునమ్ గాక విష్ణామనీషన్ శమంబాదిగా నారిటిన్ దాల్చి కౌలాల కౌటాకృతిన్ లోన నిర్లిప్తులై నిత్యసత్య వ్రత ధారులౌచున్, సదాచార సంపత్తితో నాత్మతత్వాను సంధానమున్ జేయుచున్ సర్వ భూతంబులందున్ గృపాయత్త చిత్తంబునన్ శాంతులై వీతరాగిత్వమున్ దాల్చి నిర్మాణ మోహుల్ నిరాకాంక్షులన్ ధార్మికుల్ వాగ్మతుల్ దు:ఖదూరుల్ గతహమ్ కృతుల్ నిత్య కర్మైక తానుల్ సదానంద సాంద్రుల్ సుఖ ధారులౌతాము జీవింపుచున్ ముక్తులై లోక వైచిత్రి నెల్లప్పడున్ జూచుచున్ ముట్టు చాలింపు చూచుచున్ బ్రోలుచున్ వారలాయా గుణంబుల్ గుణాలింబ్ర వర్తించునంచున్ సదాతత్వ మస్యాది వాక్యర్ధ బోధోద్ద విజ్ఞాన సంపత్తి, దతాత్మ్యయా సాక్షులై వాసన హినవృత్తిన్ బ్రవర్తింతురీ రాజయోగంబు మీ పాద సేవ విహీనాత్ములౌ వారి కేరీతి జేకూరు నో కాళికా భార్గవీ భారతీనాధులారా ! నమో ఓంనమో ఓంనమో ఓంనమ:

ఈవిధంగా స్తుతించి విమలవిదుడు ఓ మహాత్ములారా! మీ దర్శనముచే ధన్యుడనైతిని నా వంశము పావనమైనది. సంసారిక సుఖాలు నాకు అక్కరలేదు. మీరు ఎల్లప్పడూ నాహృదయంలో నిలిచియుండుడు ఇదియే నేను కోరు వరము అని పలికెను. త్రిమూర్తులు సంతసించి దేవమానవా దుర్లభమైన వైభవమును అతనికి ఇచ్చెను. ఈ వైభవమును తన సోదరులకు అనుగ్రహించమని తమందరి నివాసము కొరకు ఒక ఉత్తమ నగరమును ఇమ్మనెను. వెంటనే విశ్వకర్మను స్మరించగా అతడు వచ్చి త్రిమూర్తుల ఎదుట విధేయుడైయుండ ఈ రాజకుమారులు ఉండుటకు పద్నాలుగు లోకాలలో గల సంపదలను నెలకొల్పి ఒకపురమును నిర్మింపమని నియోగించి త్రిమూర్తులు విమలవిదుని దీవించి తమ లోకాలకు వెళ్ళారు.

## కనక నగర నిర్మాణం - పట్టాభిషేకం

ఉత్తర దిశగా ఆకాశమును తాకుచున్నట్లున్న పదహారు వన్నెల పసిడి శిఖరాలతో ఒప్పచూ, సిద్ధులచే, చారణులచే సేవింప బడుచున్న, హేమకూట పర్వతమందు నలభై కోట్ల శిల్పులతో (అమరావతిని, భోగవతిని, లంకాపురమును, అలకాపురమును మించిన వైభవముతో ఒక పురమును నిర్మించెను.) దేవేంద్రుని నగరము అమరావతిని, కుబేరుని పట్టణం అలకాపురాన్ని, స్వర్ణమయమైన లంకాపురాన్ని మించిన వైభవముతో ఒక పురమునునిర్మించెను. పది కోట్ల నవరత్న ఖచిత హర్మ్యాలు, నూరు కోట్ల తోరణములు, ఎనభై లక్షల కోట్ల స్వర్ణ మందిరాలు, ఇరవై కోట్ల గోపురాలు, విశాలమైన అంగడివీధులు, డెభై కోట్ల దేవాలయాలు, పదివేల కోట్ల వేయి స్థంభాల మండపములు, అనేక క్రీడా గృహములు, సుందరమైన ఉద్యానవనాలు, విహారశైలములు కలిగి, శృంగార లక్షణములకు నివాస స్థానమై ఒప్ప ఆ పురమును తన మంత్ర శక్తిచే నిర్మించి విశ్వకర్మ మనస్సులో మహేశ్వరుని తలచుకొని తన కమండల జలము అభిమంత్రించి అయుత కోటి విశాలమైన ఆ నగరమంతటా చల్లిరి. వెంటనే అన్ని జాతులవారు అక్కడ పుట్టిరి. సకల శాస్త్ర నిష్ణాతులైన బ్రాహ్మణులను, పరాక్రమ వంతులైన క్షత్రియులను, సకల సంపదలు కల వైశ్యులను, దైవ బ్రాహ్మణ భక్తి యుతులైన శూద్రులను, శ్రీసతి, సతి, భారతి, పులోమజ, అరుంధతిలతో సమానమైన పవిత్ర చరిత్ర గల పతివ్రతలను, అప్సరసలను, ధిక్కరించే సొగసుగల మృత్యుకంఠులను, సకల సురాసుర భయంకరులను, వీరభటులను, జ్ఞాన విజ్ఞానులైన దండనాధులను, సామ దాన భేధ దండోపాయముల నెరిగిన మంత్రులను, సకల జన మనోహరములగు రధములను, శత్రు జంభకములగు ఏనుగులు, వేగముగా పోవు అశ్వములను మొదలుగా గల సమస్త పురోప
కరణాలు నిండియుండెను. తనచే నిర్మితమైన ఆ నగరాన్ని చూచి విశ్వకర్మ సంతసించి సార్ధకనామ ధేయముగా ఆ పురానికి కనకపుర నగరమని పేరు పెట్టారు.

విశ్వకర్మ మన కులజులను వెంట పెట్టుకొని చతురానానుని వద్దకు వెళ్ళారు. పుర వైభవం గురించి సంతుష్టుడైన బ్రహ్మ ఆ పురానికి మను తనయులను అభిషిక్తులను చేయుటకు నిశ్చయించారు. రాకుమారులు, విశ్వకర్మలతోపాటు, యక్ష, గరుడ, గంధర్వ, కిన్నెరులను, నారదాది మునులను వెంటనిడుకొని బ్రహ్మదేవుడు శ్రీమన్నారాయణుడి వద్దకు వెళ్ళారు. అచట నుండి శ్రీమహావిష్ణువు వెంట రాగా మహేశ్వరుని కడకు చేరుకొన్నారు. లక్ష్మీరమణుడు పరమశివునకు వందనము ఆచరించి ॥మహాదేవా ! నీ ఆజ్ఞానుసారము రమణీయమైన నగరం నిర్మితమైనది. కనుక మీరిచ్చిన వరములతో దానిని పాలించగలందులకై మీరే వచ్చి రాజకుమారుల పట్టాభిషేకం జరిపించాలి.॥ ముక్కంటి సంతుష్టుడై సర్వమంగళతో కూడి ప్రమద గణములు కొలుచుండ కనక నగరమునకు బయలుదేరారు.

మహేశ్వరుని ఆగమనము కనకపుర వాసులకు ఆనందకారణమైనది. వారు తమ గృహ ప్రాంగణములను కస్తూరితో అలకి ముత్యాల ముగ్గులు పెట్టారు. రాజమార్గములందు శృంగాటకములందు విజయ వైజయంతికలను నిలబెట్టారు. పరిమళ ద్రవ్యాలు, అగరు ధూపములతో సుగంధభరితం కావించారు. బాటకు ఇరువైపుల అరటి చెట్లను నాటి, పచ్చతోరణములను కట్టారు. నానావిధ వాద్యములతో పాడుతూ ఆడుతూ ఆనందించారు. అప్పడు భక్తవశంకరుడగు శంకరుడు బ్రహ్మ విష్ణువులు ఇరువైపుల రాగా పురమందు ప్రవేశించారు. త్రిమూర్తులకు ముత్తైదువలు రత్నాలు చెక్కిన బంగారు పళ్ళాలలో కర్పూరపు హారతులు ఇచ్చారు. సేసలు (అక్షితలు) చల్లారు. ఇట్లు రాజమార్గమును గడచి త్రిమూర్తులు సర్వాలంకార శోభితమైన రాజభవనము ప్రవేశించారు. నవరత్న ఖచిత సింహాసనాలతో ఒప్పచున్న కొలువు కూటానికి వెళ్ళారు. త్రిమూర్తులు, ఇంద్రాది దిక్పాలురు, సనక సనందనాది బ్రహ్మర్షులు, తుంబుర నారదాది దేవర్షులు, వశిష్ఠ విశ్వామిత్రాది సప్తర్షులు, మను తనయులు అందరూ ఉచితాసనముల కూర్చుండిరి. పట్టాభిషేక ముహూర్తము సమీపించినది. ప్రమదగణాలు వాయువేగముతో వెళ్ళి ఆయా నదీ జలాలను బంగారు కలశములతో తెచ్చారు. పార్వతి, లక్ష్మీ, సరస్వతి, అరుంధతి మొదలగు గల పుణ్యసతులు తమ భర్తల అనుజ్ఞతో మను తనయులకు మంగళ స్నానాలు చేయించి సింహాసనాలపై కూర్చుండబెట్టి కర్పూర హారతులనిచ్చి అక్షితలు చల్లి దీవించారు. దేవ ధుంధుభులు మ్రోగుచుండ మునులు ఆశీర్వదింపగా, గంధర్వ గానము వీనులవిందు చేయ అప్సరసల నాట్యమాడుచుండ, దేవతల గురువగు బృహస్పతి శుభలగ్నమిది అని చెప్పగా, చతుర్ముఖ బ్రహ్మ మంత్రోచ్చారణ చేయుచుండ, పరమేశ్వరుడు విమలవిదుని శిరస్సు మీద బంగారు కిరీటము ఉంచిరి. జయజయ ధ్వనులతో విష్ణువు, మహాలక్ష్మి మొదలగువారు గంగాది పుణ్యనదీ జలాలతో మంగళాభిషేకము గావించిరి. ఇట్లు అష్టాదశ ద్వీప పరీతమైన భూమండలానికి విమలవిదుడు ప్రభువుగా అభిషిక్తుడైనాడు. అప్పడు ఆమహారాజు సింహాసనము నుండి లేచి, తమ్ముల నిరు ప్రక్కల నిలుపుకొని, చేతులు జోడించి త్రిమూర్తులతో ఇట్లనెను.

ఓ మహాత్ములారా మాకు మీ ప్రేమానురాగ సంపద లభించుటచేత ధన్యులమైతిమి. మేము ఇక పొందరానిదేమి ఉండదు. మా కోర్కెలు సఫలమైనవి. సంకల్ప సిద్ధులైన మీ అనుగ్రహానికి పాత్రులైన వారికి సమస్త మనోరధములు వెంటనే సిద్ధించును. మోక్షం లభించును. ఆపదలు నశించును. వేద వేదాంగ విదులే మిమ్ములను నుతించలేరు. మేమంత వారము మీ మహిమలు మీరు తప్ప ఇతరులు ఎరుగరు. మా హృదయాలలో మీ పాద పద్మాలు నిలుపుకొనునట్లు అనుగ్రహింపుడు. ఈ రాజ్య తంత్రములలో చిక్కుకుపోయి మిమ్ము మరవక ఉండగల జ్ఞానాన్ని మాకు ప్రసాదించండి. మహోన్నత పదవి మాకు లభించినదని తృప్తి పొంది, ఈ వ్యామోహంలో పడి, సంసార సాగరంలో మునుగుతూ, తేలుతూ, అవివేకులమై పోతామేమోనని భయం కలుగుతున్నది. నిష్కాయుడనై నేను తపస్సు చేసాను. అట్టి నాకు ఈ రాజ్యాధికార లంపటము అనర్ధదాయకముగా కనబడుతున్నది. కావున ఈ రాజ్య భారాన్ని తమ్ములపై నిడి మరల నేను తపోవనానికి వెళ్ళెదను. అని విమలవిదుడు కోరెను.

శ్రీమన్నారాయణుడు విమలవిదునితో వత్సా! తొందర పడవద్దు ఇతరులవలే నీవు సంసారలోలుడవు కాబోవు కావున కొంత కాలము మనుషానందము అనుభవించు. పిమ్మట నీకు ముక్తి లభించును అని పలికెను. మను కుమారుడు అది తనకు మహా ప్రసాదం అనుకొన్నాడు. మరల త్రిమూర్తులను ఆరాధించెను. బ్రహ్మర్షులకు, దేవర్షులకు, పరమానందముతో సత్కార పూర్వకంగా పూజించెను. వారంతా సంతసించారు. శ్రీశంకర ప్రముఖ దేవగణాలు సపరివారంగా వారిని ఆశీర్వదించి తమ లోకాలకు వెళ్ళారు.

తమ పట్టాభిషేకము చూడవచ్చిన అష్టాదశ ద్వీపాధినాదులను, సామంతరాజులకును మను కుమారులు యదోచిత సత్కారాలు చేసారు. వారు ఇచ్చిన కానుకలను గ్రహించి కట్న కానుకలతో వారిని సంతుష్టులను చేసి, కొన్ని రోజులు విందు వినోదాలతో గడిపి, వారిని వారి రాజ్యములకు పంపించి, మనువంశ భూషణులు కనక నగరం రాజధానిగా అఖిల మహీమండలం ఏకఛత్రంగా పరిపాలన గావించి ప్రజానురంజకులై విలసిల్లారు. అని సౌనికాది మునులకు సూత మహర్షి చెప్పారు.

ప్రధమ అధ్యాయం సమాప్తం

## రెండవ అధ్యాయం

సౌనికాది మునులు సూత మహర్షిని తర్వాత కథ చెప్పమని అడుగ అతడు ఇట్లు చెప్పసాగెను. మను తనయులు వర్ణాశ్రమ ధర్మములు రక్షిస్తూ దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేస్తూ భూమండలాన్ని ఏకఛత్రాధిపత్యంగా పాలించుచుండిరి. అగ్రజుడు విమలవిదుడు తన గుణగణాలచేత సర్వజన సమ్మతుడై వైవస్వతాది సోదరుల యందు ప్రేమ కలవాడై వారిని రాజ్య కార్య నిర్వాహకులుగా చేసుకొని నిశ్చింతగా ఉన్నాడు. వర్ణసాంకర్యము, చిత్రరచనలయందు, ధృఢతరబంధనంబులు, ప్రభంధములయందు విచారములు శాస్త్రములయందు, విప్రలంభములు కలలయందును, వ్యామోహములు గానములయందు, మదవికృతులు మత్తగజములయందు, కళంకము చంద్రునియందు తప్ప వేరొకరిలో కలుగవు. తమ్ములు జాగరూకులై రాజ్య తంత్రములు నడుపుచుండగా విమలవిదుడు రాజులందరికి పూజ్యుడై విలసిల్లాడు. బుద్ధిలో దేవతల గురువైన బృహస్పతిని మెప్పించాడు. నీతిశాస్త్ర కోవిదులైన అమాత్యులతో సమ వయస్కులైన రాజన్యులతో సుఖంగా ఉన్నాడు. యవనవంతుడయ్యు స్త్రీ సంభోగాది వ్యసనపరుడు గాక, సరస సంగీత సాహిత్య గోష్టులతోను, బాణ, పతంజలి, కాణాద, జైమిని, వ్యాస, అక్షపాద, నారదాది విరచిత సూత్ర తత్వర్య పర్యలోచనతోను, మునుల పాదసేవతోను కాలము గడుపుచూ విమలవిదుడు సంతోషంతో ఉన్నాడు.

ఇట్లుండగా ఒకనాడు కుబేరుడు పుష్పకారూడుడై తనను చూడ వచ్చిన కుబేరుని పూజించి వినయపూర్వకంగా కుశలమడిగి తన గృహానికి కొనిపోయి ఉన్నతాసనంపై కూర్చుండబెట్టి ఇట్లు పలికెను. రాజ రాజా! సామాన్యుడనగు నాకు ఈ భూలోకాధిపత్యం ఇచ్చుట నీ హితుడగు శ్రీశంకరుని అనుగ్రహమే. ప్రపంచ మాతా పితరులగు ఆ పురాణదంపతులు క్షేమమేకదా! వారికి నాయందు సంపూర్ణంబైన
దయ ఉన్నదా! ప్రతి అడుగులోను నా క్షేమ సమాచారములు తెలిసికొనుటకై మీరిట్లు దర్శనమిచ్చుటలో నాభాగ్యము ఏమని చెప్పవచ్చును
నా యందు అనుగ్రహముతో ఇట్లు వచ్చుటకు కారణమేమి! అడుగనవసరం లేదు. నన్ను రక్షించుటకే తమరు వచ్చినారు అని విమలవిదుడు కుబేరుని గౌరవించాడు.

దానికి కుబేరుడు విమలవిదునితో నీవు సకల సద్గుణములతో నిండిన రత్నాకరుడవు. మనుష్యులలో నీవంటి ధార్మికులు, స్నేహశీలురు వేరొకరు ఉండబోరు. కావున నీతో స్నేహము చేయవచ్చితిని. భగవానుడైన శ్రీశంకరుని అనుగ్రహముని బట్టి నీకు నాకు స్నేహము సిద్ధమై ఉన్నది. నీవు పరమ మహేశ్వరుడవు, నేను మహేశ్వరుడను, మహేశ్వరునికి ప్రియమిత్రుడను. లోకములలో సామాన్యులతో కూడా స్నేహము ప్రయోజనకారిగానే ఉండును. అటువంటిది నీవంటి మహనీయునితో మైత్రి అధిక ఫలప్రదమని వేరే చెప్పనేల! అని పలికెను.

విమలవిదుడు చిరునవ్వు తన చెక్కిళ్లపై ప్రసరింపగా ఇట్లనెను. ఔరౌరా కుబేరుడు మనుష్యమాత్రుని స్నేహం కోరుట నా అదృష్టం. తమ వంటి దేవతల అనుగ్రహంతో జీవించు నాకు ఇట్టి ఉత్తరోత్తర క్షేమ లాభములకు మితిలేదు. సంపదలపై సంపదలను సామెతరిత్త కాదంటూ ఆనంద పరవశుడయ్యెను.

అంతట కుబేరుడు విమలవిదుని చేతులను తన చేతులతో పట్టుకొని ఇట్లు పలికెను. ఓమనుకులజలధి చంద్రుడా! నిజం పలికితివి నీసాహచర్యంతో సరియైన సాహచర్యం మానవమాత్రులకు లభించదు. త్రిమూర్తులు కూడా నీయందు అనురాగ బద్ధులై నీ హృదయపంజరంలో చిక్కుకొని యున్నారు. కావున భక్తాగ్రేసరుడవగు నీ మైత్రి మేము కోరుచుండుట వింతకాదు అని కుబేరుడు విమలవిదుని అనునయించాడు.

చంద్రోదయము వలను ఉప్పొంగు సముద్రము వలె విమలవిదుడు మనస్సులో సంతోషించి కొన్నిరోజులు కుబేరుని కనకపురమున నిలిపి ఇష్టాగోష్టితో నుండి ఆతర్వాత తన తమ్ములతో కలసి కుబేరుని అలకాపురానికి వెళ్లి కొన్ని రోజులు వేడుకతో గడపిరి. ఇట్లు రాక పోకలు చేయుచూ స్నేహముతో విమలవిదుడు కాలము గడుపుచూ సుఖముగా ఉన్నాడు.

# విమలవిదుని వివాహము

కుబేర విమలవిదుల మధ్య స్నేహం దినదిన ప్రవర్ధమానమైనది. ఒక రోజున చైత్రరథంలో వారిరువురు అలకాపుర ఉద్యానవన వీధిని విహరించుచుండగా కుబేరుడు విమలవిదునితో ఇట్లనెను. పార్వతీపతి దయవలన అనన్య దుర్లభమైన వైభవం లభించింది. లోకం మెచ్చే సకల సద్గుణాలు నీయందు ఉన్నవి. జయంత, వసంత, నిశాకాంత, రతీకాంత, కాంతులను వెక్కిరించగల సౌందర్యం నీకు కలదు. మరియు నీది నిండు యౌవనం. కావున నీవు గృహస్థాశ్రమం స్వీకరించాలి. సత్కుల సంజాత, రూప లావణ్య సౌశీల్య సంపన్న యగు రాకుమార్తెను చేపట్టి వంశాభివృద్ధి పొందుట అవశ్యకము. నీవు, నీతమ్ములు వివాహము చేసుకోవాలి. శివకేశవులు నీ సంరక్షణ బ్రహ్మదేవునికి అప్పగించారు. కావున సత్యలోకానికేగి బ్రహ్మదేవునికి విషయం వినిపించి ఈ శుభకార్యం జరుపమని కోరదాం అని పలికి విమలవిదుని, అతని తమ్ములను తోడ్కొని కుబేరుడు సత్యలోకమునకు వెళ్లెను. బ్రహ్మ వారిని చూచి మీరు వచ్చిన పని నాకు గోచరమైనది. మను తనయుల వివాహము తప్పక జరుగవలెను. ఓ యక్షరాజా! కుబేరా! భూలోకంలో సౌమ్యుడనే రాజు ఉన్నాడు. అతనికి వినయవతి అను కుమార్తె ఉంది. ఆమె లావణ్యవతి యువతి నీవు అతని కడకు వెళ్లి మాటలాడి వినయవతిని విమలవిదునకిచ్చి వివాహము చేయుము. నీ స్నేహ ధర్మము సఫలమగును అని బ్రహ్మ ఆనతిచ్చారు.

అంతట కుబేరుడు పితామహబహునకు వందనమాచరించి విమలవిదునితో కలసి కనకపురానికి వచ్చి అతని అనుమతితో విమానరూఢుడై సౌమ్యుని నగరానికి వెళ్లాడు. ఆ రాజు కుబేరునికి దేవతోచిత సత్కారాలు చేసి మనస్సులో సంతసించి కుబేరునితో ఇట్లనెను. దేవతోత్తమా కైలాసవాసా పరమమిత్రమా మీరాకతో మా గృహము పావనమైనది. నేను ధన్యుడనైతిని. మీ ఆజ్ఞను పాటించెదను. ఆనతిండు అని వేడుకొనెను.

అపుడు కుబేరుడు సౌమ్యునునకు విమలవిదుని గురించి ఎరింగించెను. రాజా! మనువంశ భూషణుడును, శత్రుభయంకరుడును, సముద్దండ, బుజాదండ మండనుడును, వీరబట పటలఉత్తుంగ తురంగ కుంజర మకర భయంకర నికిల శాత్రవ గణస్కంద వార సారవార సమున్మథన మంధర మహీధర రాయమాన సముద్దండ భుజదండ మండనుడును, నగరిపు నగరచత్వార విహారణ పరాయణ తరుణ మండనుడును, శరదిందు కుందాఘనసార హార మృణాల మరాళ సుర గజ నీరక్షీరగిరి శాట్టహాస కైలాస కాశనికాశ మూర్తియు, దిగాంతములకు వ్యాపించిన కీర్తిచే ప్రకాశించువాడను, రత్నాకర వేలామేకలా వలయిత ధరణి రమణి సౌభాగ్య భోగభాగ్య వంతుడును, నిత్యదాన రక్షిత శిష్టా విశిష్ట విద్యా సంభార భానుర భాసురుండును, మన్మధుని సౌందర్యమువంటి సౌందర్యము కలవాడను అగు భూపతికి నీకుమార్తె వినయవతి నిచ్చిన ఉభయ కులములు కీర్తి ప్రతిష్ఠలు పొందును. అనిన విని సౌమ్యుడు ఆనందముతో విమలవిదుని విచిత్ర చరిత్ర నెరుగనివారు భూమి యందు లేరు మందభాగ్యుడనైన నాకు ఇట్టి మహాభాగ్యము కలుగునా? అని సందేహించుచున్నాను. అని పలకగా కుబేరుడు నీవంటి పుణ్యాత్మునికి తప్ప వేరొకరికి ఇట్టి భాగ్యము కలుగదు అని అనెను. రాజు శుభస్య శీఘ్రం అంటూ సుముహూర్తం నిర్ణయించి తనకు తెలిపినచో తానుకూడా వివాహ సంబరములు సముకూర్చు కొందును అనగా అట్లేగావుత అని కుబేరుడు పుష్పకారూఢుడై కనకనగరికి వచ్చి విమలవిదునకు విషయం ఎరింగించిన అతడు సంతసించెను.

అంతట విమలవిదుడు దేవతల గురువగు బృహస్పతి కడకేగి సుముహూర్తమును నిర్ణయింపజేసి మంత్రులను రప్పించి శ్రీశంకరాది త్రిమూర్తులకును, ఇంద్రాది దిక్పాలకులను, దేవతలకును, సామంత రాజులకును, మహర్షులకును, బ్రాహ్మణులకును శుభ లేఖలు వ్రాయించి, పురోహిత పుత్రుని సౌమ్యుని వద్దకు పంపించాడు. కుబేరుని ఆజ్ఞతో వివాహ మంగళోత్సవమును పౌరులకును, జానపదులకును చాటింపించెను. నిత్య కళ్యాణము పచ్చతోరణముగా విలసిల్లె. కనకపురం మరింత శోభాయమానంగా అలంకరింపబడి కొత్త శోభలను సంతరించుకొని పూర్వము కన్నా వేయిరెట్లు వైభవముతో విలసిల్లెను.

పురోహితుని పుత్రుని వలన సుముహూర్త నిర్ణయము తెలుసుకొని సౌమ్యుడు మంత్రులను రప్పించి వివాహ సంబరములు సమ కూర్చమని ఆనతిచ్చెను. శుభముహూర్తం ఆసన్నమైనది సమస్త దేవతలతో విమలవిదుడు తరలి వచ్చును. వారికి ఏలోటు లేకుండా విడిది ఇల్లు సిద్ధపరచండి. ధన వ్యయమునకు వెనుకాడవద్దు. చీమల వలే సంపాదించాలి అవసరమైనప్పుడు ఖర్చు పెట్టడంలో లెక్కలు వేయరాదు. ఇదే నీతి అనిన విని మంత్రులు తమ తమ కార్యముల నిర్వహించ బయలుదేరారు.

సౌమ్యుని పురమునగల జనులంతా తమ ముంగిళ్ల చలువ పందిళ్లు వేయించి పచ్చని తోరణములు కట్టించి, ముఖమల్ చాందినీలు ఎత్తించి నాలుగు వైపుల అరటి చెట్లులనునిలిపి, జిలుగు ముగ్గులతో లోగిళ్లను అలంకరించి, తమ బంధువులను రప్పించి, విందులు జరుపుకొంటూ, విచిత్ర రత్న భూషణములు ధరించి, మంగళ వేషధారులై ఉండిరి. ఏ వీధిలో చూచినా సమున్నత మంగళ వేదికలు ఏ మేడలో చూచినా పచ్చ కప్పరపు దీపముల విచిత్ర వర్ణ కాచపటలాలు అట్లు ఆ నగరమంతా మంగళదేవత పూజాగృహంగా ఒప్పచుండెను.

ఒక రోజున సౌమ్యుడు అంత:పురకాంతలను పిలిపించి వినయవతిని పెండ్లికూతురును చేయమని ఆజ్ఞాపించెను. ఆనందంతో వారు మహాప్రసాదమని వినయవతి మందిరానికి వెళ్లి ముద్దుగుమ్మా రమ్ము ఇన్ని రోజులకు మా మనోరథములు ఫలించినవి అంటూ వినయవతి చేయి పట్టుకొని సుగంధ తైలములతో తలంటి పన్నీటితో మంగళ స్నానం చేయించి అగరు ధూపములతో తల ఆరబెట్టి పెండ్లి చీర కట్టించి నుదుట కళ్యాణ తిలకం దిద్ది అమూల్యమైన ఆభరణాలను పరిమితంగా అలంకరించి తల్లి వద్దకు తీసుకొనివెళ్లి అమ్మా ఈ మగువకు ఎల్లుండ పెళ్లి అని మాతృవందనం చేయించారు. అంతట మహారాణి సంతోషముతో కుమార్తెను తన ఒడిలో కూర్చుండ బెట్టుకొని ముద్దు మోమును ముద్దు పెట్టుకొని సమస్త దేవతలు నీకు సమస్త శుభాలు ఇచ్చుదురు గాక అని దీవించినది.

అక్కడ కుబేరుడే పెండ్లి పెద్ద. విమలవిదుని వివాహ మహోత్సవమును చూచుటకు తమతమ పరివారములతో ఇంద్రాది దేవతులును, నారదాది దేవర్షులును, శిష్యగణములతో మునిజనులును, సమస్త దేశాలనుండి రాజన్యులును, బ్రాహ్మణులును వచ్చిన వారికి తగు సేవలు చేయుటకు యక్ష కిన్నరలను కుబేరుడే నియమించెను. కనక నగరంలో ఎక్కడ చూచినా అప్సరసల ఆట పాటలును, ఏవంక చూచినా దేవ దుందుభి ధ్వనులు, ఏప్రక్క చూచినా వియచ్చర విమాన పంక్తులను, ఏప్రక్క చూచినా మనోహర మంగళారం కారములు నిండియుండెను.

అంతట కుబేరుడు ఎల్లుండే పెండ్లియని పెండ్లికి తరలెదమని చాటింపించెను. అందరూ కనకపురము నుండి సముద్రము గొంగి సౌమ్యుని నగరమునకు జంగమ రూపమున నడవసాగెనో అనునట్లు బయలుదేరిరి. విమలవిదుడు తన తమ్ములతో కలసి సమస్త ఆభరణ భూషితుడై ఇంద్రునిచే తీసుకురాబడిన ఐరావతము నెక్కి బంధువర్గముతో వెడలి సౌమ్యుని నగరానికి చేరుకొన్నాడు.

## వరునకు స్వాగతం-వివాహము

పెండ్లి వారి రాక నెరింగి సౌమ్యుడు బంధువులతో ఎదురేగి సగౌరవంగా వారిని కళ్యాణ మందిరాలలోకి తీసుకొని వచ్చుచుండ ఆ నగరంలోని పుణ్యస్త్రీలు పెండ్లి కుమారునకు బంగారు పళ్ళాలలో కర్పూర హారతులిచ్చి, మల్లెపూలు కలిగిన అక్షతలు చల్లుచుండగా మేడలపై నిలచి పెండ్లి వారి వైభవమును చూచుచుండిరి. కొందరు స్త్రీలు సగమే అలంకరించుకొని పరుగెత్తుకొని వచ్చి కిటికీల నుండి చూడసాగిరి. ఒక పూబోణి పైట జారుచుండగా పరికిణి ఎత్తి పట్టుకొని గబ్బి గుబ్బల సొబగునును లేతాడల సోయగాన్ని ప్రదర్శిస్తూ, కాలి అందెలు మ్రోగుచుండగా బిరబిరా వచ్చి పెండ్లి కొడుకును చూచెను. మరియొక పడతి పాలిండ్ల భారముతో నడక సాగక ఉస్సురనుచూ ఎట్లకేలకు కిటికీ చెంత చేరి తీరని తనివితో చూడసాగెను. వేరొక పొలతి వాల్జెడ మడమలపై పడుచుండగా మన్మధుని పూలబాణంవలె  మెరుస్తూ వచ్చి చూడసాగెను. ఇంకొక పంకజాక్షి మనసున అంకురించిన అనురాగంతో మేను పులకలెత్తగా పలువిధాలుగా చూచు చుండెను.

ఈ విధంగా సకల రమణీ మణీ చిత్తచోరుడు విమలవిదుడు ఇంద్రాది దేవతలతో, అనుంగు తమ్ములతో, బంధు జనాలతో, మంత్రి సామంతులతో కలసి పురప్రవేశం చేశాడు. కొంతసేపు సభా మద్యలో నిలిచి పిమ్మట భవ్య రమ్య హర్మ్యాలలో నిజ పరివారంతో విడిది చేసారు పగలంతా తుంబుర నారదాది వైణిక వీణా గానంతోను హహ హుహు మున్నగు గంధర్వుల గానంతోను రంభాది అప్సరసల నృత్యములతోను వినోదించు చుండేను.

సంధ్యా సమయమైనది తత్కాలోచిత కృత్యములు నెరవేర్చుటకై తమ తమ విడిది గృహములకు వెళ్ళారు. దినకరుడు తమ తీక్షతను తగ్గించుకొని రాగ రంజితుడు అగుచున్నాడు. పద్మినీ పరిష్వగము వలన అంటిన మనోరజో రాగమున అన్నట్లుగా దినకరుని కిరణములు వికసించిన చిగురుటాకుల చందమై చక్రవాక పక్షులు కూయసాగినవి. అటు నిటూ కదలలేనివాని వలే అరుణరాగబింబం ఆకాశంలో నిలచినది. సూర్యోదయ సమయంలో వలనే అస్తమయ వేళకూడ అఖిలజనులు లోకబాంధవునకు నమస్కరించారు. మునుపటి తేజస్సు తగ్గితేనేమి తీక్షకరుని బాగ్యమిదియ చాలునని వారు మ్రొక్కులడగసాగిరి. మదనుని కారికి ఓర్వజాలని స్త్రీలు ఇంకా ప్రొద్దు కుంకలేదేమని మేడలపైకెక్కి దిక్కులు చూచుచుండగా పడమటి సముద్రమున మునగనున్న దినకరుని రాగరంజిత కిరణాలు వారి మోములపైన వాటిని వికసిల్లజేసెను. జగద్బాంధవులు తాము కష్టాలలో పడుతూకూడ తమను కొలిచే వారిని కాపాడుతూ ఉంటారు. సూర్యుడు తన వద్దకురాగా పడమటి కొండ అతనిపై చల్లు కుంకుమాక్షితలవల్లె కొండవాలున జారువారుచున్న సెలఏటి చినుకులు ప్రకాశించినవి. చీకటి దొంగ వచ్చుచున్నాడనే బెదురుతో సూర్యుడు తన మోమును సంద్రపు నీటిలో దాచు కొన్నట్లయింది.

ఇటు సూర్యుడు అస్తమించెను.

సౌమ్యుడు కులపాలికా జనులకు వివాహ వేదిక నలంకరింపుమని ఆజ్ఞాపించి పెండ్లి కుమారుని లగ్నమునకు తోడ్కొని రమ్మని పిలువనంపెను. వసంత రుతువు రాగానే పారిజాత వృక్షం తనను తాను అలంకరించు కొన్నట్లుగా విమలవిదుడు వివాహోచితమగు అలంకారమును ధరించి సంధ్యా సమయ కృత్యం తీర్చుకొని కార్వాతికులు పెట్టిన సుముహూర్తం సమీపించినదని భావుకుడు పిలువరాగా అతడు మామ ఇంటికి బయలుదేరెను. సామంతరాజుల కిరీటకాంతులు దివిటీల వెలుగులో వియమందు చూడ నవరత్న ఖచితములైన పసిడి బెత్తముల కాంతులు పురస్త్రీలు పట్టే కర్పూర హారతుల వెలుగులతో చెలిమి చేయచుండ, చిరునవ్వుతో వెలిగి పోతున్న అతని ముఖ సౌందర్యం వింజామరల సంపదలతో ఆలింగనము చేయుచుండ, మంగళ పాఠకుల కైవారములు మంగళవాద్య నినాదాలతో చెట్టపట్టాలు కట్టుచుండగా, మాతలిచే నడుపబడు రథం ఎక్కి, సాటిలేని వైభవంతో ఇంద్రాది దిక్పాలురు సుర నర గరుడ ఉరగ కిన్నర సిద్ధసాధ్య గణములు సేవింపగా ముందు రెండు వరుసలు కట్టి నడచుచుండ, సాకారమైన ఐశ్వర్యము వచ్చుచున్నదా అన్నట్లుగా మామ గారింటికి అల్లుడు తరలి వచ్చాడు. రథం దిగి నడచి వస్తున్న కళ్యాణ పురుషునికి పడతులు తమ బిగి చూపులతో కర్పూర హారతులిచ్చారు. కళ్యాణంకారములతో నొప్ప వివిధ కక్ష్యలను దాటుకొనుచు అంత :పురమందిరం లోపలికి పెండ్లికుమారుడు చేరుకొన్నాడు. తొడలవలె నున్న అరటి కంభములు, చనుమిట్లలయట్లు కలశములు, చెక్కులవలె నున్న నిలువటద్దములు కలిగిన వివాహ వేదిక వద్దకు చేరి రత్న ఖచిత బంగారు గద్దెపై కూర్చున్నాడు. సౌమ్యుడొనరించు మధుపర్కము మొదలగు పూజలను క్రమముగా స్వీకరించెను. రాజు ధారపోసిన కన్యాదానోదకాన్ని పరిగ్రహించాడు. పట్టు తెరసెల్లా చాటున ఉన్న వినయవతిని తిలకించాడు. ఒండొరులను ఉత్సుకతతో చూచుకొనుచున్న ఆ వధూవరులపై మన్మధుడు తన అమ్ములపొది వట్టి పోవునట్లుగా తెర చాటునుండి బాణములను సంధించెను. తెల్లని పట్టు వస్త్రము వారి మన్మధ ఆవేశమును ప్రేరేపించ కర్పూర దీపము వలె తనరెను. మంగళ వాయిద్యాలు, కళ్ళాణ గానములు విన్పించుచుండగా వారి నడుమ నున్న తెరసెల్లా తొలగించబడింది. వరుని చూపులు వధువు వదన కాంతులను గ్రోలెను. వధువు చూపులు రేని మేనిపై తెరలుగా క్రమ్ముకొనెను. తరువాత చంద్రునికి రత్నాభిషేకము అన్నట్లుగా

విమలవిదుడు చంద్రవదన తలపై తలంబ్రాలు పోసెను. కుచ కుంభ భారముతో లేనడుము తెగిపడినదా అన్నట్లున్న వినయవతి చేతులెత్తి పెనిమిటి తలపై ముత్యాల తలంబ్రాలు పోసెను. మన్మధావేశమున చేతివేళ్ళు వణుకుచుండగా విమలవిదుడు వినయవతి కంఠమున మంగళసూత్రమును కట్టెను. గాఢాలింగనమునకు త్వర పడుచున్న ఆ దంపతుల మనములకు ఊరట కల్గునట్లుగా ఒక సుందరి వచ్చి వారి కొంగులు ముడివేసింది. మన్మధుడు రతీదేవి వేలు పట్టుకొని నవ్వుచుండగా ఒక ఒయ్యారి మెల్లన వచ్చి పురోహితుని అనుమతితో వారిద్దరి వ్రేళ్ళు కలిపినది. తర్వాత కళ్యాణ మండపమునకు వచ్చి మంగళ హోమాది కృత్యములు యధావిధి జరిపెను. ఇట్లు వేద విహిత మార్గమున ఐదు రోజుల వివాహం జరిగినది. షడ్రసోపేతములతో బ్రాహ్మణ సంతర్పణలను సౌమ్యుడు జరిపించెను. వివాహ మద్యంలో సమస్త వర్ణముల వారికి అన్నదానం జరిపించెను.

## సోదరుల వివాహము

ఇట్లు ఏలోటు లేకుండా వివాహము జరిగిన సౌమ్యుడు ఆనందించి విక్రముడు మొదలగు సోదరులతో కలసి కుబేరుని వద్దకు వెళ్ళి వినయముతో ఇష్టాగోష్టి జరిపి ఇట్లనెను. మీరు నా తమ్ములు అందమైనట్టి లావణ్యముగల కుమార్తెలు ఉన్నారు. వారిని కూడా మా అల్లుని తమ్ముల కిచ్చి పెండ్లి జరిపించి మా వంశము కృతార్ధము చేయింప గోరుచున్నాను అని పలికెను.

సౌమ్యుని అణకువ కార్యాలోచనలకు కుబేరుడు సంతసించి విమలవిదుని అనుమతితో ఆ వివాహములను మునుపటికన్నా హెచ్చుగా జరిపించెను. వివాహమునకు వచ్చిన రాజులందరకు సౌమ్యుడు ఉచిత సత్కారములు చేసి పెండ్లి కుమారుని వంకతో వచ్చిన దేవతలకు వేదోక్తముగా షోడసోపచార విదుల పూజించి వారి అనుగ్రహమును పొంది ఇతర రాజులను గౌరవించి శుభముహూర్తమున వధూవరులను పయనము చేయించి గోమేధికాది నవరత్నములు, ముత్యాలసరాలు, రత్నలు చెక్కిన పసిడి నగలు, బహువిధ అమూల్య వస్త్రాలు, కుంకుమపువ్వు, అగరును, కస్తూరియు, మంచిగంధము మొదలగు పరిమళ ద్రవ్యాలు, వింజామరలును, సవరములను, ఏనుగు దంతపు భరిణెలు, రత్నస్థగితములగు సరస్వతీ వీణలు, గంభీర స్వరముగల రుద్రవీణలు, ఏనుగులు, గుర్రాలు, దాసదాసీజనాలు, కవులు మొదలగు సమస్త సంభరాలను తన ప్రియ కుమార్తెకు ఆరణంగాపెట్టి సత్కారము చేసి అత్తవారింటికి పయనము గావించెను. సౌమ్యుడు తన తమ్ములను వారి కుమార్తెలను పిలిపించి ఆ బాలికలకు అత్తింట ఎట్లు మెలగాలో గృహస్థధర్మం ఎట్లా నిర్వహించాలో పతివ్రతా ధర్మము లేవియో ఇట్లు ఉపదేశించెను.

## పతివ్రతా ధర్మము

బాలికలారా! మీరు చిన్ననాటి నుండి వినయముతో ప్రవర్తించుచూ కులపాలికా ధర్మముల నవలంబించి పాతివ్రత్య ధర్మములు ఎరిగినవారే. మీకు భోధించ వలసినదేదియు లేదు. లోకాచారము ననుసరించి నాలుగు మాటలు చెప్పెదను. నేను చెప్పబోవు పతివ్రతా ధర్మములతో మెలగుచూ పుత్ర పౌత్రాభివృద్ధి పొందండి. కలనైనా భర్తలయెడ కపట కృత్యములను విడిచి వారి మేలుకై పాటుపడుచూ, దైవ బుద్ధితో వారిని పూజిస్తూ వారికి సేవచేస్తూ వారి కోపించిన కొట్టిన తిట్టిన మారు పలకక ఓర్పుగా ఉంటూ పూర్వపు పతివ్రతల కీర్తిని పొందండి. భర్త అన్యవనితాను రక్తులైన గర్వముతో కోపించకండి. గర్వమును అజాగ్రత్తను విడిచి పతుల మనస్సునకు నచ్చునట్లు మెలగండి. మాటల్లో చూపుల్లో చేతల్లో కోర్కెలలో వింతగా క్రొత్తగా ఉండుట న్యాయము కాదు. మన్మధ, నలకూబర, జయంత, వసంతలను పోలు సౌందర్యవంతులైనను పరపురుషులను గడ్డిపోచగా భావించండి. స్నానం, భోజనం, పడక భర్తలకన్నా ముందే ఆచరింపదగదు. భర్తలు వచ్చినప్పుడు ఆసన, పాద్యాది విధులను శ్రద్ధాభక్తులతో తామే చేయవలెను. ఇతరులచే చేయించకూడదు. స్నాన, భోజన, శయనాదులకు తగిన ఏర్పాట్లను పతులకు చేయుచుండవలెను. ధన ధాన్యాదులు వ్యర్ధమవుతుంటే ఉపేక్షించరాదు. గృహశుద్ధి, స్థలసుద్ధి, భాండశుద్ధి ప్రతిరోజూ సదాచార సంపత్తితో చేస్తుండాలి. బంధుజనులకు భోజన భోజనాదుల సమకూలిస్తే మీకు మంచి పేరు వస్తుంది.

తలవాకిట తిరుగుట, చెడ్డ స్త్రీలతో స్నేహము, పోట్లాటకు వెళ్ళుట, కేరింతలాడుచూ గట్టిగా నవ్వుట, ప్రల్లదపు మాటలాడుట మగువలకు తగదు. భర్తలు పనులమీద దేశాంతరము వెళ్ళినపుడు తల దువ్వుకొని పువ్వులు పెట్టుకొనుట, మేలు దుస్తులు కట్టుట, నగలు అలంకరించుకొనుట మాని వారియందే మనస్సు నుంచుకొని వారి రాకను కోరుచు వ్రతాలను ఆచరించు చుండవలెను. అత్త మామల యందు భక్తి కలిగి వారు చెప్పినట్లు అణకువతో పనులు చేస్తూ, దేవ, బ్రాహ్మణ, అతిధి, గురు పూజలు చేస్తూ, ప్రియము, ఓర్పు, మృదువుగా

ఉండుట మంచిది. భర్త శాంత చిత్తుడుగా ఉన్నాడని అణకువ మరచి ప్రవర్తింపరాదు. కోపించినపుడు క్రూరుడని విడువరాదు. అత్త మామలకు నిత్యము భోజన స్నాన పాదాది సౌకర్యములు సమకూర్చాలి. భర్తలను లోబరుచుకొనుటకు ధర్మమును విడువక నడచుకొనుట మంచి స్వభావము కలగి ఉండుట తప్ప వేరొక ఉపాయము లేదు. స్త్రీలకు భర్త తప్ప వేరొక దైవము లేదు. భర్త అనురాగం పొందితే విలువైన వస్త్రములు, నగలు, ధనధాన్య సంపత్తి, గౌరవము, సత్సంతానము, కీర్తి, సద్గతి కల్గును. ఇన్ని లాభములు వేరొక విధముగా స్త్రీకి పొంద శక్యము కాదు. ఎంతో కష్టపడితే తప్ప ఇహ పర సౌఖ్యములు లబింపవు. పతి శుశ్రూష స్త్రీలకు సద్గతి లభించును. భయ భక్తులతో ప్రేమానురాగములతో పతిని సేవించిన అతడే అభ్యుదయము నొసంగును. ఇంటికి వచ్చిన పెనిమిటికి ఆసనాది విధులను ఒనరించుటకు

పరిజనుల నియోగించితినని ఊరకుండుట మాని తానుకూడా ఆయా పనులను ప్రేమతో ఆచరించాలి. మగడు తనతో చెప్పిన సంగతులు మనసు కలిసిన వారితోనైన చెప్పకూడదు. అట్లు చేసిన మరో విధంగా వారు మగవాని మనస్సును మీకు విముఖంగా మార్చగలరు. మగని బంధువులను స్నేహితులను భోజనాదులఎడ ఆదరించుచూ కపటము లేని భక్తి కలిగియుండవలెను. మగనికి శత్రువులైనవారు తనకు దగ్గర బంధువులైనను వారిని గైకొనుట మంచిది కాదు. ఏకాంతంలో అన్న దమ్ములతో, తండ్రీ కొడుకులతోనైన మాట్లాడుట సతికి తగదు. సత్కుల సంజాతలు, పవిత్ర చరిత్రలు, పరిశుద్ధ మనస్కులు నైన పతివ్రతలతో చెలిమి స్నేహదాయకం కాగలదు. దుశ్చరితలు, లోకనింద్యాప్రవర్తనలు గల స్త్రీల సాంగత్యం వలదు. ఈవిధంగా సౌమ్యుడు తన బాలికలకు మంచి బుద్దులు గరపి అల్లుళ్ళకు అప్పగించి వీరు చిన్నవారు వీరు చేయు తప్పలను మన్నించుము అని సవినయముగా విన్నవించి అప్పగింతలు పెట్టెను.

## కనకాపురానికి రాణుల రాక

విమలవిదుడు తన తమ్ములతో కుబేరునితో కూడ పయనమై తన నగరమునకు అతివైభవముతో ప్రవేశించి ఇంద్రాది దేవతలకు భక్తితో కానుకలిచ్చి గౌరవించి వారివారి తావులకు పంపెను. బ్రాహ్మణులను, రాజన్యులను గౌరవించి పంపెను. కుబేరుడు తాను సంకల్పించిన పని ఏలోటు లేకుండా నెరవేర్చి విమలవిదుని అతని తమ్ములను కూర్చుండ బెట్టుకొని మితముగా వచించెను. ఓ భూలోక భూషణములారా మిత్రులారా మీరు చిన్ననాట నుండి సత్త్వవర్తనచే త్రిమూర్తులను గూడ లోబరుచుకొని ఇట్టి ఉన్నతమైన ఇంద్రాది దుర్లభమైన అభివృద్ధిని పొందిరి. మీకు ఉపదేశింప వలసిన అంశము లేవియు లేవు. మీ నడవడికచే అందరకు మీరే ఉపదేశ కర్తలు అయినను స్నేహధర్మం నన్నట్లు ప్రేరేపించుచున్నది నా పలుకుల వినుము అనగా మనుతనయులు వినయముతో వంగిన శిరస్సు కలవారై చేతుల జోడించి దేవా నీకు మాయందు కలిగిన అ కారణము వాత్సల్యము విలువ కట్టలేనిది. మీ వంటి మహాత్ములు మా యెడ ప్రసన్నులగుట జన్మాంతర పుణ్యఫలము కాని వేరొండుకాదు. మీవంటి మహాత్ములు మాయందు ఇట్లు మీ పలుకులను పూవులుగా తల ధరించగలవారము అనుగ్రహింపుడు అనిన వారి భక్తి ప్రపత్తులకు ఆనందించి ఇట్లనెను.

తెలియ దగిన దంతయు తెలుసుకొన్న సకల శాస్త్ర పారంగతులైన మీకు ఉపదేశింప వలసినది ఏమియు లేదు. యౌవన మదము సూర్యుని కాంతి కంటే, రత్నప్రభల కంటే, దీపపు వెలుగుల కంటే దారుణమైనది. ధన మదము ఉపశాంతిని పొంగనీటువంటి దారుణమైనది. ఐశ్వర్య తిమిరము వల్ల కలుగు అంధత్వము సిద్ధాంజనాలు వేసినా తగ్గదు. విషయ విషాద మోహము మూలికలు మంత్రాలచే ఉపశమింపదు. విషయానురాగ మాలిన్యము నిత్య స్నానముచే పరిశుభ్రము కాదు. రాజభోగాల సన్నిహితమైకం తెల్లవారినను మెలుకువలేమిని ఘోరమైనది. కావున విస్తరించ చెప్పవలసి వచ్చినది. ఆగర్భసంపద, అభినవయౌవనము, అహంకారం, అమానుషశక్తి పుత్వము అను దుష్ట చతుష్టమయం అనర్దపరంపర కదా! వీనిలో ఒక్కొక్కటియే దుర్నీతికి ఆటపట్టులు. అన్నియు కూడిన ఏమి చెప్పవచ్చును.

యౌవనము పొడచూపగానే చదువు మూల పడుతుంది. ఆ చదువు వివేక మిచ్చినదే అయినప్పటికీ మనిషి తెలివి కలుషిత మౌతుంది. కోడెగాండ్ర చూపులు తెల్లగా శుభ్రంగానే ఉన్నప్పటికీ అవి రాగ రంజితములుగానే ఉంటాయి. యవ్వన సమయమందు మానవ ప్రకృతి రాజోవిభ్రాంతితో కూడి సుడిగాలి పండుటాకును ఎగరగొట్టి నట్లుగా పురుషుని మనసును త్రిప్పచుండును. విషయోప భోగమగు మరిచాక ఇంద్రియాలనెడి జింకలను హరిస్తూ దురంతంగా ఉంటుంది. విషయము లందు ఆసక్తి దిగ్భ్రాంతివలె దుర్మార్గము నందు ప్రవర్తింప చేయుచూ చేరువును.

మీవంటి వారే సదోపదేశమునకు పాత్రులు స్ఫటిక మణిలో చంద్ర కిరణాలు ప్రతిఫలించి నట్లుగా పరిశుద్ధమైన మనస్సుగల వారియందు సదోపదేశ గుణములు సుఖముగా ప్రవేశించును. సద్గురు వాక్యము జలమువలె నిర్మలమయ్యు దౌర్భాగ్యమునకు కర్ణ శూలముగా నుండును. పూర్ణచంద్రుడు చీకట్లను పోగొట్టునట్లు సద్గురూపదేశము దోషములను దూషించును. మీరింకను రసాస్వాద నలో లోలురు కాలేదు. ఇది సదోపదేశమునకు తగిన సమయము పుష్పబాణములచే పీడింపబడిన హృదయమునందు సదోపదేశము జలము వలె జారిపోవును. వంశముగాని శాస్త్రముగాని దుష్టచిత్తునకు వినయమునివ్వవు. మంచి గంధపు చెక్కలనుండి కలిగిన అగ్ని చురక కుందునా? సముద్ర జలములనుండి పుట్టిబడబాగ్ని దహింపకుండునా? పురుషులకు గురోపదేశము సమస్త కల్మషములను కడుగదగిన జల స్నానమును తల నెరియుట వంటి నైరూప్యములేని వార్దక్యమిది. రక్త మాంసాది దోష దూషితము గాని బలుపు అది. బంగారముచేచేయబడిన కర్ణాభరణము అది ఎన్నడూ తగ్గని వెలుగది. శరీరానికి ఇంద్రియాలకు అస్వస్థత కలుగజేయని జాగరణమది.

ప్రత్యేక పృథ్వీపతులు తప్పక హితోపదేశ మనుగ్రహింప దగినది. ఏలననగా రాజులకు హితముపదేశించువారు అరుదు. ప్రతిధ్వని వలె జనులు రాజు మాటలను భయముచే అనుసరించి పలుకుదురు. గర్విష్టులు సదుపదేశమును వినవేవినరు. ఒకప్పుడు ఆలకించి నను మేలు చెప్పవారిని ఆదరించక దుఃఖపెట్టెదరు. దురహంకారము విషజ్వరముచే రాజప్రకృతి విహ్వలమైనది. సంపదలు దురభిమాన ఉన్మదమును పుట్టించును. యౌవన, ధన, సంపదలు ఇట్లు ఆపాత కారకాలు.

మొదట సంపదలను గురించి ఆలోచిద్దాం. సిరి కత్తులగుంపు అనే కలువల అడవిలో తిరుగు తుమ్మెద. ఈమె పాల సముద్రము నుండి పుట్టునపుడు ప్రాని చివుళ్ళ వలన రాగమును చంద్రునినుండి వక్రత్వమును ఉచ్చైశ్రవము వలన చంచలత్వమును, కాలకూట విషము వలన మోహన శక్తిని, మదిర వలన మదమును, కౌస్తుభమణి వలన కాటిన్యమును, సహవాస దోషంలో సంతరించుకొని వచ్చినది. ప్రపంచమున ఇంత అపరిచితమైనది వేరొకటి లేదు. ఆమె అనార్య దొరికినదయ్యు ప్రయాసచే కాపాడబడును. దృఢములగు గుణములచే కట్టబడినదయ్యు విడిపించుకొని పోవును. పరిచయమును చూడదు. సత్కుల సంజాతులను ఈమె లెక్క చేయదు. రూపమును చూడదు. వంశానుక్రమమును అనుసరింపదు. శీలమును పరిశీలింపదు. నేర్పు గణింపదు. శ్రుతమును విననియ్యదు. ధర్మముననుసరింపదు. వితరణమును గౌరవించదు. విశేష ప్రజ్ఞతను గుర్తించదు. సదాచారమును పరిపాలించదు. సత్యమును తెలిసి కొనదు.లక్షణములను ప్రమాణముగా తీసుకొనదు ప్రపంచమున గంధర్వ నగర లేఖికవలె చూచుచుండగనే నశించును. బ్రమణ సంస్కారముతో కూడినదా అన్నట్లు తిరుగుచునే ఉండును. కాసారములందు సంచరించు నపుడు గ్రుచ్చుకొన్న తామరకాడ ముళ్ళచే బాధ పడుచున్నదా అన్నట్లు ఒకచోట స్థిరముగా నిలువదు. రాజాధ రాజుల గృహములయందు ఉండే మత్త గజముల మదజలాలను త్రాగి మత్తెక్కినదా అన్నట్లు ఎంత పట్టుకొన్నను నిలవక తూగుతూనే ఉంటుంది. పరుషత్వం నేర్చుకొనుటకే అన్నట్లు కత్తి అంచున నుండును. శ్రీమన్నారాయణుని విశ్వరూపత్వమును గ్రహించుటకు ఆశ్రయించి ఉండవలసినది తీగవలె చెట్లను ఆశ్రయించును. గంగవలె వసుధ జనని అయ్యు ఈసిరి నీటిబుడగ వంటిది. పాతాళ గుహ వలె తమోబంధురము బలము లేనివానినైనను ఉన్మత్తునిగా చేయును. విద్యావంతులను ఈర్ష్యతో దరిచేరదు. సత్కుల సంజాతుని, పాముని దాటిపోయునట్లు దిగవిడిచిపోవును. దాతలను పీడకలవలె తలవదు. పాపాత్మునివలె వినయవంతునిచేరదు.

పరస్పర విరుద్ధమైన ఇంద్రజాలం మాదిరిగా తన చరిత్రను లోకమునందు వెల్లడిచేయును. ఎట్లనగా ఎల్లప్పడు ఉద్రేకాన్ని కలిగించే ఈమె తృష్ణను వృద్ధి చేయును. అమృతమునకు సోదరి అయ్యు కటుతర విపాక విగ్రహవతి అయ్యు కంటికి కనిపించదు. పురుషోత్తముని సతి అయ్యు దుష్ట జనులకు ప్రియురాలు. ఈమె విపరీత దీపశిఖ వలె కజ్జల మలినమగు కర్మనే చేయును. ఇది అట్లుండనిండు. ఈమె దురాశ లతికలను పెంచే ఉదకదార ఇంద్రియ మృగములకు కిరతగీతి. శాస్త్రావలోకనమునకు తిమిరోద్గతి సమస్త దుర్నయములకు పురస్సర పతాటిక సదన రాజహంసలకు అకాలవృష్టి కపటనాటకమునకు నాంది ప్రస్థావన ఈచెడిపే తేత వచింప బడనివాడిని నేను చూడలేదు. ఈమె చిత్తరువునందున్నను చలించును. తలిచినంతనే వంచించును. ఇట్టి దురాచార అగు లక్ష్మిచే పరిగ్రహింప బడినవారు భాదింపబడుచు సమస్త దుర్నయములకు ఆటపట్టు లగుదురు.

## రాజ్యలక్ష్మీ పరిగ్రహీతలు

రాజ్యలక్ష్మీ పరిగ్రహీతలగు రాజులకు అభిషేక కాలమునందే మంగళ కలశోదకముచేత దాక్షిణ్యము కడుగబడును. అభిషేక సమయములోని హోమ ధూపములచే హృదయం మలినమగును. బంగరు బెత్తముల చేత సద్గుణాలు దూరముగా తోలబడును. శ్వేత ఛత్రములచేత పరలోక దృష్టి మరుగుపడును. వింజామరల గాలిలో సత్యవాదిత్వం దూలగొట్టబడును. బడలికచే తెరువబడిన పక్షిముక్కు కొనలవలె చంచలములును, మిణుగురు పురుగు కాంతివలె ముహూర్తకాల మనోహరములను, విద్వజ్జన గర్హితములును అగు సంపదలచే రాజుల మతి పోగొట్టబడును. ఇంద్రియములచే పీడింపబడు మనసులు కలతచెంది ఒడుదుడుకును పొందుదురు. భూతముల చేత తిరస్కరింప బడినయట్లు ఉందురు. పిశాచములచే పీడింపబడురు వాలివలె ఉందురు. ఎండ్రి వలె వంకర నడకలు నడిచెదరు. సమీపించిన మరణము కలవానివలె తమ బంధువులను కూడ చూడరు. ఆశా విష మూర్చితులై జగమును బంగారు మయముగా చూచెదరు. పాప సమూహముచే రోజురోజుకు బలియచుందురు. కాలము కాని కాలమునందు పూచిన పువ్వులవలె చూచుటకు అందంగా ఉండి ప్రపంచ నాశనమునకు కారణభూతులై యుందురు. పుట్ట పుట్టిన గడ్డి పరకలమీది జల బందువులవలె అధోగతిని కూడ గుర్తించలేరు.

స్వార్దముతో ఇట్టి రాజులచుట్టు చేరే కొంగల గుంపులు కొందరు ఉంటారు. జూదం, వినోదమనియు, పరస్త్రీ సాంగత్యం ప్రౌఢత్వమనియు, వేట పరిశ్రమ అనియు, త్రాగుడు విలాసమనియు, మత్తత శూరత్వమనియు, ఇల్లాలిని విడుచుట వ్యసనం లేకుండుట అనియు, పెద్దల మాటను కాదనుట ఇతరులకు లోబడకుండుట అనియు, సేవకులను లోబరుచు కొనలేకుండుట, చల్లని ప్రభుత్వ మనియు, వార వనితాభి రక్తి రసికత అనియు, పెద్ద తప్పలను వినకుండుట మహానుభావత్వమనియు, అవమానమును సహించుట క్షమయనియు, స్వేచ్ఛ ప్రవర్తనము ప్రభుత్వ లక్షణమనియు, దేవ బ్రాహ్మణ తిరస్కరణము బలిమి అనియు, బట్టు వారి పొగడ్త కీర్తి ప్రకటన మనియు, చపలత్వము ఉత్సాహమనియు, విచక్షణ రాహిత్యము నిస్పక్షపాత బుద్ధి అనియు, ఇట్లు దోషములను కూడ గుణములనుగా మార్చి ఇచ్చకములు ఆడుచుందురు.

దుర్జనుల పొగడ్తలకు రాజులు వంచితులగుచు ధన మద చిత్తులై లేని ఆధిక్యతను పెట్టుకొనుచు, మనుష్య ధర్మము కలవారయ్యు, తాము దేవతాంశ సంభూతులమని తమను తామే వంచించుకొంటూ దేవలోక ఉచితమైన పనులు చేయ తలపెట్టి నవ్వుల పాలగుదురు. ఇతర జనులు తమను అనుకరిస్తే ఆనందింతురు. వీరికి రెండు చేతులే ఉన్న మరో రెండు లోపల ఉన్నవని భావించుకొందురు. నుదుట తమకు మూడో కన్ను ఉన్నదని అది చర్మముతో కప్పబడి ఉన్నదని తలచు కొందురు. ప్రజలకు దర్శనమిచ్చుట మహానుగ్రహముగా తలచెదరు. కటాక్షప్రసారము కూడ మహోపకారముగా ఆలోచించెదరు. మాటలాడుటను సంపదలు పంచి పెట్టమని ఊహింతురు. ఆజ్ఞ నొసగుట వర ప్రదానముగా ఎన్నుదురు. తమ స్పర్శను పవిత్రముగా తలచెదరు. లేని దేవతా మహత్యమును తమ యందు ఆరోపించుకొని దేవతలకు నమస్కరింపరు. బ్రాహ్మణులను పూజింపరు. గౌరవింప దగిన వారిని గౌరవింపరు. అర్చింప దగిన వారిని అర్చింపరు. మన్నింప దగిన వారిని మన్నింపరు. మ్రొక్క దగిన వారిని మ్రొక్కరు. గురు జనులు వచ్చిన లేవరు. పండితులను నిరార్ధక వ్రతాదులచే విషయభోగ సౌఖ్యాలను వదులుకొను మూర్ఖులని పరిహసిందురు. వృద్ధ జనుల హిత వాక్యములను ముదిపిచ్చి మాటలని ఉపేక్షింతురు. మంత్రుల హితోక్తులను వినరు. మంచి చెప్పవారిపై కోపించెదరు. ఎవరి దగ్గర జేరి రాత్రింబవళ్ళు చేతులు జోడించుకొని ఇష్టదేవతవలె పొగడుదురో వారిని అభినందింతురు. వానితో మాట్లాడుదురు. వానిని చేరదీయుదురు. వానిని పోషింతురు. వానితో గూడి సుఖములను అనుభవింతురు. వాని పలుకులను ఆలకింతురు. వాడు త్రిప్పినట్లు తిరుగుదురు. వానిని గౌరవించెదరు. వానిని భాంధవునిగా నమ్ముదురు. వాడు భార్యను విడువుమనిన విడిచెదరు. వాడు చెప్పినదెల్లా చేయుచుందురు. దయాహీనమైన కుటిల శాస్త్రము వీరికి ప్రమాణము. శత్రువులను నశింపజేయు శ్యేన యాగాది క్రూరకర్మలు చేయువారు వారికి పురోహితులు. ఇతరులను ఆక్రమించు యందు ఆసక్తి గల మంత్రులు వారికి ఉపదేష్టలు. రాజులచే అనుభవింపబడి విడువబడిన సిరియందు వారికి ఆసక్తి. మారణాత్మకములైన క్రూరశాస్త్రములయందు వారికి పాండిత్యము సహజ ప్రేమార్ద్ర హృదయములగు సహోద రాదుల వారికి దూరముగా ఉంచదగినవారు. ఇట్టి కుటిలమును కష్ట ప్రాయములైన రాజ్య తంత్రములందు మోహాంధకార బంధురమైన యవ్వనమందు మీరు లోకులముందు నగుబాటు కాకుండుటకు ప్రయత్నించండి. సజ్జనులచే నిందను, గురువులచే తిరస్కరణమును, మిత్రులచే ఉపాలంభనమును, విద్వజ్జనుల నిరసనను, విటులచే అవమానమును, నేర్పరులచే నగుబాటును, ధూర్తబకముల చేత ఆస్వాదింప బడుటను, నక్కలచే భక్షింపబడుటను, స్త్రీలకు లోనగుటను, సిరిచే విడంబింప బడుటను, పొందక యుండునట్లు మెలగండి.

మీరు చిన్ననాటి నుండి ధీరులు. కట్టుదిట్టముగా మెలగుచున్నవారు కావున మిమ్ములను ఈ దోషములు ఆశ్రయింపజాలవు. ఐనను మీసద్గుణముల వలన కలిగిన సంతసమును, ప్రేమయు నన్ను ప్రేరేపించగా ఇట్లు హితము పలికితిని. కులక్రమాగతమగు ఈరాజ్యభారమును సునాయాసముగా స్వీకరించండి. శత్రువుల తలలు వంచండి. బంధువులకు ఔన్నత్యమును కలిగింపుడు. మిత్రులను చేరదీసి ఆప్తులను పోషింపుడు. ఇట్లు అనేక విధముల కుబేరుడు హితోపదేశముచేసి తన అలకాపురమునకు వెళ్లెను.

## విమలవిదుని రాజ్యపాలన

విమలవిదుడు తన తమ్ములతో చతుస్సముద్రముదిత అయిన ధరాతలమును ఏకచ్ఛత్రముగా పరిపాలించుచుండెను. కామము వల్ల కలిగే వేట మొదలగు పది వ్యసనములను, కోపం నుండి పుట్టే పిసినారి తనము మొదలగు అష్ట వ్యసనములను ఈరెండింటికి మూలమైన లోభమును విడచి, ఇంద్రియాలను జయించినవాడై ప్రజానురంజకుడై పరిపాలించుచుండెను. సులభమైన పని ఒకరిచేత చేయించుట కష్టమైనప్పుడు పిత్రు పితామహ క్రమానుగతులు, దృష్టా దృష్టార్థ శాస్త్రజ్ఞులు, విక్రాంతులు, లబ్దలక్షులు, విశుద్ధ కుల సంజాతులు అగు మంత్రులను కూడి, నిత్యము సామాన్యమైన సంధి, నిగ్రహానికరమును, దండ, కోశ, పుర, రాష్ట్రాత్మకమగు చతుర్విధ స్థానమును, ఆత్మగతమును, రాష్ట్రగతమగు గుప్తిని లభించిన ధనమునకు సత్పాత్ర ప్రతిపాదనాత్మకమగు ప్రశమనమును, చింతించుచూ వేర్వేర అమాత్యుల అభిప్రాయమును తెలిసికొని అన్నింటిలో తనకేది మేలో దానిని ఆచరించుచుండెను. ఆమంత్రులలో ధార్మికతలో విశిష్టుడు, విద్వాంసుడునగు నతనిని ప్రధాన మంత్రిని చేసి అతని షడ్గుణములతో కూడిన ప్రకృష్టమంత్రము నిరూపించి, అతని యెడ నమ్మకముంచి కార్యవర్గము అతనికి విధేయులుగా నుండునట్లు చేసి, మిగిలిన వారందరూ కూడా పరిశుద్ధులు ప్రజ్ఞా విశారదులుగా, ధర్మ నిరతులుగా నుండునట్లు చేసి, అందరను కర్మ సచివులనుగా చేయుచుండెను. అధర్వణవేద పారగుడగు పురోహితుని నియమించుకొని గృహర్మక్తములయున కర్మల నాచరించుటకు ఋత్విక్కులను ఏర్పరుచుకొని ఆరోజు అశ్వమేధాది యాగములు చేసినాడు. ధరణీసురులకు గృహ శయ్యాదుల, సువర్ణ వస్త్రాదుల నొసంగుచూ, గురుకులముల నుండి వచ్చిన బ్రాహ్మణులను పూజించుచుండెను. నెలనెలా, ఏటేటా రావలసిన పన్నులను రాబట్టుకుంటూ, ఎవ్వరికి బాధ కలుగకుండా తన ప్రజలను తండ్రివలె ప్రేమతో చూచుచుండెను. పవిత్రమైన బ్రాహ్మణులకు ఇవ్వబడిన ధనము దొంగలు దొంగిలించలేరు. శత్రువులు లాక్కొనలేరు. విమలవిదుడు లెక్కకు అధికంగా ధనాన్ని సత్పాత్రదానం చేస్తూ, అజేయమైన భూ హిరణ్యాదికమును జయిస్తూ, అట్టి ధనాన్ని రక్షిస్తూ, వృద్ధిచేస్తూ, సద్వినియోగం చేయసాగెను. ప్రతి నిత్యం గజాస్వాది యుద్ధాభ్యాసం చేస్తూ, అస్త్ర విద్యాది పరాక్రముడై, వ్యసనాల రూపంలో ఉండే శత్రువులను నాశనం చేస్తూ, కపటం లేకుండా మంత్రులతో ధర్మ రక్షణ చేస్తూ, నిష్కపటంగా ప్రజాపాలన చేస్తూ, ఉచితరీతి భోగాలను అనుభవిస్తూ, సుఖముగా ఉండెను.

## విశ్వంభరుని తో భేట

ఒకనాడు విమలవిదుడు మొదలగు షోషశ రాజకుమారులు తమతమ భార్యలతో భవాని శంకరులను దర్శించి పూజించుటకై దివ్య విమానము నెక్కి ఆకాశమార్గాన చనుచుండ నడి త్రోవలో ఒకచోట వారి విమానము ఆగి పోగా ఆశ్చర్యపడి రాకుమారులు విమానము నడిపించుటకు ప్రయత్నించిన అది కదలలేదు. విమలవిదుడు తోకత్రొక్కిన పామువలె క్రోధముతో నాలుగువైపుల పరికించి చూడగా భస్మోద్ధూళిత శరీరుడైన ఒకజడధారి వచ్చి విమలవిదునితో ఇట్లు పలికెను.

ఓ మనుకుల తిలకా! సకల సురాసుర పూజ్యుడగు విశ్వంభరుడనే ముని శ్రేష్టుడు క్రింది భాగాన తన ఆశ్రమములో నావంటి శిష్యులకు వేదవేదాంగ ఉపదేశం చేయుచున్నాడు. ఆ మహాత్ముని ఆశ్రమము మీదినుండి ఇంద్రాదులు కూడ వెళ్ళలేరు కావున నీవు కోపమును విడచి సోదరులతో వెళ్ళి ఆ మహానుభావునకు వందనము చేసి నీతోవన వెళ్ళు. లేకుండిన నీకు కీడు కలుగును. నీవు ధార్మికుడవు ప్రజాపాలకుడవు సకల సుగుణ భూషణడువు అని తలచి విశ్వంభరుడు నీకు హాని జరగరాదని తెలియజేసెను అని చెప్పెను.

విమలవిదుడు నేను త్రిమూర్తుల ఉపాసకుడను, వారికి తప్ప వేరొకరికి వందనము చేయరాదని నాపూనిక. కావున మాకీ మునివర్యునితో పని యేమి? మాతోవన మేము పోయెదమని పలికెను.

దానికి ఆజడధారి ఇట్లను. మా కులపతి అగు విశ్వంభరుని పూనికను చెప్పెద విను. బ్రహ్మ మొదలు పురుగు దాక ప్రాణ కోటిలో ఎవ్వడైన తన ఆశ్రమం మీదనుండి వెళ్ళిన శపించును. ఎరుగక వెళ్ళిన వాడు శరణాగతుడైన రక్షించును. మీరు వచ్చుటను మాగురువు యోగాదృష్టితో చూచి లోకహితము కొరకు త్రిమూర్తులచే మీరు అనుగ్రహింప బడిరనియు ధర్మ సంస్థాపన చేయుచూ ప్రజాపానము చేయు చున్నారనియు మానవులయ్యు దేవ సమానులనియు తలపోసి మిమ్ములను కరుణించ దలచి నన్ను మీ వద్దకు పంపారు. కావున మీరు పట్టుదలమాని ముని వర్యుని కడకు వచ్చి శరణార్దులై అతనికి నమస్కరించి యదేచ్ఛగా వెళ్ళండి. మీరు లోకోపకారులు కనుక ఇంత వరకు చెప్పవలసి వచ్చెను. క్షత్రియులు బ్రాహ్మణులకు నమస్కరించుట తప్పకాదు. విశ్వంభరుడు నీ ఇష్ట దైవములగు త్రిమూర్తులకును వందనీయుడు. నా మాట విని నేను చెప్పినట్లు చేయండి అని జటాధారి విమలవిదునకు భోదించెను.

విమలవిదుడు తన చెక్కిళ్ళపై చిరునవ్వు ప్రసరింపగా ఇట్లనియె ఓహో! ఈముని స్వభావం ఏమని చెప్పవచ్చును. తన ఆశ్రమము మీదుగా వెళ్ళే ప్రాణులను శపించునట ఇది రాక్షస కృత్యము అనిపించును. ఆకాశయానము చేసే నోరు లేని పక్షులకు ఈముని వలన అకాల మృత్యువు కలుగుచున్నది. ఇతని దురహంకారము చూస్తే లోక కంఠకుడనిపించును. నా రాజ్యములో ఇట్టి అసం గతము మంచిగా తోచుటలేదు. కావున వీనిని దండించెదను. అయునను తొందరపడకూడదని ఓర్పుతో ఆమునికునారునితో ఇట్లనియె.

॥ముని కుమారా! నీవు మీ గురువు కడకేగి తాపసులగు మీకు ఇట్టి జీవబాధాకరమైన ప్రవర్తన తగదు. నేటినుండి నీ పట్టుదలను విడిచి అన్ని ప్రాణులను మీ ఆశ్రమం మీదుగా పోనిండు. ఇంతమాత్రమున మీ మహత్యమునకు ఏ కొరతరాదు. మీరు శమదమాది సంపన్నులు. నిత్యానిత్యవస్తు విచక్షణ తెలిసినవారు. భోగభాగ్యములందు వైరాగ్యము కలవారు. దేహాదిఅనిత్య వస్తువుల యెడ అభిమానము తో , నిత్యము ఆత్మ తత్వానుసంధానం చేయుచు అఖండానంద సామ్రాజ్య పట్టాభిషిక్తులై, మావంటి అజ్ఞానులకు సదుపదేశం చేయదగిన జ్ఞానులైన మీకు పామరులకు ఉండే దురభిమానం ఉండకూడదు॥ అని నా ప్రార్దనగా విన్నవించి అతడు ఆనతిచ్చినదానిని మరల నాకు తెలియజేయుము అని పలికెను.

మునికుమారుడు అట్లే అని విశ్వంభరుని వద్దకు వెళ్ళి విమలవిదుని మాటలు చెప్పగా ఆ మునివరుడు అగ్గిపై గుగ్గిలం చల్లినట్లు మండిపడుచూ సంవర్త సమయ సముదిత దివాకరుని వలె రోష ఘూర్ణాయమాన నయనుడై, కనుబొమ్మలు ముడిపెట్టి ఇట్లు పలికెను.

౹౹ఆహా! ఈ క్షత్రియునకు ఇంత గర్వము ముదిరినదా? తనకు నేను వందనీయుడనుగానా? జగద్గురువగు నాకు వీడు తత్త్వోప దేశం చేస్తాడా? ఏమి వ్యత్యయము వీని నిమిషంలో బూడిద చేస్తాను.౹౹ అని మండిపడుచూ విమలవిదుని విమానము కడకు వచ్చి , ౹౹ఓ దురాత్ముడా! ఏమంటివి? ఇంకొకసారి నేను వినేటట్టుగా చెప్పు. ప్రజాపాలకుడవని కరుణించి అనునయంతో నా శిష్యునితో నీకు ముందుగా తెలియజేసినందుకు ఇదా ఫలితం? త్రిలోకనాధుడగు ఇంద్రుడు కూడ నాతో ఇట్లు మాట్లాడలేదు. నేటితో నా ప్రతిజ్ఞను నీవు మానిపిస్తావా? త్రిమీర్తులిచ్చిన వరములతో గర్విస్తున్నావు? పువ్వుతో పుట్టి పువ్వులోనే మాడునట్లు చేస్తాను. ముగ్గురు దేవతల కరుణకలదని గర్విస్తున్నావు. నీవేల్పులువచ్చి అడ్డుపడిన విడువక నేటితోనిన్ను రూపుమాపెదను అని రోషావేశములతో చిందులు త్రొక్కుచుండెను.

విమలవిదుడు తనలో ఇతడు బ్రాహ్మణుడని ఉపేక్షించుట తగదు. నాఇష్ట దైవములను కూడ అవమాన పరుచుచున్నాడు. వీని ఇప్పడు దండించకపోయినా త్రిమూర్తులకు అపచారము చేసినవాడనగుదును. బ్రహ్మహత్యా దోషము నాకిక అంటదు అని భావించి కత్తి దూసి మూర్తిత్రయ నిందకుడు ప్రాణినృశంసకుడు అయిన తాపసిపై దుముకబోగా తమ్ములు అడ్డగించి మన పరాక్రమమునకు ఇది సమయము కాదు. ఇతడు బ్రాహ్మణుడు భూసురుడంత నేరము చేసినా వధార్హుడుకాడు. నీవెరుగని ధర్మములు ఉన్నావా? క్షమింపు మంటూ పట్టుకొని ఆపిరి.

విశ్వంబరుడు నెయ్యి పోసిన అగ్ని వలె మండిపడి తన కమండలములోని నీటిని తీసుకొని నన్నొక నువ్వుగింజ లాగా నలికి వేస్తావా దురాత్మకా నీవు నీసోదరుతో కూడ రాజ్య బ్రష్టుడవై తిలఘాతకుడవు కమ్ము అని శపించి శిష్యులతో తన ఆశ్రమమునకు చనెను. విమలవిదుడు ఏమి చేయాలో తోచక తన విమానము కదలకుండుట చూచి త్రిమూర్తులను మనస్సులో ధ్యానించి కొంతసేపటికి సమాధి నుండి బయటకు వచ్చి త్రిమూర్తులను ఇట్లు ప్రార్దించెను.

దేవాది దేవులారా! మహానుభావులారా! సకలలోక విదిత ప్రభావులారా! వాసుదేవ విధివాసుదేవులారా! అనన్య భక్తితో మేము మిమ్ము నమ్మి ఉన్నవారము. మమ్ములను రక్షించవలసిన సమయమిది. కడుపులోని చల్ల కదలకుండ నీ రక్షణలో నుండి ఒక మహాముని మాత్రుని చేత చిక్కి ఇడుమల పాలైన మమ్ము ఉపేక్షించుట మీకు న్యాయముకాదు. మీయందు మేము చేసిన నేరమేమిలేదు. రేయింబవళ్ళు మా శ్రేయస్సును కనిపెట్టుచూ ప్రోచుచున్న మీరు మమ్ములను ఏమారుట న్యాయము కాదు. మీలో ఒకరిని నమ్ముకొన్న వారికి ఎట్టి కష్టములు రావు. మిమ్ము ముగ్గురును అభేధ బుద్ధితో సేవించే మాకు ఇట్టి ఆపద కలుగుట ఆశ్చర్యకరము.

మాకిట్టి కష్టము వచ్చినందుకు మేము దుఃఖించుట లేదు. భక్త పరాధీనులగు మీకు మీ భక్తులను ఉపేక్షించిరి అను అపకీర్తి రాకూడదనే మా ఆవేదన. మీలో ఒకరికైన దయలేదా ఇట్లు మమ్ములను కష్టపెట్టుటకా మీరట్లు మాకు వరములిచ్చుట ఇప్పడు మాస్థితి చూస్తే మమ్మల్ని మీరుకూడా మేడమీదకి ఎక్కించి క్రిందకి పడతోసినట్లున్నది. హా! శంకరా! గరళకంఠుడవు ఆవిషం నెత్తికెక్కినదా? విధి విధాత? వేదపాఠాలు వల్లించి జడుడవైనావా? కేశవా? పూర్వం కృష్ణావతారంలో నీఅన్నయగు బలరామునితో కలసి త్రాగిన కల్లు ఇప్పడు మీకు మత్తుగావించినదా? కపటనాటక ప్రవీణులైన మిమ్ముల నమ్మినందుకు చివరకు మాకు లభించిన ఫలమా ఇది. మీ చెవులు గడియలు పడినవా? సర్వజ్ఞత్వము ఆర్తత్రాణ పరాయణత్వము ఆశ్రిత వాత్సల్యము మొదలగు సద్గుణములు ఏట్లో కలసినవా? మీముగ్గురకు తప్ప వేరొకరికి నమస్కరింప రాదను నియమము నా కింత చేటు తెచ్చినవి. మీకెంత మొర పెట్టుకొన్నా చెవిటివాని యందు శంఖమూది నట్లు వ్యర్ధము. లోక మాతలగు ఉమా, రమా, వాణులకు మా భాధలను విన్నవించుకొంటాం.

౹౹ఓ తల్లులారా! మీకన్న కుమారులకన్న మా యెడ రెట్టింపు వాత్సల్యము గల తల్లులు మీరు మమ్ములను రక్షింప వలసిన సమయ మిది. ఇప్పడు మీరే మమ్ము ఉపేక్షచేస్తే ఇకపై ఎవ్వరు మిమ్ములను సేవించరు. మీపేరు లోకంలో మాసిపోవును. ఉదాసీనముగా ఉన్నారేమి? ప్రాణాలనైనా విడుస్తాకాని, మిమ్ము కాదని వేరొకరికి మొక్కము, ఇతరుల నుతింపము, ఇతురుల నమ్మము, పరులను సేవించము కావున ఆలస్యము చేయక మమ్ము నిర్బంధములో నుండి విడిపించి అనుగ్రహింపుము. అని భక్తితో అనేక విధముల పలుకచుండెను.

త్రిమూర్తులు భార్యా సమేతులై వారి వారి వాహనాలమీద వచ్చి విమలవిదుని విమానం ముందు నిలచారు. గరుడారూఢుడై శ్రీ లక్ష్మీ సమేతంగా శ్రీమన్నారాయణుడు, వృషభారూఢుడై గౌరి సమేతంగా పరమేశ్వరుడు, హంస వాహనుడై వాణి సమేతంగా పరమేష్టి బిర బిర ఏతించి విమలవిదుని విమానంబునకు అగ్ర భాగమునందు నిలచిరి. విమలవిదాదులు భార్యలతో త్రిమూర్తులకు వందనములాచ రించిరి. కన్నీటితో నిలుచున్నారు, మహేశుడు తన చేతులతో విమలవిదుని వీపు నిమురుచూ దైవగతి ఎవ్వరికి దాటశక్యము కాదు. విచారింపకూడదని ఊరడించి భృంగిని పంపి విశ్వంబరుని పిలిపించి, ఇంతటి నుండి నీ ఆశ్రమము మీదుగా పోవు ఏ ప్రాణిని బాధించ వలదని శాసించెను.

నీ వాక్యము అమోఘం కావున ఈ విమలవిదుని వంశము నందు ద్వాపరాంతము నుండి కలియుగావసానము వరకు పుట్టిన వారికి ఈ శాపము సోకును. నా భక్తులు, ధార్మికులు నగు వీరికి ఈ శాపము అంటదు. ఈ మనువంశ సంభవులు ఎప్పటియట్లే భూ మండలమునెల్లా ఏకఛత్రంగా పాలించగలరు. కలియుగమున క్షత్రియ వంశ విచ్ఛిన్నమగును. ఈ మనువంశజులు మాత్రము సదాచార సంపత్తితో ప్రవర్తించుచు తమ మర్యాదను పోగొట్టుకొనకుండా నీవిచ్చిన శాపమును గడుపుకొనగలరు. కలియుగమున సమస్త ధర్మములు సంకరమైపోయి వర్ణాశ్రమాచార ధర్మాలు తప్పను. కాని మనువంశం మాత్రం అట్లుకాక దేవ బ్రాహ్మణ భక్తి గలిగి మా ముగ్గురిని

అభేధ బుద్ధితో సేవించుచుందురు. కాలవశమున, శాపవశమున కలియుగంలో మనువంశజులు విరల ప్రచారులయ్యూ ధర్మమును విడువక పాపభీతి కలిగి ప్రవర్తింపగలరు. అని శంకరుడు ఆనతిచ్చెను. అది విని దేవతలంతా సంతోషించిరి. విమలవిదుని తమ్ములతో కూడ కనకనగరమునకు పంపి విశ్వంభరుని కోపం తగ్గించి త్రిమూర్తులు తమతమ లోకాలకు చనిరి.

## విమలవిదునికి పుత్రజననం

విమలవిదుడు తన తమ్ములతో కనకనగరము ప్రవేశించి, మరింత ఉత్సాహముతో జనులను పాలించుచుండెను. అన్నదమ్ముల ప్రేమ వీరిదేనని లోకులు మెచ్చుకొనుచుండ తన తమ్ముల సౌభ్రాత్రమున నిత్యకల్యాణము పచ్చతోరణముగా అనేక సౌఖ్యములను అనుభవించుచుండెను. కొన్ని సంవత్సరాలకు విమలవిదుని బార్య వినయవతిలో గర్భవతి లక్షణములు కనిపించినవి. ధరణీప్రతి ప్రతిబింబమును ఆమె ధరించెను. రోజు రోజుకూ గర్భం పెరుగుతున్న కొలది కడలి నీరు త్రాగిన మేఘమువలె ఆరాణి మెల్లమెల్లగా నడుచుచుండెను. మాట మాటికి ఆవులింతలు,అరమోడ్పు కనులతో నుండెను. ఆమెకు వేవిళ్ళు ఎక్కువ కావటంతో కొత్త కొత్త రుచులు సంతరించుచున్న ఆమె వర్షఋతువు వలె నలుపెక్కిన పయోధరములు కలిగి, కేతకి వలె గర్భపాండుర అగుట గమనించిన పరిచారికలు రాణి గర్భవతి అని అనుకొనిరి. ఆపరిజనములో ముఖ్యురాలు, రాచకులంలో తిరుగగల నేర్పరి, ప్రౌఢ అయిన పరిచారిక మంచి రోజు చూచుకొని మహీశుని వద్దకు శుభవర్తమానం తీసుకొని వెళ్ళింది. రాజు ఆ సమయంలో చుక్కల నడుమ వెలిగే పున్నమి చంద్రుని వలె ఆదిశేషుని పడగలయందలి మాణిక్యాల మధ్య మెరిసే శ్రీమన్నారాయణుడివలె మూర్ధాభిషిక్తులగు రాజన్యుల మధ్య కొలువు తీరి ఉండెను. ప్రధాన మంత్రి అగు కాంపల్యునితో విశ్వంభరుని గురించి కథలు చెప్పకొంటున్నారు. ఆ సమయంలో పరిచారిక విమలవిదుని చెంత చేరి చెవిలో గర్భాధారణ వృత్తాంతం వినిపించింది. అపురూపమైన ఆ వార్త ఆనందామృతంలో రాజును అభిషిక్తుని చేసింది. అతని శరీరము గగుర్పాటు చెందినది. ఆనందంతో రాజు తొట్రుపాటు పొందెను. చిరునవ్వు అతని చెక్కిళ్ళ అలంకరించెను. లోన నిలువని ఆనందం పైకి వెలువడి సంతోషాన్ని వెదజల్లింది. అతని కళ్ళు ఆనంద బాష్పములచే చెమ్మగిల్లినవి.

తమ రాజులో ఏనాడు చూడని ఆనందాన్ని చూచి మందహాస మనోహర వదన యైన కులవర్ధన అను పరిచారికను పరికించి మహామంత్రి కౌంపిల్యుడు ఆమె తెచ్చిన వార్త తెలియక పోయినా రాజు పొందుచున్న సంతోషమును బట్టి ఊహించి తన ఆసనమును రాజుకు దగ్గరగా జరుపుకొని ఇట్లనియె. రాజా! మనము ఎల్లప్పడూ అనుకొనినది నిజమైనదా? కులవర్ధన వికసితవదనయై కన్పట్టుచున్నది. ప్రభువుల కన్నులు శుభవార్తను విన్న సంతోషము కన్పించి నల్లకలువలవలె వీనులవరకు వ్యాపించినవి. కావున ఆ శుభవార్త నాకు కూడ తెలపండి అని ప్రార్థించెను.

రాజు చిరునవ్వు నవ్వి ఈ కులవర్ధన చెప్పినది నిజమే అయితే మనమను కొంటున్నది నిజమైనట్లే నాకు నమ్మకం చాలదు. మనకిట్టి మహా భాగ్యమబ్బునా? కావున నేనే అంత:పురమునకేగి నిజం తెలుసుకొందును. అని అందరకు తమతమ ఇళ్ళకు వెళ్ళుటకు అనుజ్ఞ ఇచ్చి తన శరీరము మీది నగలను కులవర్ధనకు ఇచ్చి దాని మ్రొక్కులను గైకొని సంతోషముతో నల్లకలువ వంటి కుడికన్ను అదురుచుండగా పరిమిత పరివారముతో కర్పూరపు దివిటాలు చీకటులను పారద్రోలు చుండగా విమలవిదుడు అంత:పురములోకి ప్రవేశించెను.

సున్నపు పూతలతో తెల్లగా ప్రకాశిస్తూ, వెలుగుచున్న కళ్యాణదీపములు కలిగి, ద్వారబంధాలపై పూర్ణకలశము లొప్పచుండ, గోడలపై శుభకరమైన చిత్రములు తళుకొత్తగా, నలువైపులా మణిదీపములు వెలుగుచుండ రాణివాసముండెను.

నేలంతా ఆకుతీగల రంగవల్లెలు అద్దబడి వున్నవి. రాణి గారి పడక మంచం తలవైపున మంగళకలశాలు నాలుగువైపుల తెల్ల ఆవాలు చల్లబడి వున్నవి. పరుపుబట్ట వెన్నెలవలె మెరుస్తున్నది. అట్టి విశాలమైన శయ్యపై రాణి వినయవతి పడుకొని ఉంది. ఆమె తెల్లని వస్త్రాలు ధరించినది. పరివార జనం మంగళ వాక్యాలు పలుకుచుండిరి. తనలో కుల పర్వతాలను దాచుకున్న వసుధవలె ఐరావతం మునిగియున్న మందాకిని వలె, సింహం దాగియున్న గుహవలె, మబ్బులచే కప్పబడిన సూర్యునివలె, కొండలమాటున దాగిన వెన్నెలరేడు వలె, గర్భవతియైన వినయవతి ఒప్పచున్నది. గోరోజనముచే చిత్రితమైన తెల్లని వస్త్రయుగళమును కట్టుకొని ఉన్నది. రాజు రావటం చూచి వినయవతి పరిజనుల చేతులు పట్టుకొని, ఎడమతొడపై చేయిమోపి, కదలాడే ఆభరణాల రవళి ఒప్పచుండ మెల్లగా లేచి నిలబడింది. అప్రియురాలిని చూచి రాజు ఆదరణతో ఆగు ఆగు లేవబోకు అంటూ రాజుకూడ ఆమెతో కలసి కూర్చుండెను. ఆమె గర్భవతి అని నిచ్చయించుకొని రాజు ఆనందించెను.

రాజు దేవి! కులవర్ధన చెప్పినది నిజమేనా? అని పలుకగా రాణి చిరునవ్వుచే అప్పళించబడిన చెక్కిళ్ళు, పెదవులు కన్నులు కలదియై సిగ్గుచే మోము ఒంచుకొనెను. ప్రాణవిభుడు చెప్పమని నిర్బంధించెను. చివరకు ఆమె నన్నిలా సిగ్గులపాలు చేస్తారు? నాకేమి తెలియదు. అని ప్రక్క చూపులతో రాజుని చూచెను. అవ్యక్త మందారహాస చంద్రిక ధవళ కాంతులు గల ముఖముతో రాజాధిరాజు వినయవతితో ఇట్లనియె.

మనోహరాంగి! నామాటలు నీకు సిగ్గు కల్గిస్తుంటే నేను మాట్లాడను. కానీ ఈ శుభవార్తను నీవెట్లు దాచగలవు? విచ్చిన తెల్ల సంపెంగల వంటి నీమేని కాంతిని, సువర్ణ మంగళ కలశాలను పోలియుండి చనుమొనలతో బిగువుగానున్న గబ్బి గుబ్బలను, రోజు రోజుకు బిగిసి పోతున్న బంగారు మొలత్రాడుతో బాధ పడుతూ కృశత్వాన్ని వీడుచున్న నీనడుమును దాచగలవాడై అంటూ నర్మగర్భము లగు పలుకులతో ఆరాత్రి అంతా విమలవిదుడు ఆమె పడకటింటినే గడిపెను.

వినయవతి గర్భ దోహదములతో ప్రమోదం పొందుచూ నెలలు నిండినదైనది. జల బిందువుల గడియారం సమయం తెలుపు చుండగా కార్తాతికులు నిర్ణయించిన శుభలగ్నంలో ఒక పుణ్య దినమున ఆమె ఒక పుత్రుని కన్నది. ఇటునటూ పరుగిడుచున్న పరిజన పదఘట్టనలతో రాజుగారికీ వార్త చెప్పాలని ఆత్రుత పడే కంచుకీజనాల సంభ్రమంతో అంత:పురజనాల ఆనందోత్సాహాలతో రాణి గారి మందిరం మనోహరమై భాసిల్లింది. మంధర పర్వతముచే చిలక బడిన ధ్వనులతో సాటియగు ధుంధుభి ధ్వనులు మృదంగనాదాలు శ:ఖకాహళానక ధ్వనులు కూడి ఒక్కసారిగా ముల్లోకములు నిండుచున్న ఉత్సవ కోలాహలముతో ఆబాలగోపాలముగా ప్రజలు ఆనందమున గంతులు వేయుచుండిరి. ప్రతి క్షణము చంద్రోదయముచే ఉప్పొంగే పాల సముద్రమువలె రాకుమారుని జననముతో ఉత్సవము ఉప్పొంగెను. విమలవిదుడు కుమారుని చూడాలనే వేడుక మితిమీర దైవజ్ఞులు పెట్టిన శుభముహూర్తంలో ప్రధాన మంత్రి అగు

కాంపల్యునితో కలసి అడవి చివుళ్ళచే రక్ష కట్టబడనిదియు, వేలాడబడిన తెల్లని పూలతో కూడిన దూర్వారదళ మాలికలు కలదియు, ద్వార ప్రదేశములో ఉంచబడిన బంగారు రోకలి నాగలి కలదియు, ద్వారానికి ఇరువైపుల వ్రేలాడుతున్న గవ్వల దండలు కలదియు, గోమయముతో చేయబడిన రేఖలచే స్వస్తిక భక్తుల కూర్చున్నవారును, మర్యాదయందు నేర్పు కలవారును, పసుపునీటిని తడుపబడిన పచ్చనివలువ కట్టుంచిన షడ్గుణశోభన అగు షష్ఠీదేవిని చేయుచున్న వారును, మయూర వాహనుడైన కుమారస్వామిని కూర్చుచున్న వారును, ప్రసవ గృహోచితముల నెరపుచున్నవారును, అగు ముత్తైదువలతో కూడుకొని ఉన్నట్టియు, సువాసన వెదజల్లే పూలదండలతో అలంకరింపబడి ద్వారం దగ్గర కట్టివేయబడిన ముసలి మేకలు కలవియు, నవధాన్యముల నడుమ నుండి పెద్దలు, పూజ్యురాండ్రునగు వారిచే అధిష్ఠింపబడిన పడకమంచము కలదియు, నేతిలో తడిపి పాము పొరలను పొటేలు కొమ్మున ధూపము వేయబడుచున్నదాయు పసుపుతో తెల్లని బట్టమీద సప్తమాతృకలను వ్రాసి పూజించుచున్న పెంపుడు తల్లులు కలదియు, మంత్రాలను చదువుచూ భూసురులచే చల్లబడుచున్న శాంత్యుదకము కలదియు, సూతికా గీతాలు పాడుచున్న వృద్ధాంగనలు కలదియు, పారాయణము చేయబడుచున్న శ్రీమన్నారాయణుని సహస్రనామములు కలదియు, అగు పురిటింటున విమలవిదుడు చూచి కాళ్ళు చేతులు కడుగుకొని ప్రవేశించెను. ప్రసవ వేదన మరచిన వినయవతి ఒడిలో ఉన్న తెల్లని మేనుకలవాడును, తన శరీర కాంతులచే పురిటింటి దీపపు కాంతుల నడచు చున్నవాడను, ముదరని ఎర్రమామిడి చిగురును, వికసించిన ఎర్రతామర పువ్వును మీరుచున్నవాడును, పగడాల చిగురులచేత, కెంపు మాణిక్యాల వెలుగులచేత, చేయబడినవి వలె ఉన్న అవయవములు కలవాడును, అప్సరసల చేతులనుండి నేలపైకి జారిపడిన ఇంద్ర కుమారుని పోలియున్నవాడును, సహజాలంకారాలతో మహాపురుష లక్షణాలు కూడికొని యున్నవాడును అగుకుమారుని విమలవిదుడు ఆనంద బాష్పములు కను రెప్పలను తడుపు చుండగా తీరని తమకముతో కుమారుని ముఖం చూస్తూ తనజన్మ చరితార్ద మైనదని సంతసించెను.

కాంపిల్యుడు కూడ కొంచెంనడుము వంటి పసివాని అగాంగములు పరికించి రాజుతో నిట్లనియె. ॥మహారాజా! చూడుము ఈ కుమారుని ముఖములో చక్రవర్తి లక్షణములు కనబడుచున్నవి. చంద్రబింబం వలె నున్న బాలుని నుదిటిమీద కెందామర కాడల వలె చారలు విలసిల్లుచున్నవి. తెల్లతామర పువ్వులవలె తెల్లనయి, చెవులు తాకుచున్న కనుదోయి పడకటింటిని తెల్లని చూపులతో నింపు చున్నది. ఇతని అరచేతులలో శంఖ చక్రములున్నవి. ఇంకను పెక్కు శుభలక్షణాలు వీనిలో వున్నవి. ఇన్ని రోజులకు కృతార్థులమైనాము.॥ అని పలుకగా రాజు సంతసించెను.

రాజు తన ఆస్థానమునకు వచ్చి బ్రాహ్మణులకు పెక్కు దానములిచ్చి, పేదలకు అన్నదానం చేసి కుమారునికు విశ్వమూర్తి అని నామకరణము గావించెను. కాలోచితమైన విద్యుక్త కర్మలను గావించుచు రాజు సుఖము గానుండెను. మరియు వినయవతియందు విశ్వశేఖరుడు, విశ్వరంజకుడు, వీరవలుడు, విలయదుర్జయుడు, విశ్రుతాయువు అను ఐదుగురు కుమారులను పొందెను. ఆరుగురు రాకుమారులు దినదినాభివృద్ధి పొంది సకలశాస్త్ర పారంగతులైరి. వారికి సత్కుల సంజాతులైన రాకుమార్తెలను తెచ్చి విమలవిదుడు వివాహం చేసెను. పెద్దకుమారుడు విశ్వమూర్తికి రాజ్యపాలనాభారం అప్పగించి విమలవిదుడు తన భార్య వినయవతితో తపోవనానికి వెళ్ళి విజితేంద్రియుడై కలియుగాంతం వరకు తపస్సు చేస్తూ విశ్వభరుని శాపానికి గురి అయిన మనువంశజులనుద్ధరింప పూనుకొనెను.

విశ్వమూర్తి రాజై సకల సద్గుణ విరాజమానుడై మునుపటి కంటే హెచ్చుగా రాజ్యమును పాలించుచుండెను. విమలవిదుని తమ్ములలో వైవస్వతునకు ముప్పది మంది పుత్రులు, ముగ్గురు కూతుళ్ళును, ధాతకు ఇరువదిఒక్కండ్రును, విఖ్యాతునికి ఏభైమంది, సర్వవిదునకు పదిహేడుమంది, కనదునకు తొమ్మిదిమంది, ప్రాదుర్భవునకు పాండునకు చెరి పదహారుమంది, విశ్వహితునకు తొంబండ్రును, భువనభాతికి ఇరువది ఒక్కండ్రును, ప్రభువుకు ముగ్గరును, శుముఖునకు ముగ్గురును, కాశ్యపునకు నలుగురును, విములునకు పదిమంది, దూషణకు ఆర్గురును, నయనభాతికి ఏడుగురును కుమారులు పుట్టిరి. వీరు లోకోత్తర పరాక్రమ సంపన్నులు. వేద వేదాంగ పారంగతులు. సమస్త సద్గుణ విరాజితులుగా ప్రసిద్ధిచెందిరి.

విమలవిదుని కుమారుడగు విశ్వమూర్తికి వందమంది పుత్రులు పుట్టిరి. వారిలో అగ్రజుడు రత్నకుండలుడు. భూ భారము వహించెను. వైవశ్వతుడు మొదలగు వారి కుమారులను ఒక్కొక్కరు పెక్కుమంది పుత్రులను పొందిరి. మనువంశము తామర తంపరగా వృద్ధిచెందింది.

## త్రేతాయుగం

మనుకుల వృద్ధులు తమ మనుమలను రప్పించిసకల రాజ ధర్మములు ఉపదేశిస్తూ ఉండేవారు. రత్నకుండలుని పాలనకాలంలో మను తనయులు పూర్వం కంటే అధికముగా ధర్మమార్గమున ప్రజాపాలన చేస్తూ తమ పూర్వులను మరిపించిరి.

రత్నకుండలుని కుమారుడు విజయవర్దనుడు ఆ సమయంలో కృతాయుగం పోయి త్రేతాయుగం వచ్చెను. ఆ యుగాదినాడు విజయవర్దనుడు పట్టాభిషిక్తుడై ధర్మ యుక్తముగా రాజ్యపాలన చేయుచుండెను.

ఒకనాడు కుబేరుడు తన తండ్రి అగు పులస్త్య వందనము ఆచరింప పుష్పకారూఢుడై ఆకాశమున చనుచుండగా సుమాలి అను రాక్షసుడు పాతాళము నుండి భూమికి వచ్చి కుబేరుని వైభవమును చూచి అసూయ చెంది తన కుటుంబమునకు అట్టి అభ్యుదయము లేదని విచారించి తన కూతురగు కైకసితో బిడ్డా! అలకాపురమునకు అధిపతియై ఐశ్వర్యముతో ధనాధిపతి అను బిరుదు ను పొందెను. నీ కడుపున ఒక కొడుకు పుట్టిన అలకాపురమునకు ప్రభువు అగును. మొదట ఆ అలకాపురము మనది నీకుసంతానము లేకపోవుటచే కుబేరుడు ఆక్రమించుకొన్నాడు. కావున నీ భర్త అగు పులస్త్య బ్రహ్మ కడకేగి అతని వలన పుత్రులను పొంది మనకు ఈ అవమానం తప్పించు అని పలికెను.

కైకసి తన మగని ఆశ్రమమునకేగి తల వంచుకొని బొటనవేలితో నేల గీటుచూ నిలబడెను. ఆ ముని తన దివ్యదృష్టితో కైకసి వచ్చుటకు కారణము తెలుసుకొని ఆమెతో ఇట్లనెను.

ఓ మనోహర వదనా! నీవు వచ్చిన కారణం మాకు తెలిసినది. నీకోరిక సిద్ధించును. యథేచ్ఛగా వెళ్ళుమని వర మిచ్చి మరియు ఇట్లనెను. నీవు నా వద్దకు దారుణ ముహూర్తమున వచ్చితివి. కాన ఘోరాకారుడై సకల జన భయంకరుడు అగు రాక్షసుడు నీకు జన్మించును. అనగా కైకసి భయపడి చేతులు జోడించి మహాత్మా! నీవంటి శాంతాత్మునకు రాక్షసుడు కొడుకగుట ధర్మము కాదు. నన్ను అనుగ్రహింపుడు అని వేడుకొనెను. పులస్త్యుడు నీ కడుపున పుట్టెడు వారిలో చివరివాడు సత్వగుణ ప్రధానుడై వంశమునకు కీర్తి తెచ్చును పొమ్మనెను.

కైకసి సంతసించి తన తండ్రి సుమాలికి జరిగినదంతా చెప్పగా అతడు సంతోషించెను. కొంత కాలమునకు కైకసికి పది తలలు ఇరువది చేతులు కలిగి భయంకర మూర్తి అగు కుమారుడు జన్మించెను. వానికి దశవదనుడని పేరు పెట్టెను. మరి కొన్ని రోజులకు కుంభకర్ణుడు, శూర్పణక అను కూతురు, విభీషణుడు పుట్టిరి.

దశవదన, కుంభకర్ణులు కౄరచిత్తులై చిన్ననాటి నుండియు సకలలోక కంఠకులై రాక్షసకృత్యములు చేసేవారు. విభీషణుడు తన తండ్రి పులస్త్యముని ఆశ్రమములో ఉచితారీతి పెరిగి పెద్ద వాడగుచూ ప్రశాంత చిత్తుడై పిత్రు శుశ్రూషతో ప్రవర్ధమాను డయ్యెను.

ఒకనాడు కుబేరుడు విమాన రూఢుడై పిత్రువందనము చేయుటకేతెంచెను. కైకసి దశవదనుని పిలిచి చూచితివా? నీ అన్న ఐశ్వర్యముతో తుల తూగుచున్నాడు. నా కడుపున పుట్టుటచే అడవిలో కందమూలాలు తినే గతి పట్టినది. నీవు శూరుడవైతే పూర్వుల లంకారాజ్యమును రాబట్టుకొందువు. అని ప్రోత్సహించెను.

దశకంఠుడు తన తమ్ములతో తండ్రి ఆజ్ఞ మేరకు గోకర్ణమునకు వెళ్ళి ఘోరతపస్సు చేసెను. పంచాగ్ని మధ్యలో పదివేల సంవత్సరములు ముగ్గురు సోదరులు తపస్సు చేసిరి. దేవతులు భయపడి బ్రహ్మను శరణువేడిరి. బ్రహ్మ గోకర్ణములో దశవదనాదులకు ప్రత్యక్షమై తపస్సు చాలించుండు వరములు కోరుకొమ్మనగా రావణుడు నర వనరుల సంగతి వదలి సుర గరుడ ఉరగాదులచే తనకు మరణము లేకుండునట్లు కోరుకొనెను. కుంభకర్ణుడు నిర్దయత్వము కోరదలచి నాలుక తొట్రుపడ నిద్రను కోరుకొనెను. సత్వగుణ భూషణుడగు విభీషణుడు ఆపత్కాలమందైనను ధర్మము తప్పకుండుటను కోరుకొనెను. బ్రహ్మ అతని ధర్మబుద్ధికి సంతోషించి అతనికి అమరత్వము నిచ్చెను. ఈ విధంగా దశాననా, కుంభకర్ణ, విభీషణులు బ్రహ్మ వలన వరములు పొంది శ్లేషాత్మ కవనీలలో ఉన్నారని సూతుడు శౌనకాదులకు చెప్పెను.

## ద్వితీయ అధ్యాయం సమాప్తం

## తృతీయ అధ్యాయం

శౌనకాదిమునులు తరువాత కథ చెప్పమని అడుగగా సూతుడు ఇట్లు చెప్పెను.

దశాననుడు తన తమ్ములతో శ్లేషాత్మక వనములో నివసించుట తెలుసుకొని సుమాలి, ప్రహస్తుడు మున్నగు రాక్షసులను వెంట నిడుకొని పాతాళము నుండి నేలపైకి వచ్చి దశకంఠుని కౌగలించుకొని ముద్దాడెను.

॥తండ్రీ నీవు పుట్టుట వలన ఎటువంటి భయము లేకుండా సుఖముగాఉన్నాము. విష్ణువుచేత తరుమ గొట్టబడి కులక్రమాగత మైన లంకా రాజ్యమును పోగొట్టుకొని పాతాళములో దిక్కులేక ఉంటిమి. ఇప్పడు నీ వలన ఎప్పటిలాగా సంతోషముతో నుండగలము. నీ అన్న అగు కుబేరుడు లంకారాజ్యము నేలుచున్నాడు. అతని వద్దకు సౌమ్యంగా రాయబారం పంపించు. మన లంకారాజ్య మివ్వమని అడిగించు. అతడు ఇవ్వకపోతే యుద్ధము చేసి తీసుకొనవచ్చు॥ అనిన దశవదనుడు ఇట్లను ఓసుమాలీ! అన్న రాజ్యమును కోరుట నీతికాదు. ధర్మవిరుద్ధము అని సంకోచించెను.

ప్రహస్తుడు ఇట్లనెను ॥వీరాగ్రేసరా! శూరులకు, వీరులకు, తల్లి, తండ్రి, అన్న, తమ్ముడు అను మర్యాద ఉండదు. దితి, అదితి అను అక్కా చెల్లెళ్ళు ఇద్దరు కశ్య మహర్షికి భార్యలు. అదితి యందు దేవతలు పుట్టి స్వర్గలోకమును అధిపతులైరి. దితి యందు రాక్షసులు పుట్టి భూలోక, పాతాళ లోకములకు అధిపతులైరి. శ్రీమన్నారాయణుడు న్యాయము తప్పి రాక్షసులను ఓడించి ముల్లోకాధిపత్యము దేవతలకు కట్టబెట్టెను. దాని వల్ల దేవ దానవులకు వైరము ఏర్పడినది. నీ విపుడు విపరీతముగా తలప వలదు. అంతులేని కష్టాలు పడుతూ నిన్నే నమ్ముకొనియున్న మమ్ములనుపేక్షించుట న్యాయము కాదు. అన్న అని శత్రువుకు తన రాజ్యమును విడుచుట కన్న వెఱ్ఱి కలదే॥ అని ఉపదేశించెను.

దశవదనుడు కొంతసేపు ఆలోచించి ప్రహస్తుని మాటమన్నించి రాక్షసులతోకలసి త్రికూటశిఖరానికి చేరుకొని ప్రహస్తుతోఇట్లనెను.

॥నీవు కుబేరుని కడకేగి లంకారాజ్యము రాక్షసభోజ్యము. నీవు ఇన్నిరోజులు అనుభవించావు. ఇక వదలి పెట్టుము. ప్రియముతో మా రాజ్యంమాకు వదలిపెట్టుట ధర్మము. మాకు ఆనందంకన్నను. నామాటగా చెప్పుము॥ అని ప్రహస్తుని కుబేరునివద్దకు రాయబారిగాపంపెను.

ప్రహస్తుడు నిండు కొలువులో నున్న కుబేరుని దర్శించి దశగ్రీవుని మాటలను వినిపించెను. కుబేరుడు ఇట్లు బదులు చెప్పెను. ॥సుమాలి మొదలగు దానవులు శ్రీమన్నారాయణునిచే పరాజితులై వెళ్ళిపోయినందున శూన్యమగు ఈ లంకారాజ్యమును మా తండ్రిఅగు పులస్త్యుడు నాకు అప్పగించుటచే నేను ఇందు ఉంటిని. ఇది పిత్రార్జితము. ఇందులో నాకు సగభాగం ఉంటుంది. దీనికి దశవదనుడు అంగీకరిస్తే సరే. లేదంటే మొత్తంరాజ్యం మీరే తీసుకొనుడు. రాజ్యంవిషయమై కుల కలహమెందుకు? అని చెప్పి తన తండ్రి వద్దకు వెళ్ళి జరిగినదంతా వివరించెను. పులస్త్యుడు ఇట్లుచెప్పెను కుమారా! దశవదనునకు ఎన్నినీతులు చెప్పినా చెవికెక్కవు. వాడు పరమమూర్ఖుడు తనవారి మాటలకు లోబడి వారెట్లాడించినా అట్లు ఆడుచుండును. బ్రహ్మ వర గర్వితుడై పెద్దలమారు మన్నించక స్వేచ్ఛగా సంచరించు చున్నాడు. తనకు తానే నశించును. ఉత్తములు మూర్ఖుల జోలికి పోకుండా దైవవశమున కలుగు కష్టాలను గడిచి సుఖములు పొంద గలరు కావున నీవు మారు పలుకక లంకా రాజ్యము రాక్షసులకిచ్చి దేవదేవుడైన ముక్కంటి సేవలో చెలిమితో కైలాసమున నీఅనుచరులతో

సుఖముగా ఉండుము. ఆకైలాసం పవిత్రమైన పర్వతం ఆకాశగంగకు అది జన్మస్థానం. ఆకొండ శిఖరమున బంగారు గోపురాలతో మనో హరమైన అలకాపురము కలదు. దాని ప్రక్కన బంగారు తామరపూలతో రాయంచల విహారాదులతో ఆకాశగంగ ప్రవహించుచుండెను. ఆనదీ తీరములో ఎడతెగని వసంతఋతువులో పూచిన వివిధరకాల పూలతో నిండిన ఆరామములున్నవి. అప్సరసలు గానములు చేయు చుందురు. ఆ ప్రదేశము నీకు నివాసయోగ్యం కావున అచ్చటికరుగుము. అని తండ్రి ఆనతిచ్చెను.

కుబేరుడు పరివారంతో లంకాపురమును విడచి, కైలాసగిరికి అరిగి పరమేశ్వరుని ఆరాధించి ఆమహాదేవుని అనుమతితో అలకాపురము చేరుకొని పూర్వంకంటే ఎక్కువ సుఖముగా నుండెను.

ప్రహస్తుడు కుబేరుని మాటలను దశకంఠునకు తెలిపిన అతడు సంతసించి తన సోదరులతో, సమస్త దానవులతో లంకాపురము ప్రవేశించి సకల సామ్రాజ్య వైభవములతో కొంతకాలముండెను. వివాహము చేసుకొని పెక్కు కుమారులను పొందెను. సమస్త సంపదలతో కూడి లోకకంటకుడై బ్రహ్మఇచ్చిన వరములచే గర్వించి ముల్లోకములందు ఎదురులేక ప్రజలను పీడించుచుండెను.

## రావణునికి కుబేరుని హితోపదేశం

కుబేరుడు తన తమ్ముని దుష్ప్రవర్తన విని తన తమ్మునికు హితవు చెప్పించుటకు దూతను పంపగా అతడు లంకాపురమునకు పోయి, రత్నాల చెక్కడపు పనులు గల బంగారు గద్దెపై కూర్చుని, ప్రహస్తుడు మున్నగు మంత్రులతో కొలువు తీరియున్న దశవదనునకు జయము పలికి ఇట్లనెను. ॥రాక్షసరాజా! నీఅన్న యగు కుబేరుడు నా ద్వరా పంపిన సందేశము వినుము. మన వంశములో పుట్టిన వారందరూ లోకహితముగా సంచరించుచు, ఎవరికి కీడుచేయక ధర్మమార్గమును అవలంబించి, సత్వగుణ ప్రధానులై జరద్విశ్రాంత కీర్తి విరాజమానులై యుండిరి. నీవిపుడు అందుకు భిన్నంగా దేవ బ్రాహ్మణ ద్వేషంతో ఎల్లలోకములకు బాధకుడవై యున్నావు. పులస్త్యమహర్షి వలన నా సహోదరుడవై పుట్టిన నీకు ఇది న్యాయము కాదు. ఇది వరకు నీవు అన్నయని భావింపక మన్నించలేదు. అయినను సోదర వాత్సల్యముతో లంకారాజ్యమును నీకు విడిచితిని. కైలాసగిరిపై పార్వతీపతిని గూర్చి నూరేండ్లు తపస్సు చేసి ఆ మహాత్ముని అనుగ్రహమున అలకాపురమునకు అధిపతినైతిని. నీవు ఇకమీద పాప కార్యములు విడిచి భూతదయా శాలివై జీవింపుము. దేవతలంతా ఒక్కటై నిన్ను చంపుటకు ప్రయత్నించు చున్నారు. కావున దురభిమానము విడిచి, చెప్పడు మాటలు వినక, మంచి చెడులు ఆలోచించికొని నడుచుకొనుము. తమ్ముడివనే ప్రేమతో నేను చెప్పచున్న మాటలను మనస్సున నుంచుకొని మన కులమునకు అపకీర్తి కలిగింపక, నీతిగా నడచుకో॥ అని చెప్పెను.

దూత మాటలు విని దశకంఠుడు మంచిచెడులు ఆలోచింపక కన్నులెర్రజేసుకొని కోపముతో చేతులు పిసుకుకొంటూ దూతతో ఇట్లనెను. నీ మాటల భావము అర్థమైనది. మీరాజు మాకు హితము చెప్ప నిన్ను పంపెనా? తాను దైవమును కొలచి క్రొత్త బలం వచ్చిందని మమ్ము నిగ్రహింప దలచుకొన్నాడా? ఈ తాటాకు చప్పళ్లకు దశవదనుడు బెదరిపోడు. సాధువని, అన్నయని వదలి పెట్టినందుకు మాకు లభించిన ఫలమిదియా? ఇతడు మాకు నీతులు చెప్పేటంతటి వాడైనాడా? తానుమీదు తెలికుండా ఉన్న ఇప్పడే యమపురికి పంపెదను. దేవతలంతా కలసి నన్ను చంపగోరు చున్నారట. వారిని కూడ నిముషములో చంపెదను. అంటూ కత్తిదూసి, దూతను చంపుట ధర్మం కాదని విభీషణాదులు వారించుచున్నను ఆగక వాని తలను నరికెను. కొలువు చాలించి యుద్ధయాత్రకు సన్నద్ధులై యుండుడని రాక్షస సేనకు చాటించి ముల్లోక విజయము కోరుచు యాగము చేసి మహోదరుడు, మారీచుడు, ప్రహస్తుడు, శుకసారణాది దనుజవీరులు వెంటరాగా ముల్లోకాలను జయుంచాలనే కోరికతో రావణుడు లంకాపురము నుండి బయలుదేరెను.

ఇంట గెలచి రచ్చ గెలువ దగునను సామెతగా తన అన్న అగు కుబేరుని చంప దలచి కైలాసగిరికి అరిగెను. ఆ సమయమున యక్షులు తమ రాజైన కుబేరునికి రావణుడు దండెత్తి వచ్చుటను తెలిపిరి. అతడు కోపించి యుద్ధ సన్నద్ధుడై తన బలములతో ఎదిరించెను. యక్ష రాక్షస బలగాలకు భయంకరమైన యుద్ధము జరినది. ఎండి పండుటాకులను కాల్చు కార్చిచ్చువలె దశకంఠుడు యక్షుల నణచుచు ఉత్సాహముతో యుద్ధము చేయుచుండ మహోదర, మహాపార్శ్వ, ప్రహస్తాది రాక్షసులు యక్షులను పటాపంచలుగ చేయు చుండెను. కుబేరుడు తన సేనా నాయకులను పురిగొల్పి అవక్ర పరాక్రమముతో యుద్ధమున నిలచి తన రధమును తమ్ముని రధమునకు ఎదురు నడపించి వానితో ఇట్లనెను.

తమ్ముడవు కదా యని నీ క్షేమమును కోరి దూత ద్వారా హితము చెప్పించితిని. అది వినక శాస్త్ర విరుద్ధముగా ఆ దూతనే చంపితివి. బ్రహ్మ వర గర్వితుడవై మంచి చెడులు ఎరుగక నాతో యుద్ధము చేయ వచ్చితివి. తల్లిదండ్రులను, అన్నలను, గురుజనులను, దేవబ్రాహ్మణులను అవమానించువాడు నరకమున పడును. ఇహ పరములకు దూరుడగును. సామముతో నీకు ఎన్ని హితోక్తులు చెప్పినా వినవు. నీవు దండనకు పాత్రుడవు. యమపురికి పంపెదను. నిలువుము అని కుబేరుడు క్రోధముతో తన గదాదండముతో రావణుని పది తలలపై కొట్టెను. రావణుడు సొమ్మసిల్లి, వెంటనే తేరుకొని, తోకతొక్కిన పాము వలె లేచి, కుబేరుని మీదకు ఉక్కు బాణములను పంపెను. ఆరాజ రాజు వర్షధారలకు ఎదురు నిలచే మహావృక్షం వలె వెనుదీయక పోరాడెను. ఆ అన్న దమ్ముల ద్వంద్వ యుద్ధము ముల్లోకములకు భయము కలిగించెను. కొంత సేపటికి ఆ యక్షరాజు కుబేరుడు రావణుని ఎదురు నిలువలేక యుద్ధరంగము విడిచి పరుగులిడెను. విజయ వర్ధనునిచే పాలించ బడుచున్న కనక పురమున కుబేరుడు ప్రవేశించెను. రావణుడును విడువక వెంటాడి కనక పురమును ముట్టడించెను.

## మను రాజుల వద్దకు కుబేరుడు

సూర్యుడు అస్తమించెను. దిక్కులన్ని చీకటితో నిండెను. ఆ రాత్రి కుబేరుడు పురద్వారము వద్దకుచేరి ప్రతీహారునితో తన రాకను విజయవర్ధనునికి తెలిపెను. అతడు సంభ్రమముతో ఎదురు వెళ్లి నిజకుల క్రమానుగత పరమహితుడైన కుబేరుని కౌగలించుకొని, లోనికి తీసుకొని పోయి, ఉచిత ఆసనంపై కూర్చుండబెట్టి కుశలమడిగెను. విచారముతో కుబేరుడు జరిగిన దానినెల్ల తెలిపెను.

విజయవర్ధనుడు మహావీరులైన తనతమ్ములను, మంత్రులను రప్పించి, దుర్మార్గుడైన రావణుడు మననగరమును ముట్టడించి యున్నాడు. కావున జాగరూకులై నగరమును కాచుకొని ఉండుడు. మాయావి అయిన రాక్షసరాజు తమతో యుద్ధమే చేస్తాడో, సంధికే సిద్ధమౌతాడో తెలిసికొని వచ్చుటకు దూతలను నియమింపుమని పలికి కుబేరునికి అభయమిచ్చి విజయవర్ధనుడు అంతఃపురమున కరిగెను.

ఉదయమైనది. రావణుడు తన సైన్యమును సిద్ధము చేసుకొని యుద్ధానికి రమ్మని విజయవర్ధనుని పిలిచెను. విజయవర్ధనుడు తన తమ్ములతో నిజ సైన్యమును ముందు నిల్పికొని వెడలి రాక్షసమూకలను చంపసాగెను. ఆమను వీరుని పరాక్రమమునకు దనుజులు ఎదిరింప లేకపోయిరి. దశవదనుడు తన సేనలను పురికొల్పి ఎదిరింపగా ఇరుపక్షములకు పోరు భయంకరమయ్యెను. దశగ్రీవుడు విజయవర్ధనుడు ద్వంద్వ యుద్ధానికి సమ కట్టిరి. తన రథమును రావణునికి ఎదురుగా నిల్పి మనువిభుడట్లనెను.

॥రాక్షసాధమా! నీవు వెనుక ముందు చూడక సజ్జనుల బాధించుచు లోక కంటకుడవై ప్రవర్తించుచున్నావు. దుష్టశిక్షణా తత్పరుడైన నేను లోకహితము కొరకు నిన్ను శిక్షించాలను కొనుచున్నాను. ఇప్పటికి కాకతాళీయముగా తటస్థపడినది. నా కోరిక నెరవేరినది. కావున వెనుదిరిగి పోక, నా ముందు నిలిచితివేని నిన్ను యమపురికి అతిథిగా చేసెదను.॥ అని విజయవర్ధనుడు పలుకగా రావణుడు చిరునవ్వు నవ్వి ఆహా! పేడ పురుగునకు రెక్కలు వచ్చెనా? ఏమి ఈ విపర్యము రావణుని ఎదుట నిలచి ఒక మానవ మాత్రుడు ఇట్లు మాట్లాడుటయా? నోటికి వచ్చినట్లు పలుకు చున్నాడు. ఎంత ఆశ్చర్యము అని కోపము చేత ఎర్రని కనులు కలవాడై రావణుడు వాడి బాణములను విజయవర్ధనునిపై కురిపించగా వాటిని అతను నడుమనే తునుమాడెను. తన శరసంధాన కౌశలముతో క్షణంలో ఆ మను రాజు రాక్షసరాజు ఉదరమును వ్రయ్యలు చేసెను. ఆదెబ్బకు తట్టుకోలేని రాక్షసరాజు రథముపై ఓరగిల్లి తెప్పరిల్లుకొని అమిత పరాక్రమములో మహా శస్త్రములను ఒక్కసారిగా మనువీరులపై కురిపించెను. అవి ప్రతశస్త్రములచే నివారింపబడి విఫలమైనవి. రావణుడు ఆశ్చర్యము పొంది దిక్పాలురకు కూడ అజేయుడనైన నేను మనుజ మాత్రులచే పరాభవము పొందవలసి వచ్చునేమో అను సందేహముతో ఊగుచున్న మనస్సు గలవాడై ఉండెను. మనుకుమారులు జెఱ్ఱిని చీమలు పట్టుకొని నట్లు రాక్షసరాజును చుట్టుముట్టి వాడియైన బాణములచే బాధించుచుండ రావణుడు ఏమిచేయాలో తోచక దావానల మధ్యలో చిక్కుకున్న సింహమువలె, కోపముతో ఎర్రనైన కన్నులతో అవక్ర పరాక్రమంతో ఒక్కసారిగా అనేక బాణములను విజయవర్ధనునిపై ప్రయోగించెన విజయవర్ధనుడు అతని సోదరులు పరాక్రమముతో అతని విరథుని చేసెను. రావణుడు మను కుమారుల ఓడింపలేక కాందిశీకుడై, తిరిగిచూచిన తిరుమణి తోడ అను సామెతరీతి తన బలగాలతో లంకాపురములో ప్రవేశించెను.

## సీతాపహరణం-రామభక్తులుగా మను తనయులు

మనువీరుల వలన తనకు కలిగిన పరాభవమునకు రావణుడు తన మనస్సులో బాధ పడుచుండెను. ఎప్పటిలాగా దుష్టహృదయుడై పుర్రెకు పుట్టిన బుద్ధి పుడకలతో కాని పోదన్నట్లు సజ్జనులను పీడించుచు, పరస్త్రీలను అపహరించుచు, యజ్ఞ యాగములను పాడుచేయుచు, మునుల తపస్సును చెరపుచు, దేవతలను ఓడించుచు ముల్లోకములు అడ్డులేక సంచరించు చుండెను.

ఒకనాడు రావణుడు శ్రీరామచంద్రుని దేవేరియగు సీతాదేవిని అపహరించి దండకారణ్యము నుండి లంకాపురము ప్రవేశించి ఆ మహా పతివ్రతను అశోకవనమున నుంచెను. శ్రీరామచంద్రుడు అచట నిజసతి గానక, తన తమ్ముడగు లక్ష్మణునితో వెదకుచు, కిష్కింధ కరిగి, సుగ్రీవునితో స్నేహం చేసి, వాలిని ఒక బాణంతో చంపి, ఆంజనేయుని వలన జానకీదేవి జాడ తెలుసుకొని, దురాత్ముడగు రావణుని చంపి, తన దేవేరిని చేకొనుటకు, వానర సైన్యాలతో కలసి సముద్రము దాటి లంకాపురము ప్రవేశించుటకు సేతు నిర్మాణం చేయుచుచుండెను.

ఆ సమయమున విజయవర్ధనుడు చారుల వలన ఆవృత్తాంతము విని, శ్రీరామచంద్రుడు శ్రీమన్నారాణుని అవతారమేనని బ్రహ్మ వలన తెలిసికొన్నవాడు కావున శ్రీరామునకు రావణ వధలో తనవంతు సాయం అందించి ఆ మహాత్ముని ప్రసన్నం చేసుకొని, ఇహ పర సుఖాలను, ఐహికాముష్మిక సుఖములను పొంద గలుగుదునని తలచి తన తమ్ములతో సకల సైన్యంబులతో జానకీపతి సన్నిధికి వచ్చి సాష్టాంగ దండ ప్రణామములు ఆచరించి భక్తితో ఆ మహాత్ముని వినుతించగా శ్రీరామచంద్రుడు అతని భక్తికి సంతసించి వచ్చిన పని అడిగిన విజయవర్ధనుడు సవినయముగా ఇట్లనియె.

॥ఇనకుల జలధి కళానిధీ! మీదర్శనంతో మా తపస్సులు ఫలించినవి. మేము కృతార్థులమైతిమి. మీరు శ్రీమన్నారాయణాంశ సంభూతులు. భక్తవత్సలురు. ఆశ్రిత వాంఛితార్థ ప్రదాతలు. దేవరవారి పట్టపుదేవిని రాక్షసాధముడగు రావణుడు అపహరింప, ఆ దురాత్ముని పుత్ర, మిత్ర, కళత్రాదులతో సంహరించి, ధర్మపత్నిని చేకొనుటకు బయలు వెడలినారని విని, చంద్రునికి ఒకనూలు పోగువలె తమకు సాయము చేసి తమ అనుగ్రహముతో కృతార్థత పొందుటకై మేము తమ సన్నిధికి వచ్చితిమి. సకలలోకాధీశ్వరులును, సృష్టి స్థితి లయ కారకులు, పరాత్పరులును అగు మీకు రాక్షస వధ తృణప్రాణమయ్యు మమ్ము అనుగ్రహించి మా సేవలను అందుకొమ్మని ప్రార్థన. గంగా ప్రవాహములో ఖండ చక్కెర కలసి పవిత్రంబగునట్లు, నిర్మలమగు దేవరవారి చరిత్రలో మశక ప్రాయుడనగు మా వ్యాపారము కూడ కలసి ఆచంద్రార్కముగా విలసిల్లును. పూర్వము ఈ రావణుడు మా కనకపురిపై దండెత్తి అపజయము పొంది మరల తమ పురమునకు పోయెను. కావున దేవరవారు ఆనతిస్తే ముల్లోకములను బాధించుచున్న ఈ దురాత్ముని చంపి జగన్మాతయగు సీతను తీసుకొని రాగలను॥ అని పలికెను.

శ్రీరాముడు విజయవర్ధనునితో ఇట్లనెను. కుమారా నీవినయ సంపదకు, నీకు మాయందు గల భక్తి విశ్వాసములకు సంతసించితిమి. నీపరాక్రమును, నీ సుగుణసంపదను ఇంతకు ముందే వింటిమి. నీవు మా భక్తులలో అగ్రగణ్యుడవై మాతోపాటు ఆచంద్రార్కముగ సత్కీర్తిని పొందగలవు. నీవు చేసే సాయమును అంగీకరించుచున్నాను. సుగ్రీవాదులవలె నీవు కూడ నీ తమ్ములతో కూడి తోడ్పడుమని రఘుకుల నందనుడు ఆనతిచ్చెను. ఆ ఆజ్ఞను శిరసావహించి విజయవర్ధనుడు శ్రీరామ భక్తుడై ఉండెను.

## రామ రావణ యుద్ధంలో మనుజ పుత్రులు

శ్రీరామచంద్రుడు వానర సైన్యముతో సేతువు మీదుగా సముద్రమును దాటి లంకలో ప్రవేశించి కుంభకర్ణుడు మొదలగు రాక్షస వీరులను చంపి, రావణుని పరిమార్చి, భగవద్ధర్మ తత్పరుడైన విభీషణుని లంకారాజ్య పట్టాభిషిక్తుని గావించి, జానకిని గైకొని అయోధ్యా నగరమునకు వచ్చుచున్నప్పుడు విజయవర్ధనుడు ముకుళిత హస్తాలతో వినయముగా నిట్లనెను, ॥దేవా! నానగరమునకు వచ్చి, పూజ లందుకొని మా పురవాసులకు మీ దివ్య దర్శనమిచ్చి కృతాగ్దులను చేయుడు. దేవరవారు ఈ లోకమున అవతరించుట భక్త రక్షణార్థమే కదా॥ అని విన్నవించెను. భక్తజన సులభుడైన వైదేహీవిభుడు అతని ప్రార్థన నంగీకరించి, మనోజన విరాజమైన తన విమానమును కనకనగర బాహ్య ఉద్యానంలో నిలిపెను. విజయవర్ధనుడు సంతోషముతో దివ్యమణి స్థగితమగు రథాలను తెప్పించి రాఘవునితో ఇట్లనెను. ॥దేవా! ఈ రథముల నధిరోహించి నా మందిరము పావనము చేయమని ప్రార్థించెను. దానికి తాటకొరి ఇట్లు పలికెను. వత్సా! నీ సేవలకు మేము తృప్తి చెందితిమి. పదునాల్గు సంవత్సరములు పూర్తి కాకుండా మేము ఏ పురములోకి రాలేము. దానికి ఇంకా ఏడు రోజులు గడువు ఉన్నది. కావున సుగ్రీవ, విభీషణాదులను నీ నగరమునకు తోడ్కొని పోయి గౌరవింపుము. మా భక్తులకు చేసిన పూజలు నాకు చేయు పూజలకన్న ఎక్కువ ఆనందము నిచ్చును.॥ అని ఆనతిచ్చెను. విజయవర్ధనుడు సుగ్రీవ విభీషణాదులను, పరివారమును నగరిలోనికి తోడ్కొని పోయి వారికి సకల ఉపచారములు జరిపించి భోజనములు పెట్టి, వస్త్రాభరణములతో వారిని సత్కరించి, అందరకు ఉచితరీతి కానుకలిచ్చి, వారితోకూడి శ్రీరామచంద్రుని దర్శించి, వినయముతో తలవంచి నిల్చియున్న విజయవర్ధనుని చూచి రాఘవుడు ఇట్లనెను. ॥విజయవర్ధనా! మాయందు నీకు గల భక్తికి మా మనస్సులో ఆనందం కలుగుచున్నది. కావున నీవు తగువారికి ఇక్కడి బాధ్యతలు అప్పగించి నీవుకూడ మాతో రమ్ము॥ అని కోరెను. విజయవర్ధనుడు పెద్ద తమ్ముడైన ధనంజయునకు కనకనగరము నకు అధినాథుని చేసి శ్రీరామచంద్రుని వెంట బయలుదేరెను.

శ్రీరామచంద్రుడు విభీషణాది దనుజులతో పుష్కర విమానమెక్కి ఆకాశమార్గమున సేతుబంధనం మొదలగు వినోదములను చూచుచూ శృంగబేరపురమును సమీపించి ఆంజనేయుని ద్వారా తన రాకను భరతునకు ఎఱిగించగా అతడు పట్టరాని ఆనందంతో సాకేతపురమును అలంకరింపజేసి, ఎదురేగి శ్రీరామచంద్రుని పాద పద్మములకు సాష్టాంగ దండప్రణామాలు ఆచరించి, తల్లి వంటి వదినె సీతాదేవికి నమస్కరించి, ప్రేమతో లక్ష్మణుని కౌగలించుకొని, సుగ్రీవ విభీషణాదులను ఉచితరీతి సత్కరించి, అన్నగారైన రాముని పాదములపై దృష్టి నిలిపి, చేదోయి జోడించి భక్తి యుక్తుడైయున్న భరతునికి మనుకుల శ్రేష్టుడైన విజయవర్ధన మహారాజును పరిచయము చేసి అయోధ్యలో ప్రవేశించెను. తన సీతాసాధ్విని అంత:పురమునకు పంపించెను. సభాస్థలమునకు వచ్చి కులగురు వగు వసిష్టునకు వందన మాచరించి, సామంతరాజులను మన్నించి, సకల జనాభీష్టము మేరకు ధర్మమార్గమున రాజ్యమును పాలించుచు, పద్మాలయము అను పురమును కట్టించి దానికి మనుకుమారులను ప్రభువులను చేసెను. వారును ఆపురమును పాలించుచు, శ్రీరామచంద్ర భక్తాగ్రేసరులై త్రేతాయుగమున పదివేల సంవత్సరములు జీవించిరి.

## ద్వాపర యుగంలో మను వంశజులు

ద్వాపరయుగము ప్రవేశించినది. మనువంశ రాజులలో ముఖ్యులైన వసువిభాతి, వైవస్వతుడు అను ఇద్దరు రాజులు దేవేంద్ర వైభముతో పాలించు చుండిరి. దేవ బ్రాహ్మణ భక్తి యుక్తులై పరిపాలించు చుండిరి. ద్వాపర యుగంలో వారి కీర్తి దిగంతముల వరకు వ్యాపించినది.

హస్తినాపుర మహారాజు ధృతరాష్టుడు వారి కీర్తి ప్రతిష్టలు విని, మంత్రులను రప్పించి, ॥నేను చతుస్సముద్ర ముద్రితమైన మహీ తలమును ఏక ఛత్రాదిపత్యముగా నేలుచూ రాజాధిరాజు అను బిరుదును పొందితిని. నా కుమారుడు దుర్యోధనుడు రారాజు అని పేరు పొందియున్నాడు. ఇట్లుండగా మనువంశజులగు వసువిభాతి, వైవస్వతుడు అనువారు మమ్ము మించిన కీర్తివంతులై పాలించుచుండిరి. ఇది నా ప్రతిష్ఠకు లోపముగా ఉంది కావున తగిన బలములను కూర్చుకొని వారి పురములపై దండెత్తి వారిని ఓడించి రండు॥ అని ఆనతిచ్చి పంపు సమయమున సత్యలోకము నుండి సాత్యవతేయుడు వచ్చెను.

ధృతరాష్టుడు ఆమహాత్ముని యధావిధిని పూజించి తగిన ఆసనమున కూర్చుండబెట్టి చేతులు జోడించి నమస్కరించెను.

అంతట వ్యాసమహర్షి ఇట్లనెను. ॥ఓ ధరణీశ్వరా! నీపురములో ఎక్కడ చూచినా యుద్ధసన్నాహములు కన్పించుచున్నవి. నీకు శత్రువులెవ్వరు? మను రాజులమీదికి దండెత్తదలచితివా॥ అని అడిగెను.

దానికి ధృతరాష్టుడు ॥మహాత్మా! సర్వజ్ఞులగు మీకు తెలియనిది ఏమున్నది? తమను మించిపోయిన వారిని జయించుట రాజనీతి యని మీరే ఆనతిచ్చిరి కదా? ఆ మనుసుతులు గర్వముతో ఎవరిని లెక్కించక కయ్యమునకు కాలు దువ్వుచున్నారు? వారిని దండింప వలసి వచ్చినది॥ అని బదులు చెప్పెను.

అంతట కృష్ణద్వైపాయనుడు ఇట్లనెను. ॥రాజా! ఇంద్రాది దిక్పాలురకు కూడ ఆ మానవ వీరులను జయించుట సాధ్యంకాదు. వారు ధర్మవర్తనులు. అవక్ర పరాక్రములు, పవిత్ర చరిత్రులు. వారిని గెలుచుట నీ తరము కాదు. ఇట్లు వారిపై దండెత్తుట మూలనున్న రోకలిని నెత్తిమీద పెట్టుకొనుటయే. కావున వారిని వెంటనే పిలిపించి, సత్కారములు చేసి కొంత రాజ్యము కానుకగా ఇచ్చి, స్నేహధర్మం పాటించుట మేలు కాగలదు.॥ అనిన వ్యాసమహర్షి మాటలను ధృతరాష్టుడు మన్నించి, మను రాజులను తీసుకొని రమ్మని తన తమ్ముడు పాండురాజును పంపెను.

పాండురాజు పద్మాలయ పురమున కరిగి తన రాకను వారికి ఎఱిగించెను. మానవోత్తములు పాండురాజు కెదురేగి స్వాగత సత్కారాలతో స్వగృహమునకు తీసుకొని వచ్చి స్నాన భోజనాదులచే సంతుష్టుని చేసి సభా స్థలిలో సుఖాసీనుని చేసి వసువిభాతి ఇట్లనెను. ॥కౌరవకుల తిలకా! మీవంటి మహాత్ములు కారణము లేక ఇతరుల ఇళ్లకు రారు. కావున మీరు వచ్చిన పని తెలిపి మమ్ము కృత కృత్యులను చేయండి.॥ అని వేడుకొనెను.

పాండురాజు ఇట్లనెను. ॥మారాజు మీ సుగుణములను గూర్చి విని సంతోషించి మీతో స్నేహము చేయదలచి మిమ్ము తోడ్కొని రమ్మని నన్ను పంపించగా వచ్చితిని. కావున మీరు మా పురమునకు వచ్చి అన్నగారి కోరిక సఫలము చేయుడని కోరెను. మను ప్రభువులు పట్టలేని ఆనందంతో, కట్నకానుకలతో పాండురాజును గౌరవించి దైవజ్ఞులు నిర్ణయించిన ముహూర్తములో, చతురంగబలాలతో వెడలి, హస్తినా పురమునకు వచ్చి పాండురాజు చూపించిన భవనములో విడిది చేసిరి. ధృతరాష్ట్రుడు బంధువులతో, పురోహితులతో, మంత్రులతో వారి విడిదికి వచ్చి, వారిని కౌగలించుకొని సరస గోష్ఠితో కొంతసేపు గడిపెను. మరునాడు సకల సామంత రాజులతో భీష్మ ద్రోణాది కురు వృద్ధులతో, పురోహితులతో నిండిన కొలువునకు మను ప్రభువులను రప్పించి, అమూల్య వస్త్రాభరణాలతో, గౌరవించి తన రాజ్యములో కొంతభాగం వారికిచ్చి, వారిని తన సామంతులలో ప్రధానులుగా చేయగా వారు ఆనందించు చుండిరి.

ధుర్యోధనుడు శకుని మొదలగు దుష్ట చతుష్టయముతో కలసి పాండు తనయుడగు ధర్మరాజును కపటపు జూదములో ఓడించి, వారి సంపదులు గొని, అడవులకు పంపెను, ధర్మపాశ బద్దులైన పాండవులు పన్నెండు సంవత్సరములు ద్రౌపదితో వన వాసము చేసి, పద మూడవ ఏట విరాటుని నగరమున అజ్ఞాత వాసము చేసి, పిమ్మట క్షేత్ర ధర్మమున కౌరవులతో యుద్ధము చేసి, తమ రాజ్యమును గొనుతలపున నుండుటవిని, మను తనయులు ఉభయ పక్షముల యందు సమాన బుద్ధి కలవారయ్యును, పాండవుల ధర్మ బుద్ధికి లోబడి పాండవ పక్షపాతులై, పాండవ వీరులను కలసి, కురుక్షేత్ర యుద్ధమున కౌరవులను జయించి ధర్మనందనుని ప్రేమకు పాత్రులై, అతడు చేయు మన్ననలతో అతని రాజ్యమున శ్రీకృష్ణ భక్తులై యుండిరి. ఇట్లు మనుకుల రాజులు ద్వాపరాంతము వరకు అఖండ రాజ్యపాలన చేసిరి.

## కలియుగావతరణ

కలియుగం ప్రవేశించెను. ఆసమయమున అభిమన్యుని కుమారుడైన పరీక్షిత్తు రాజై తన పూర్వులవలె మను రాజులను గౌరవించెను. ఆ తరువాత జనమేజయుడు రాజై మను సంతతి రాజులను సత్కరించు చుండెను. ఇట్లు మనువంశ రాజులు పాండు వంశ రాజులచే మన్ననలు పొందుచూ కలియుగములో కూడ ధర్మం తప్పక కృతయుగ రాజులవలె నేలను పాలించు చుండిరి.

ఇట్లు పెక్కు తరాలు మనురాజులు చంద్రవంశ రాజులచే పూజింప బడుచూ దిగంతముల వరకు వ్యాపించిన కీర్తి సంపన్నులై యుండిరి. చంద్రవంశములో విష్ణువర్దనుడు అను రాజు జన్మించి మూర్ధాభిషిక్తుడై రాజ్యము చేయుచుండెను.

విష్ణువర్దనుడు ఒకరోజున మనుకుల రాజవీరులను పిలిచి ఇట్లనెను. ॥ఓ మహాత్ములారా! మీ పూర్వులు కృతయుగము మొదలు కొని పూజ్యులై శ్రీరామాదులచే గౌరవింప బడిరి. మా పూర్వులగు భీష్ముడు మొదలు కొని నా తరము వరకు మా రాజ్యము నందుండి మాచే గౌరవింప బడుచుండిరి. ఇప్పడు వేగిదేశపు రాజులు మాపై తిరుగుబాటు చేయుచున్నారు. తగిన బలాలను కూర్చుకొని వారిపై దండెత్తి వారిని ఓడించిరండు. మిమ్ము విజయవాటికి పట్టంబు కట్టెదను.॥ అని కోరెను.

మనువీరులలో ముఖ్యుడైన దేవతిలకుడు ఉత్సాహముతో చతురంగ బలముతో వేగిదేశముపై దండెత్తెను. అవలీలగా వారిని జయించి, వారిచ్చిన ధనములను స్వీకరించి, తెచ్చి విష్ణువర్దనునకు సమర్పించెను.

విష్ణువర్దనుడు వారి పరాక్రమమునకు ప్రీతుడై, వెంటనే విజయవాటికకు మను తిలకుడైన దేవతిలకుని సపరివారముగా తోడ్కొని పోయి అక్కడ కృష్ణా తీరములో కృష్ణేశ్వరుని నివాసమైన ఇంద్రకీల పర్వతము దగ్గర కూర్చొని మను వీరులను కరుణతో చూచి ఇట్లనెను.

॥ఓ పరాక్రమ వంతులారా! వినుడు ఈ విజయవాటికకు పశ్చిమాన ఉన్న ఇంద్రకీలాద్రి పర్వతముపై పూర్వము మహేశ్వరుడు కిరాత వేషములో అర్జునునితో యుద్ధము చేసి అతనికి అభీష్టార్థముల నిచ్చెను. ఈ పర్వతము దగ్గర నుండి పరమ పవిత్రమైన కృష్ణానది ప్రవహించుచున్నది. ముల్లోకముల యందు కూడా ఇట్టి పుణ్యస్థలము లేదు. ఇచ్చట మాధవవర్మ అను సూర్యవంశపురాజు పూర్వము రాజ్యము చేయుచుండగా అతని కుమారుడు గర్వముతో మహోన్నతమైన గుర్రము నెక్కి పట్టణము మధ్యనుండి వెళ్ళుచూ ఆ గుర్రము యొక్క వేగము నాపలేక ఒక బ్రాహ్మణ కుమార్తెను గుర్రపుడెక్కల క్రింద మట్టించెను. ఆ శిశువు తల్లిదండ్రులు దు:ఖించుచూ ఆ మృత దేహమును తీసుకొని మాధవవర్మ కొలువు కూటమునకు వెళ్ళి జరిగినదంతా చెప్పి శోకముతో ఏడ్చుచుండిరి. లోకోత్తర సౌందర్య వంతుడు, సద్గుణనిధి, పరమేశ్వర వరప్రసాదమున తనకు లేక లేక పుట్టినవాడును అగు తన కుమారుని పిలిపించి మారు పలుకక ఈశ్వరుని ఎదుట ఆ కుమారుని తల నరకుమని తలారులకు ఆనతిచ్చెను. వారు అట్లే చేసిరి. అతని సమత్వమునకు మెచ్చుకొని వెంటనే శంకరుడు ప్రత్యక్షమై రాజు ధర్మబుద్ధికి మెచ్చుకొని వెంటనే వరము కోరుకొమ్మనెను. మాధవవర్మ భక్తవత్సలుడు దేవదేవుడు అయిన శంకరుని బ్రాహ్మణ శిశువును బ్రతికించమని కోరెను. శివుడు అతని ఔదార్యమునకు సంతసించి బ్రాహ్మణ బాలుని బ్రతికించి రాజును మరొక వరమును కోరుకొమ్మనెను. ఆ రాజు తన అంతరాత్మ త్రికాలములలో క్షణిక సుఖములయందు తగులకొనకుండ, పరమేశ్వరుని యందే నిలుచునట్లు చేయుమని కోరెను.

మాధవవర్మ వైరాగ్యానికి శివుడు ప్రీతుడై అట్టి వరముతో పాటు రాకుమారుని పునర్జీవిని గావించెను. ఆ సమయములో దేవతలు ఆకాశమునుండి కనకపుష్పవృష్టి ఎడతెగకుండా కురుపించిరి. మాధవవర్మ సంతోషముతో చిరకాలము రాజ్యముపాలించి తన పుత్రునకు పట్టము కట్టి దివికేగెను. కావున పవిత్రమగు ఈ విజయవాటికకు మీరు అధీశ్వరులై నేల పాలించండి. మీరు మల్లికార్జునదేవుడు ఇష్ట

దైవముగా ధర్మ మార్గమున ప్రవర్తించుడు. అని విష్ణువర్దనుడు పలికి మను ముఖ్యుడగు దేవతిలకునకు శుభముహూర్తములో కృష్ణవేణీ జలాలతో పట్టాభిషిక్తుని చేసెను.

అప్పటినుండి మానవరాజులు పెక్కు సంవత్సరములు పుత్ర పౌత్ర పారంపర్యంగా విజయవాటికను రాజధానిగా చేసికొని దేవతిలకులను బిరుదుతో నేలనేలుచుండిరి.

క్రమక్రమముగా విశ్వంభరుని శాపమున కలియుగమున వారు తమ రాజ్యమును శత్రువుల వలన తమ రాజ్యమును కోల్పోయి తిలఘాత వ్యవహారముచే జీవించుచుండిరి. అయినప్పటికి పరమేశ్వరానుగ్రహము ఉన్నందున సంపదను, కులమును, శీలమును విడువక, జనక్షోభ గావింపక, సత్యమును విడనాడక, దైవభక్తిని, గురుభక్తిని, బ్రాహ్మణభక్తిని విడువక, శాంతస్వరూపులై, మృదు మధుర భాషణులై, దాన ధర్మములను చేయుచు, ధదీచి, శిబికర్ణ, భార్గవులను కూడ దానమున మీరుచూ, సదాచార సంపత్తితో, సప్త సంతాన ములను నిలుపుచు, పెక్కు వ్రతములు చేయుచు, దిక్కుల చివరి వరకు వ్యాపించిన కీర్తి కలవారై, పరస్పర స్నేహ భావముతో జనులందరికి ఆదర్శ గుణము కలవారై పరస్త్రీలను తల్లులుగా భావించుచు, పర ధనముల నాశింపక, భూతదయ కలవారై పెద్ద పిన్నల తార తమ్య మెరిగి ప్రవర్తించుచుందురు. కలియుగమున సామాన్యముగా వర్ణ సాంకర్యము కలిగినా దేవతిలకుల కులములో అట్టిది లేదని సూతుడు శౌనికాది మునులకు చెప్పెను.

## తృతీయ అధ్యాయం సమాప్తం

# చతుర్ధ అధ్యాయం

ఆసక్తితో మనుకుల కధలను వింటున్న శౌనికాదిమునులు శూత మహర్షిని ఇట్లు అడిగిరి. ॥ఓ మహనీయ చరితా! పూర్వము పరశురాముడు ఇరువది ఒక్కసార్లు క్షత్రియులందరిని చంపి భూమండలమును అక్షత్రియము గావించెనని వింటిమి కదా? అప్పుడు ఈ మను రాజులు ఎట్లు మిగిలిరి? ఈ సందేహమును తీర్చుము॥ అని అడిగిరి. వారి సందేహమును సూతుడు ఇలా నివృత్తి చేసెను.

॥పూర్వం జమదగ్ని ద్వైత వనమునందు తపస్సు చేయుచున్న సమయములో కార్తవీర్యుడు తనకు పరమ హితులైన మనుకుల రాజులంగూడి, వేట కొరకు ఆ వనమునకేగి అక్కడ తపోనిష్ఠలో ఉన్న జమదగ్ని మహర్షిని చూచి నమస్కరించెను. మునీశ్వరుడు వారిని ఆశీర్వదించి, మనురాజ సుతులను ప్రియవచనములతో సంభాషించి కార్తవీర్యునితో ఇట్లనెను. మహారాజా! నీవు ఇక్కడికి ఏపని మీద వచ్చావు? అని అడిగెను. రాజు ఇట్లనెను ॥తపోధనా మిమ్ము సేవించుటకన్నా వేరే ప్రయోజనమేమున్నది? మీ దర్శన భాగ్యం లభించినది మేము కృతార్థులమైతిమి॥ అని వినయముతో పలికెను.

జమదగ్ని కార్తవీర్యునితో మహారాజా! అతిథిగా వచ్చిన మీరు భుజింపక పోరాదని కామధేనువును తలచి రాజుకు సపరివార ముగా పక్వాన్న మిడుమనిన వెంటనే ఆ ధేనువు వారందరికి నిమిష మాత్రములో పంచవిధ ఆహారములను సమకూర్చి ఎవరికి కావలసినది వారికి వడ్డించినది. కార్తవీర్యుడు మనుతనయులతో నిజ పరివారముతో భోజనాలు చేసి, సంతోషించి, జమదగ్నితో కామధేనువును తన కిచ్చిన ఏభైలక్షల గోవులను ఇచ్చెదనని కోరెను. పది కోట్ల ఆవులను ఇచ్చినా ఆ ధేనువును ఇవ్వలేనని ఖండితముగా చెప్పెను. ఆసురధేనువు మావంటి తాపసులకు ప్రసన్నురాలయి యుండును కాని మీకు ఉపయోగించదు అని హితవు చెప్పెను. దీనియందు కోరికను విడువుము. వేరొక వరము కోరుము ఇచ్చెదననెను. ఆముని ఎదుట ఏమియు పలుకలేక అతని అనుమతి పొంది తన బలములతో మాహిష్మతీ నగరమునకు వచ్చి ఆ కామధేనువును గొనుటకు తగిన ఉపాయము ఆలోచించుతూ, ఏమియు తోచక రహస్యముగా తన సైన్యముతోనేగి వనముతో ఒంటరిగా మేయుచున్న ఆ ధేనువు నపహరింప పూనుకొనెను. వెంటనే ఆ ధేనువు రోమ కూపములనుండి అపరిమిత సైన్యములు సమస్త శస్త్రసంపన్నములై వెలికి వచ్చి కార్తవీర్యును బలగాలను పటాపంచలు చేసెను. ఆరాజు రాజ్యానికి తిరిగి వచ్చి తనకు ఎన్నడూలేని అపజయము గోరుచుట్టుపై రోకటి పోటువలె మనస్సును బాధించగా, ఏమియు తోచక, మంత్రి కుమారుడైన సత్యకీర్తిని పిలిపించి, ఇట్లనియె. ॥ఓ మంత్రి నందనా! నీవు వెంటనే వెళ్ళి నాప్రియ మిత్రులైన మనువీరులను తోడ్కొని రమ్ము. వారు మన కార్యమును నెరవేర్చ సమర్థులు వారు పరమేశ్వరుని ఆరాధించి పరాక్రమ సంపన్నులై దిగాంతముల వరకు వ్యాపించిన కీర్తి కలవారై యుండిరి. పూర్వము రావణుడు ముల్లోకముల జయించు తలపున రాజులందరిని గెలిచి అమరావతికి నేగి ఇంద్రునోడించి, దిక్పాలుర గర్వమడచిన ఆరాక్షస రాజు భూలోకానికి వచ్చి, నన్ను అజేయునిగా విని, నా నగరమునకు దండెత్తివచ్చి, నగరము బయట సేనలనుంచి యుద్ధమునకు రమ్మని పిలిచెను. నేను కూడ యుద్ధ సన్నద్ధుడనై అతని నెదరించితిని. ఏడు రేయింబవళ్ళు యుద్ధము చేసితిని. దశవదనుని బాహుబలం పెరిగిపోయెను. ఆసమయంలో నేను మనువీరులను తలచుకొని అమాత్యుని పంపి వారిని రప్పించితిని. వారు తమ బలగాలతో వచ్చి నాతో ఉన్న స్నేహాన్ని పురస్కరించుకొని నాకు సహాయముగా రాక్షస రాజుతో పోరుకు తలపడిరి. భయంకరమైన యుద్ధము జరిగినది. మనుకుమారుల సాయంతో నేను రాక్షస సైన్యాలను పీనుగు పెంటలుగా చేసి దశవదనుని పట్టుకొని వింటినారితో బంధించి కారాగృహమున పెట్టితిని. కొంత కాలమునకు పులస్త్యమహర్షి వచ్చి పుత్రభిక్షపెట్టుమని వేడుకొనగా రావణుని కారాగార బంధ విముక్తి గావించితిని. కావున నీవు మానవాధీశురులను తీసుకొని రమ్ము. వారు వచ్చిన నా కోరిక తీరును అని చెప్పగా సత్యకీర్తి మనుకుమారులను పిల్చుకొని వచ్చెను.

కార్తవీర్యుడు మనుకుమారులతో జమదగ్ని ఆశ్రమ సీమకు వెళ్ళి కామధేనువు పట్టుకొన నుద్యమించెను. పూర్వము వలనే ఆఆ ఏరోమ కూపముల నుండి వచ్చిన బలములతో పోరు సల్పెను. మనురాజుల సాయంతో కృతవీర్య నందనుడైన కార్తవీర్యుడు గెలిచి ఆ ఆవును పట్టుకొన ప్రయత్నించగా అది తపస్సు చేయుచున్న జమదగ్ని వెనుకకు వెళ్ళి మొర పెట్టుకొనెను. అప్పడు ఆ ముని తపస్సు చాలించి కోపముతో కళ్ళు ఎరుపెక్కగా బ్రహ్మదండము నెత్తి వారిపై ప్రయోగించ నుండగా వెనుక ముందు ఆలోచించని కార్తవీర్యుడు

అర్ధచంద్ర బాణము వేసి ఆముని తల నేలగూలవేసెను. దేవతలు, మునులు, హాహాకారములు చేసిరి. కాని తన తపోమహిమ చేత ముని తల మొండెమునకు అతుక్కొని పోయినది. మునులు నివారించుచున్ననూ వినక కాలవశాన కన్ను మిన్ను కానక ఆ కామధేనువును అపహరించి మనురాజులతో తన రాజ్యానికి వెళ్లెను.

పిమ్మట జమదగ్ని కుమారుడగు పరశురాముడు మహేంద్ర పర్వతమున తపస్సు చేయుచూ, తన తండ్రికి జరిగిన అవమాన మును మునుల వలన విని తోక తొక్కిన పాము వలె కోపించినవాడై క్రోధాంధుడై తన పరాక్రమ మనెడి అగ్నిచేత రాజలోకమనెడి అరణ్యమును దహింపదలచి గొడ్డలిని త్రిప్పచూ భూమండలమున గల రాజధానులకేగి మారు పలకక ఇరువది ఒక్కమారు సమస్త క్షత్రియ సంహారము చేసెను. ఇట్లు కాశ్మీర, కాంభోజ, కరవాట, లాట, మరాఠ, కొంకణ, టెంకణ, ఘుర్జర, యవన, గాధార, అంగ, వంగ, కళింగ, విదర్భ, మగధ, కర్నాటక, రూశ, నేపాళ, పాంచాల, కురు, కోశల, అవంతి, ద్రవిడ, మాళవ, చేది, చోళ, బర్బర, మత్స్య, ప్రముఖ రాజ్యాల కరిగి ఆ రాజులను తన గొడ్డలికి బలి యిచ్చి క్రమముగా మహిష్మతి నగరముపై దండెత్తి కార్తవీర్యుని యుద్ధానికి రమ్మని పిలిచెను. కార్తవీర్యుడు మనువంశ తిలకుల సైన్యాలను తన బలగాలతో కలుపుకొని పరశురాముని ఎదిరించెను. పరశురాముడు కోపముతో మండి పడుచూ కార్తవీర్యునితో ఇట్లనెను. ఓ క్షత్రియపశువా మనుజపశువా రాజ్య మధాంధుడవై క్రింద మీద గానక అడవిలో తపస్సు చేసుకొనే మా తండ్రిని చంపితివి. నిన్నిప్పడే యమపురికి పంపెదను. వెనుదీయక నిలువుము అని గర్జించెను. పరశురామునితో కార్తవీర్యుడు ఇట్లనెను. ఓ బాపడా! అడవిలో ఆకులు అలములు తినుచూ తపస్సు చేసుకొంటూ ఉండుట నీకు చెల్లునుకాని మా వంటి మహావీరుల నెదిరించుట చదలపురుగునకు రెక్కలు వచ్చినట్లున్నది. ఫలము అనుభవించెదవు అని వాడిబాణములతో ఆముని శరీరమును కప్పివేసెను. పరశురాముడు ఆ బాణముల దాడి వారించి ఏనుగు మీదకు దూకు సింహమువలె దగ్గరకు వెళ్లి తీక్ష బాణములచే బాధించుచూ సైనికులను గజాశ్వ పదాతి దళాలను పీనుగపెంటలు చేసెను. మద్యాహ్న సమయమున సూర్యుని వలె దేదీప్యమాన మూర్తియై ఎవ్వరికి తేరిచూడరాకు పదిహేడు అక్షౌహిణుల బలగాలను రూపుమాపెను. నిముషంలో సర్వం దహనం చేయగల కార్చిచ్చువలె మహోగ్రముగా కార్తవీర్యునిపై పడి అతని సారధిని గుర్రములను తన గొడ్డలితో నరికి విరధుని చేసి వేయి చేతులను అవలీలగా ఆరాజును నేలగూర్చెను.

అప్పడు మనువీరులు పరశురామునితో ఏడు అహోరాత్రులు ఎడతెరపి లేని పోరు చేసిరి. అవతార పురుషుడగు పరశురాముడు వారి సేనలను చంపి వారిని కూడ చంప నుద్యుక్తుడయ్యెను. ఆ సమయములో కాలత్రయవేదియగు కపిలాచార్యుడు వచ్చి పరశురాముని నివారించి ఈ మనుకులజులు లోకరక్షణ కొరకు త్రిమూర్తులచే నిలుపబడిన వారని, వారిని చంపిన లోకము అరాచకమగును. దాని వలన వర్ణాశ్రమ ధర్మములు నశించును. కావున ఆ వీరులను చంపవద్దని భోధించెను. మూడు లోకాలకు గురువైన కపిలాచార్యుని మాటలను మన్నించి మను కుమారులను చంపకుండా విడిచిపెట్టి, గౌరవించి తనచే జయింపబడిన సమస్త భూమండలమునకు వారిని మూర్ధాభిషిక్తులను జేసి, వారికి నీతులుచెప్పి, తండ్రి వద్దకు వెళ్లి నమస్కరించి అతని అనుజ్ఞతో తపస్సు చేయుటకు మహేంద్రగిరికి వెళ్లెను.

మానవోత్తములైన మనుకుమారులు భూలోక రాజ్యమును పాలించుచుండగా, ఒకనాడు శ్రీమన్నారాయణుని అవతారమైన కపిలాచార్యుడు కనక నగరమునకు వచ్చి మనురాజులచే పూజితుడై వారికి తాను రచించిన సాంఖ్యాశాస్త్రమును ఉపదేశించెను. పెక్కు రాజ ధర్మములను భోధించెను. విశ్వంభర శాపమున తిలఘాత వృత్తి తటస్థించును కావున వారికి తిలలను ప్రసాదించగా వాటిని వారు మహా ప్రసాదమని స్వీకరించిరి. ఆముని వారితో ఇట్లనెను.

మీ వంశము లో జన్మించేవారు కలియుగంలో తిలవృత్తితో జీవిస్తారు. మా ఆశీర్వచన ప్రభావమున మీ వంశజులందరు సర్వోన్నతులు, దాంతులును, శాంతులును, పవిత్ర చరిత్రులును, సకల సద్గుణ వీరాజమానులును, దేవ బ్రాహ్మణ భక్తి యుక్తులును, పరస్త్రీ, పర ధన విముఖులును, పరోపకారులును, మేఘమువలె దాన శీలురును, సముద్రుని వలె గంభీరులును, ధర్మ దేవతవలె సత్య సంధులును, మేరు పర్వతము వలె ధైర్యవంతులును, కుబేరుని వలె అపరమిత సంపన్నులు, భూమాత వలె ఓర్పు కలవారును, చంద్రుని వలె చల్లని వారును, రుద్రుని వలె దుర్జన వినాశకారులును, దామోదరుని వలె సజ్జన పాలకులును కాగలరు. కలియుగంలో వర్ణ సాంకర్యము కలుగును. కాని మీ మనువంశమునకు అట్టి దురవస్థ కలగదు. మీరు సకల లోక మాననీయులు, సద్గుణ సంపన్నులు, ధర్మ మార్గ నిష్ణాతులు కాగలరు. నా అనుగ్రహం వల్ల కలియుగంలో కూడ ఈ సద్గుణాలు విడువవు.

కలియుగం ఆరంభంలో పాండవ పౌత్రుడు పరీక్షిత్ మహారాజు దిగ్విజయార్ధము తన నగరమును విడిచి వెళ్ళుచూ సరస్వతీ నదీ తీరమున గోరూప ధారిణి యగు భూదేవిని వృషభ రూప ధారుడగు ధర్మ దేవుని కలి పురుషుడు కాలితో తన్నుట చూచి తన రాజ్యము నందు నిలువ వద్దని శాసించెను. భయముతో కలి శరణు కోరగా పరీక్షిత్ అతనిని గోవధ, స్త్రీ హత్యలు చేయువారిని ఆశ్రయించుకొని యుండుమని చెప్పి తనచే సత్కరింప బడుచూ తన రాజ్యమునందు తనకు సాయముగాను మనువంశ సంభవులను యుగాంతము వరకు చేరబోకుమని కలి పురుషుని నియమించెను. కావున మీకు ఏకులములోను ఎవరివల్ల భయం కలుగదు అని కపిల మహర్షి వీరిని ఆశీర్వదించగా మనువంశజులు సంతోషముతో వందనములు ఆచరించి వినయముతో వంచిన శిరస్సు కలవారై ఇట్లు విన్నవించిరి

॥మహాత్మ! ఇది అంతా మా పూర్వ జన్మ సుకృతం. వాత్సల్యముతో మా మేలు గోరి ఇట్లు అనుగ్రహించిరి. మీ వంటి పుణ్యపురుషుల అనుగ్రహం వలన కలిమిలో మేము కృతార్థులమైతిమి. చనవుతో మీనుండి ఒక విషయము తెలిసికొన గోరుచున్నాము. జనన మరణాది దుఃఖముతో కూడిన ఈసంసారమున ఎటు చూచినా సుఖాభానయే దాని వలన సుఖము కొంచెం కూడా కనబడదు. కావున ఆపన్నులము సంసారమనెడి దావానలములో మాడి పోతున్న మీశిష్యులమైన మాకు సదుపదేశము చేసి రక్షింపుడు. మానవజన్మ మోక్షేచ్ఛ మహాత్ముల సాంగత్యం- ఈమూడును దైవానుగ్రహం వలన అలవడును. సాధారణముగా ఇవి అలవడవు. దుర్లభమైన ఈనర జన్మలోనే ఇందలి పురుషార్ధం తెలిసికొని, ఇందలి వేదాల అర్ధమును గ్రహించి ముక్తికి ప్రయత్నించక పోయిన ఆత్మ ద్రోహి అగును. మానవ శరీరమును పొంది స్వార్ధముతో నున్నవాడు మూఢాత్ముడు. ఓ పరమాచారా! నీకు వందనము. దయా సముద్రుడా సంసార సాగరమున

మునిగి పోతున్న మాపై మీ కరుణా కటాక్ష వీక్షణాలను ప్రసరింపజేయుము. వారింప శక్యముగాని సంసారమనెడి దావానలములో పడి మాడిపోతున్న మమ్ము రక్షించుటకు నీవే మాకు దిక్కు. శాంతాత్ములగుమీ వంటి మహాత్ములు లోక హితము కొరకు చరించుచూ సంసార సాగరమును మీరు తరించి ఇతరులను కూడ తరింపజేయుదురు. ఇతరుల పరి తాపమును చల్లార్చుట మహాత్ములకు స్వత స్సిద్ధమగు స్వభావము.

తాను సూర్యుని కిరణాలతో తపించిపోవుచూ, చంద్రుడు  చల్లని కిరణములచే భూమిని రక్షించుచున్నాడు. అట్లే మీరు బ్రహ్మానంద రసానుభవముల కూడిన, పవిత్రమైన చల్లనైన తమ మృదు మధుర వచనామృతములచే సంసార దావానల జ్వాలలచే తపించుచున్న మమ్ము తడుపుము. మీయొక్క కరుణా కటాక్ష వీక్షణములకు పాత్రులగువారే ధన్యులు. ఈసంసార సాగరమును మేమెట్లు దాటగలము? మాకేది దిక్కు? దీనికేమైనా ఉపాయము ఉన్నదా? మాకు ఏదియు తోచుటలేదు. దయతో మీరే రక్షింపుడు. సంసార దుఃఖ నాశనము చేయుడు.॥ అని వేడుకొనుచు తన పాదములపై తలలు వంచిన మనుప్రభువులను కపిలమహర్షి లేవనెత్తి వారివీపు తట్టి కరుణతో కూడిన చూపును వారిపై ప్రసరింపజేసి, ఇట్లనెను ॥ ఓ పరిశుద్ధ చిత్తులారా! భయపడకుము మీకు ఏ అపాయము లేదు. సంసార సముద్రమును దాటుటకు ఉపాయము కలదు పరమహంసలు ఏత్రోవను బట్టి సంసారమును దాటిరో ఆమార్గమును మీకు చూపెదను. సంసార దుఃఖములను తొలగించు రహస్యము ఒకటి కలదు. చెప్పెదను శ్రద్ధగా వినుడు.

ఆధ్యాత్మికము, ఆదిభౌతికము, ఆదిదైవికము అని దుఃఖములు మూడు విధములు. ఆధ్యాత్మికము శారీరము, మానసము అని రెండు విధములు. వాత, పిత్త, శ్లేష్మ విపర్యయ జనితమగు జ్వరాతిసారాదికము, శారీరము, ప్రియ వియోగ, ప్రియసంయోగాదికము మానసము జరాయుజాండ జస్వేదజ ఉద్భిజ్జంబుల వలన పుట్టినదైన ఆదిభౌతికము నాలుగు విధములు. శీత, ఉష్ణ, వాత, వర్ష అశనిపాతాదికము ఆధిదైవికము. ఆయుర్వేద చికిత్సవలన ఆధ్యాత్మికము, రక్షాధికము చేత ఆధిభౌతికము ఆధిదైవికము ఉపశమించును. ఆ విషయమును తెలిసికొన వలెననెడి కోరిర వ్యర్ధమనరాదు. చికిత్సాదికమగు ప్రత్యక్ష హేతువుచే తప్పక ఎల్లప్పుడూ దుఃఖ త్రయ నాశన మగునను నియమము లేదు. వేదోక్త యజ్ఞ యాగాది సత్కర్మల నాచరించుట స్వరూపముగాగల ఆనుశ్రావిక హేతువుచే దుఃఖ త్రయ నాశనమగుననుట సమంజసముకాదు. పశువధ వలన పారిశుద్ధత యుక్తము కాకపోవుటవలనను, క్షయయుక్తమగుట చేతను, దుఃఖ జనకమగుట చేతను, అనుశ్రవికంబుకూడ దుఃఖ త్రయనివారకముకాదు. కనుక దుష్ట అనుశ్రవిక విలక్షణమగు పంచవింశతి తత్వజ్ఞానము వలన దుఃఖత్రయ నాశనమగును. కావున ఆవివేకమును ఉపదేశించెదను. దీనిచే మీరు జీవన్ముక్తులై నిస్సంగులగుట అనాయాసముగా జనకాదులవలె సంసారమందుండియు నిర్లిప్తులై తరింటెదరు.

ప్రకృతి వికృతి సప్తకమునకుమూల భూతమగుట వలన ప్రధానము మూల ప్రకృతి అనబడును. ఇది ఇంకొకదాని వలన పుట్ట లేదు కావున వికృతి కాదు. బుద్ధి, అహంకారము, పంచ తన్మాత్రలు అను ఈఏడును ప్రకృతులు, వికృతులునగు ప్రధానము వలన బుద్ధి జనించినది కావున ఈ బుద్ధి మూల ప్రకృతికి వికృతి. ఇది గర్వమును పుట్టించునది కావున ప్రకృతియునై ఉన్నది. గర్వము బుద్ధి వలన కలుగుట చేత వికృతియు, ఇది పంచతన్మాత్రలను పుట్టించుటచేత ప్రకృతి ఐనది. ఆ పంచన్మాత్రలలో శబ్దతన్మాత్రము అహంకారము నుండి పుట్టినది. కావున వికృతియు, తన వలన ఆకాశము పుట్టినది కావున పకృతి ఐనది. స్పర్శతన్మాత్రము అహంకారము నుండి పుట్టినది. కావున వికృతియు, తానుపోయు జనకము కావున పకృతి ఐనది. గంధ తన్మాత్ర, రూపతన్మాత్ర, రసతన్మాత్రములు అహంకారము వలన కలుగుట చేత వికృతులును, గంధతన్మాత్రము భూమిని, రూపతన్మాత్రము తేజస్సును, రసతన్మాత్రము నీటిని పుట్టించినవి కావున ప్రకృతులు నైనవి. ఇట్లు మహదాదులు ఏడును ప్రకృతులు, వికృతులు అనబడును. బుద్ధి ఇంద్రియములైదును, కర్మేంద్రియములైదును, మనస్సును పంచభూతములు ఈ పదహారును వికృతులే. పురుషుడు ప్రకృతికాదు వికృతియుకాదు॥ అని ఉపదేశించిన కపిలమహర్షితో రాకుమారులిట్లనిరి. ॥ఓ గురూత్తమా! లోకమునందు కుంచములచే ధాన్యములు, త్రాసుచే చందనాది కము వలె ప్రమేయ వస్తువు ప్రమాణ వస్తువుచే కాని సాధింపబడదు కావున వ్యక్తము, అవ్యక్తము, పురుషుడు అను మూడు పదార్ధములలో ఏయే ప్రమాణముచే ఏది సిద్ధించును చెప్పమని కోరగా సంతసించి కపిలమహర్షి ఇట్లనెను.

అర్ధాపత్తి సంభవము, అభావము, ప్రతిభ, ఐతిహ్యము, ఉపమానము మొదలగునవి పూర్వాచార్యులచే పరిగణితములగు అన్ని ప్రమాణములు ప్రత్యక్ష అనుమాన అప్రోక్తి పర్యాయమగు మూడు ప్రమాణములలో అంతర్భూతములగుట వలన వానినందు వివరింప నక్కర లేదు.

ప్రమేయములగు ప్రధానము మొదలగు పంచ వింశతి తత్వములలో కొన్ని ప్రత్యక్ష ప్రమాణము చేతను, కొన్ని అనుమాన ప్రమాణము చేతను, కొన్ని అప్రోక్తి పర్యాయమగు ఆగమ ప్రమాణము చేతను సాధింపగడు చున్నవి. ప్రత్యక్ష ప్రమాణమున చెవి,చర్మము, కన్ను, నాలుక, ముక్కు అను ఐదు జ్ఞానేంద్రియములు క్రమముగా శబ్ద, స్పర్శ, రూప, రసగంధములను విషయములందు ప్రవర్తించును. శేషవత్తు, పూర్వవత్తు సామాన్యదృష్టము అని అనుమాన ప్రమాణము మూడు విధములు.

సముద్ర జలము వలన ఒకప్పుడు లవణమును పొంది కొరపడిన సముద్ర జలమునకు కూడ లవణము ఉండునని తెలుసు కొనుట పూర్వవత్తు. పూర్వము వర్షమును చూచి మేఘోన్నతిచే వర్షమును సాధించుట పూర్వతత్వము. దేశాంతరము నుండి మరియొక దేశమునకు వెళ్ళిన చైత్రుడును వానిని చూచి వీడు నడచువాడని తెలుసుకొనునట్లు పూచిన మామిడి చెట్లను చూచి ఇంకొంక చోట కూడ మామిడి చెట్లు పూచియుండునని తెలిసికొనుట సామాన్య దృష్టము అనుమాన ప్రమాణము లింగ పూర్వకము. లింగపూర్వకమగు దండరూప లింగమును చూచి యతి ఉండవచ్చునని ఊహించుట లింగపూర్వకము. మొదట దండమును చూచి తరువాత యతిని చూచి ఇతనిది ఆదండము అని తెలిసికొనుట లింగపూర్వకము. బ్రహ్మాదులగు ఆప్తులచేతను వేదము చేతను పలుక బడినది అప్రోక్తి. సామాన్య దృష్టము అను అనుమాన ప్రమాణముచే అతీంద్రియములగు పదార్ధములను అనుసంధింపవలెను. ప్రధాన

పురుషులు అతీంద్రియ పదార్థములు. వీనిని సామాన్య దృష్టము అను అనుమాన ప్రమాణము వలన తెలిసికొన వచ్చును. మహాదాది కార్యజాతము గుణత్రయాత్మకము త్రిగుణమగు ఈకార్యము దేనికి సంబందించినదో అది అప్రదానము అచేతనమగు నిది సచేతనము వలె నుండుటచే అదిష్టాత వేరొకడు కలడు. అతడే పురుషుడగును. ఇట్లు సామాన్య దృష్టము అను అనుమానముచే సాదింపవలెను. వ్యాకమెల్ల ప్రత్యక్ష సాధ్యము. ప్రత్యక్షముచే సాధ్యము గాని పరోక్షము అప్రోక్తి రూపమగు ఆగమము వలన సాధింప దగినది.

ప్రధానము పురుషుడు మనకు కనుబడుటలేదు. లోకము నందు కనబడినది ఉన్నదని చెప్పట సమంజసము కాదు. కావున ప్రధానము పురుషులు లేరని చెప్పవచ్చునని పలుకవద్దు. కలిగియుండు పదార్థములను కూడ ఎనిమిది విధములుగా అనుపలబ్ధి కన బడుచున్నది. దూరముగా నుండుటవలన, మిక్కిలి దగ్గరుండుటవలన, ఇంద్రియ వైకల్యము వలన, అవ్యవస్థిత చిత్తము వలన, సూక్ష్మత్వము వలన, వ్యవదానము వలన, సమాన వస్తు మధ్యస్తితి వలన, సర్వస్తువులకు ఉపలబ్ధి లేదు. కావున ఆకాశమునందు పొగ, మబ్బు, ఆవిరి, నీరు, మంచు పరమాణువులు కలిగి యున్ననూ మనకు కనబడక ఉండునట్లు ప్రదానము అరమాణువువలె మిక్కిలి సూక్ష్మము. కావున మనకు కనిపించుట లేదు. కాని అది లేకపోవుట వలన కాదు మహదాది కార్యజాతమును చూచి ప్రదానము కలదని అనుమాన ప్రమాణముచే తెలుసుకొనవచ్చును. మహదాది కార్యజాతము తన ప్రకృతియగు ప్రదానమునకు విరూపముగను సరూపముగను ఉన్నది.

లోకమునందు ఇసుకనుండి తైలోత్పత్తి లేనట్లు అసత్కరణము లేదు కావున ప్రధానమునందు వ్యక్తమగు మహదాదికము సత్కార్యము సత్పదార్థము యొక్క కార్యము కాని వేరొండు కాదు లోకము నందు ఎవరు దేనిని కోరుచున్నాడో వాడు ఉపాదానమును గ్రహించిచున్నాడు. పెరుగును కోరువాడు పాలను సంపాదించును కానీనీరును గ్రహించడు కదా! బంగారము గడ్డియందు, బూడిద యందు పుట్టినట్లు సమస్తము అంతటా దొరకదు కావున నంతే సంభావ అభావము వలన యావాదాదికము సత్కార్యము కాని అసత్కార్యము కాదు. కుమ్మరి మట్టి దండము, చీవరము, త్రాడు, చక్రము మొదలగు పరికరములు కలవాడై మట్టిముద్ద వలన కుండను చేయునట్లు సమర్థుడు శక్యమగుదానిని చేయుదు కావున ఈ కారణముచే వ్యక్తము సత్కార్యము. యవల వలన యవలు, ధాన్యము వలన ధాన్యము కలుగునట్లు కారణమే లక్షణము కలిగి యుండును. కార్యము అట్టిదే అగును. కార్యము విపరీతమగు నెడల ద్రవముల వలన వీరులు పుట్టవలెను. అట్లు కలిగియుండలేదు. కావున మహదాదికము సత్కార్యమే కాని అసత్కార్యము కాదు. ఇట్లు చెప్పబడిన అసత్కరణాది ఐదు హేతువుల వలన ప్రధానము నందు మహదాది లింగము కలదు. కావున సద్వస్తువు వలన ఈ మహదాదులు ఉత్పత్తి అగును. అసత్తువలన కాదు.

వ్యక్తమగు మహదాదికము కారణము కలది. వ్యక్తమునకు ప్రధానము కారణమై ఉన్నది. కావున అది హేతుమత్తు అగును. ప్రధానముచేబుద్ధితత్వము, బుద్ధిచే అహంకారము, అహంకారముచే పంచతన్మాత్రలు, పదకొండు ఇంద్రియములు హేతుమత్తులు అగును. శబ్ద తన్మాత్రముచే ఆకాశము, స్పర్శ తన్మాత్రముచే వాయువు, రూప తన్మాత్రముచే తేజస్సు, రస తన్మాత్రముచే జలము, గంధ తన్మాత్రముచే భూమి హేతుమత్తులు. ఇట్లు పంచభూత పర్యంతమగు వ్యక్తము హేతుమత్తు. ఈ మహదాదికము మట్టిముద్దల వలన కలిగిన కుండవలె హేతుమత్తు అగును. ఈ నిత్యము మరియు వ్యక్తము ప్రధాన పురుషుల వలె అంతటా వ్యాపించదు. పదమూడు విధముల నున్న ఇంద్రియజాతముతో కూడిన సూక్ష్మ శరీరమును ఆశ్రయించి సంసార దశ యందు సంసరించును కావున ఇది క్రియాసహితము. బుద్ధి, అహంకారము, పంచతన్మాత్రలు, ఏకదశ ఇంద్రియములు, పంచ భూతములు అని వ్యక్తము పెక్కు విధములు. లయకాలమందు పంచ బూతములు, పంచతన్మాత్రలయందు క్రమముగా లీనమగు చున్నవి. పంచ తన్మాత్రలు పదకొండు ఇంద్రియములతో కూడా అహంకారము నందు లీనమగుచున్నవి. అహంకారము బుద్ధి తత్వము నందు, బుద్ధి తత్వము నందు, బుద్ధి తత్వము ప్రధానమునందు లీనమగు చున్నవి. కావున ఈ వ్యక్తము లయయుక్తము. శబ్ద, స్పర్శ, రూప, రస గంధములను అవయముల తో కూడుకొనినది. కావున ఈ వ్యక్తము అవయములతో కూడినది. ఇది తనకు తాను సమర్థమైనది కాదు. కావున పర తంత్రమైనది. ప్రధానపర తంత్రము బుద్ధి తత్వము, బుద్ధి పర తంత్రము అహంకారము, అహంకార పర తంత్రము పంచ తన్మాత్రలును, ఏక దశ ఇంద్రియము లను, పంచ తన్మాత్ర పరతంత్రములు పంచ భూతములు ఇట్లు వ్యక్తము. పరాధీనము కాని స్వతంత్రము కాదు. అవ్యక్తమగు ప్రధానము స్వజనకమగు కారణాంతరము తనపైన లేదు కావున హేతుమత్తు కాదు. కావున ప్రధానము నిత్యమును, అంతటా వ్యాపించునది, క్రియ లేనిది, మూడులోకాలకు మూలకారణము నగుటచే ఏకము, అనాశ్రాతము, నశించునది, అవయవములు లేనిది, స్వతంత్రమును అయి ఉన్నది. ఇట్లు వ్యక్తమునకు అవ్యక్తమునకు వైధర్మ్యము చెప్పబడినది.

వ్యక్తము, అవ్యక్తము ఈ రెండును గుణత్రయాత్మకములు వివేకము లేనివి. పురుషులందరికి భోగ్యములు సర్వ సామాన్యములు. చేతనత్వం లేనివి. ప్రసవ ధర్మములును కావున సరూపములు. పురుషుడు ఇట్టివాడు కాడు. అతడు నిర్గుణుడు, వివేకి, భోగ్యుడు కాడు, సామాన్యుడు కాడు, చేతన స్వరూపుడు, కారణ హీనుడు, నిత్యుడు, క్రియలేనివాడు, అనాశ్రితుడు, నాశము లేనివాడు, అవయవము లేనివాడు, స్వతంత్రుడు, కావున పురుషుడు వ్యక్తమునకు, అవ్యక్తమునకు భిన్నమైనవాడు.

వ్యక్తము, అవ్యక్తము, సత్వ, రజస్తమో గుణములతో కూడినవి. సత్వగుణము, సుఖస్వరూపము, ప్రకాశ సమర్థమును, రజోగుణము అప్రీతితో కూడినది. ప్రవృత్తి సమర్థమును, తమోగుణము మోహముతో కూడినది. స్థితి సమర్థమును, ఈ గుణముల ప్రీతి, అప్రీతి మొదలగు ధర్మములచే ఒకదానినొకటి మీరియుండును. సత్వగుణము అధికమగునపుడు రజస్తమో గుణములను తిరస్కరించి ప్రీతి ప్రకాశములతో కూడిన తన గుణములతో నిలిచియుండును. రజోగుణము అధికమగునప్పడు సత్వతమోగుణ ములను మీరి అప్రీతి, ప్రవృత్తులతో కూడిన తన ధర్మములతో నిలుచును. తమోగుణము అధికమగునప్పడు సత్వరజోగుణములను మీరి విషాదము, మోహము స్థితి రూపములైన తన ధర్మములతో నిలచును. ఈ గుణములు అనుద్వయము వలె ఒకదానినొకటి ఆశ్రయించుకొని ఉండును. మట్టి ముద్ద కుండను పుట్టించునట్లు పరస్పర జననములు, స్త్రీ పురుషుల వలె అన్యోన్య సహాయములనై యుండును.

రూపవతి, సుశీల అగు సాధ్వి అందరకు సుఖహేతువయ్యు, సవతులకు దుఃఖహేతువు, కాముకులకు మోహహేతువు అగునట్లు సత్వగుణము రజస్తమో గుణవృత్తి హేతువగును. ప్రజా పాలనలో శిష్టరక్షణ, దుష్టశిక్షణ చేయురాజు శిష్టులకు సుఖమును, దుష్టులకు దుఃఖమును, మోహమును కలిగించునట్లు రజోగుణ సత్వ తమో గుణముల వృత్తిను కలిగించును. మేఘములు ఆకాశము నావరించి లోకమునకు సుఖము కలిగించునట్లు దుక్కిదున్ను వార్కి వ్యవసాయ ఉద్యోగమును విరహులకు మోహమును పుట్టించు నట్లు తమో గుణము ఆత్మ స్వరూపమున సత్వ రజోగుణముల వృత్తిని కలిగించును. సత్వగుణము అధికమగునపుడు అవయవము లకు చులక దనమును, బుద్ధికి ప్రకాశమును, ఇంద్రియములకు ప్రసన్నత కలుగును. వృషభము వృషభమును చూచుచున్నప్పడు అంకె వేయునట్లు రజోగుణము చంచలమై యుండును. తమోగుణము అధికమగునపుడు అవయవములకు గురుత్వమును, ఇంద్రియము లకు స్వార్ధా సమర్ధతయు కలుగును. ఇట్లు గుణములు గుణములు పరస్పర విరుద్ధములయ్యు అన్యోన్య విరుద్ధములగు తైలము, అగ్ని, వత్తి కలయికచే దీపము పదార్ధములను ప్రకాశింప జేయునట్లు గుణత్రయమునకు కార్యసాధకమగు వృత్తిని అంగీకరింప వలెను.

మహదాది కార్యజాతమునందు గుణత్రయభావము వలన అవివేకిత్వము సిద్ధించును. తంతువులే పటముగాని తంతువులు వేరు పటము వేరు కొన్నట్లు తనకు వేరు లేకపోవుట వలనను, నల్లని నూలుప్రోగు వలన నల్లని బట్ట కలుగునట్లు కార్యము కారణ గుణాత్మక మగుటచే మహదాది లింగము అవివేకియు, విషయమును, సామాన్యమును, అచేతనమును, ప్రసవ ధర్మియు కావున ఈ మహదాది కారణమగు అవ్యక్తముకూడ అవివేకిత్వాది గుణవిశిష్టమే అగును. కార్యము కారణ గుణాత్మక మగుట వలన తనకు వేరు లేకపోవుట వలన, అవ్యక్తము సిద్ధించెననుట సమంజసము కాదు. లోకములో ఏది కన్పించదో అది లేనిదేయగును. కర్త ఉన్నప్పడు పరిమాణము ఉండును. కుమ్మరి మట్టి ముద్దలచే కుండలు చేయునట్లు మహదాది లింగము గొప్పదైనను ప్రధాన కార్యమగుట పరిమితమయ్యెను. బుద్ధి, అహంకారము, ఐదు తత్వాలు, పదకొండు ఇంద్రియములు, పంచభూతములు అని భేధములకు పరిమాణ ముండుట వలన, పరిమితమగు వ్యక్తమును పుట్టించినట్టి ప్రధానము మూలకారణమై యున్నది. ప్రధానము లేనిచో పరిమాణము లేని వ్యక్తము ఉండలేదు. కావున భేధము వలన, పరిమాణము వలన, వ్యక్తమునకు ఉత్పాదకమగు అవ్యక్తముండును, సమన్వయము వలన కూడా ప్రధానము కారణమైనది. గతము నాచరించు బ్రహ్మచారిని చూచి వీరి తల్లి తండ్రులు బ్రాహ్మణులని సమన్వయించు నట్లు త్రిగుణమగు ఈ మహదాది లింగమును చూచి దీనికి గల కారణము కూడా త్రిగుణమేయని మనము సాధించెదము కదా! కావున సమన్వయముచే ప్రధానము సిద్ధించును. లోకములో ఎవడు దేనియందు సమర్దుడో వాడు ఆపనియందు ప్రవర్తించును. కుమ్మరి కుండలను చేయు సమర్ధుడు కావున వాడు కుండలే చేయును. కానీ పటమును కానీ, రధమును కానీ చేయడు. శక్తశక్యకారణ న్యాయము (దేనినెవడు చేయదగు దానిని వాడు చేయుట) వలన కూడ ప్రధానము సిద్ధించును. కార్య కారణ విభాగము వలన కూడ ప్రధానమును సాధింప వచ్చును. కుండ, పెరుగు, పాలు, తేనె మొదలగు వానిని ధరింప సమర్దమైనవి. కాని తత్కారణమగు మట్టి ముద్ద సమర్దము కాదు. మట్టి ముద్ద కుండను నిష్పన్నముగా చేయును. కానీ కుండ మట్టిముద్దను చేయలేదు. మహదాది లింగమును చూచి దేని విభాగము ఈ వ్యకతమో అట్టి విభక్తమగు ఒక కారణము కలదని అనుమానింప బడుచున్నది. ఇంతేకాక మూడు లోకములకు విభాగము లేక పోవుట వలన కూడ ప్రధానము సిద్ధించుచున్నది. ప్రపంచ వ్యక్తి యొక్క భూమి మొదలగు పంచ భూతములకును అన్యోన్యము విభాగము లేదు. మూడు లోకములను పంచ భూతములందు అంతర్భూతములై యున్నవి. పంచ భూతములు ప్రళయ కాలమందు విభాగము లేకుండుటచే సృష్టి క్రమమున పరిణతములగు తన్మాత్రలందు లీనమగు చున్నవి. పంచతన్మాత్రలు, ఏకదశఇంద్రియములు, అహంకారము నందు, ఆ అహంకారము బుద్ధియందు, బుద్ధి ప్రధానమునందు ఇట్లు మూడు లోకములు ప్రళయ కాలమునందు ప్రక్యాత విభాగమును పొందుచున్నది కాన ఆవిభాగము వలన క్షీరదధి న్యాయమున వ్యక్తమునకు అవ్యక్తము కారణమై ఉన్నది. సత్వ రజోస్తమో గుణముల సామ్యావస్థయే ప్రధానము కావున గుణ త్రయము వలన శివుని శిరమున పడిన గంగాప్రవాహములు మూడును కూడి ఒక ప్రవాహము అగునట్లు త్రిగుణమగు అవ్యక్తము ఒక వక్తమును కలిగించును. తంతువులు కలసి పటమగునట్లు గుణత్రయము వలన అవ్యక్తము వక్తమును పుట్టించినది. ఏక స్వరూపమగు ప్రధానము వలన మూడు లోకములును పుట్టి ఒకే రూపమున ఉండలేదు. దేవతలు సుఖవంతులు మనుష్యులు దుఃఖముతో కూడినవారు. పశు పక్ష్యాదులు మోహముతో కూడినవి. ఆకాశము నుండి ఒకే రసమగు జలము భూమిపై పడి అనేక విధ భూసంశ్లేషము వలన వేరువేరుగా ఉండునట్లు ఒక ప్రధానము వలన కలిగిన మూడు లోకములు ఏక స్వభావముగ ఉండలేదు. దేవతలయందు సద్గుణము అధికము. రజస్తమో గుణములు లేకుండుట వలన వారు మిక్కిలి సుఖపడుదురు. మనుష్యుల యందు రజోగుణము అధికము సత్వ తమో గుణములు తక్కువగా ఉండుట వలన వారు మిక్కిలి దుఃఖ వంతులు. పశు పక్ష్యములందు తమో గుణము అధికము. సత్వ రజో గుణములు తక్కువగా నుండుట వలన అవి మిక్కిలి అజ్ఞానము తో ఉండును .వ్యక్త అవ్యక్త పురుష విజ్ఞానము వలన మోక్షము లభించునని చెప్పబడినది. అందు వ్యక్తావ్యక్తములన్న రూపములు వివరింప బడినవి. పురుషుడు అవ్యక్తము వలె సూక్ష్మమైన వాడు కావున అతడున్నాడని చెప్పవచ్చును. పాన్పు, తలగడలు, పరుపు మొదలగు వాని సంఘాతము. అది అచేతనమగుట పరుల ప్రయోజనమునకే కాని స్వార్దమునకు కాదు. అట్లే మహదాది సంఘాతముకూడ పురుషుని కొరకు కాని స్వార్దమునకు కాదు. పాన్పుకు కాని పరుపులు మొదలగు వానికి కాని వేరొక పని లేకపోవుట వలన, పాన్పు నందు పరుండెడు పురుషుడొకడు కలడని పాన్పును చూచినంతే తోచును. పాంచ భౌతికమైన ఈ శరీరము పరుల కొరకే కాని స్వార్దము నకు కాదు కావున పురుషుడు కలడు. ఈ శరీరము అతనికి భోగ్యమై మహదాది సంఘాత రూపమున పుట్టినది. గుణత్రయము,

వివేకము లేకపోవుట, భోగ్యములు మొదలగు ధర్మములకు వేరగుట వలనను, వేగముగా పరుగెత్తు గుర్రములచే పూన్చ బడిన రధమును సారధిచే అధిష్ఠింపబడి నడచునట్లు పురుషాధిష్ఠమై శరీరము ప్రవర్తించు చుండుట వలనను, మహదాది లింగమునకు భోక్త లేకపోవుట వలన, షడ్రసోపేతమగు అన్నమునకువలె, భోగ్యమగు శరీరమునకు భోక్త కావలసి వచ్చుట వలనను, పండితుడైనా, పామరుడైనా, ప్రతి పురుషుడును తన కైవల్యమునకు ప్రవృత్తి కలిగి యుండుట వలనను, శరీరమునకు వ్యతిరేకముగా ఆత్మ కలదు.

ఆత్మ ఒక్కటే ఐనచో ఒకడు పుట్టినపుడు అందరును పుట్టవలసి వచ్చును. ఒకడు మరణించినచో అందరును చావవలసి వచ్చును. ఒకడు అంగవికలుడైన అందరికి అంగ వైకల్యము సిద్ధించును. ఒకరు ముక్తి పొందిన అందరూ ముక్తి పొందుదురు. అట్లు కాకుండుట వలన పురుషులు చాలా మంది ఉందురు. కొందరు ధర్మము నందును, కొందరు అధర్మము నందును, కొందరు వైరాగ్యము నందును, కొందరు జ్ఞానము నందును ప్రవర్తించుచున్నారు. ఈ విధముగా యుగ ప్రవృత్తి వలన కూడా బహు పురుషులుండుట ఒప్పుకొనవలెను. జన్మ అందరకు సామాన్యమైనను ఒకడు సాత్వికుడై సుఖపడుచున్నాడు. వేరొకడు రాజసుడై దుఃఖించుచున్నాడు. ఇంకొకడు తామసుడై మూర్ఖుడు అగుచున్నాడు. పురుషునకు నిర్గుణత్వము, వివేకిత్వము, భోక్తత్వము మొదలగు గుణములు యొక్క విపర్యయము వలన, సత్వరజస్తమో గుణములు కర్తృభూతములగుచుండ పురుషులకు సాక్షిత్వము సిద్ధించెను. గుణములు ఏకత్వ భూతములై ప్రవర్తించుచున్నవి. కాని సాక్షికి ప్రవృత్తి నివృత్తి లేదు. పురుషునకు కేవలత్వము మాధ్యస్థము ద్రష్టృత్వము అకర్తృత్వము కూడ సిద్ధించెను. గ్రామస్తులు కర్షణాది ప్రయోజనములందు ప్రవృత్తులగుచుండ ఒక సన్యాసి వారికి అన్యుడు, మధ్యస్థుడు, సాక్షియునై ఉండునట్లు పురుషుడు గుణములు ప్రవర్తించుచుండ, తాను ప్రవర్తింపడు కావున పురుషుడు ద్రష్ట, కర్తనై యున్నాడు. సత్వరజస్తమో గుణములు కర్మ కర్తృ భావమున ప్రవర్తించుచున్నవి కాని పురుషుడు అట్లు ప్రవర్తించుటలేదు. పురుషుడు కర్త కాని, అకర్త కాని కాడు. పురుషుడు చేతనమును కలుగుచేయువాడు కావున మహదాదిలింగము చల్లని పదార్ధముతో కూడినచో కుండ చల్లగను, వేడి పదార్ధములతో కూడినచో వేడిగను ఉండునట్లు పురుష సంయోగము వలన చేతనము కలదానివలెనుండును. కావున గుణములు అధ్యవసాయమును చేయుచున్నవి కాని పురుషుడు చేయలేదు. లోకమునందు వాడు చేయుచున్నాడు వీడు నడచుచున్నాడు అని పురుషుడు వ్యవహరింప బడుచున్నను గుణములకు కర్తృత్వము కలిగియుండ ఉదాసీనుడయ్యు పురుషుడు తాను కర్తవలె తోచును. కాని కర్త కాడు. దొంగ కానివాడు దొంగలతో కలసి త్రోవ పోవుచూ రాజభటులచే పట్టుబడి తాను కూడ దొంగ అని తోచబడును. అట్లే పురుషుడు మూడు గుణములతో కూడుకొని కర్త కాకున్నను కర్తృతో కలసి యుండుట వలన కర్త అగుచున్నాడు. మోక్షము పొందుటకు కారణమగు వ్యక్తము, అవ్యక్తము అను పురుష విభాగము మీకు తెలిపితిని. దీనిని అనుసరిస్తూ మీరు సంసార సాగరమును దాటెదరు అని కపిలమహర్షి వారికి సాంఖ్యయోగము నుపదేశించి ఆ మను కుమారులచే పూజితుడై యధేచ్ఛగా పోయెను.

ఒకనాడు మహేశ్వరుడు అగస్త్యుడు మొదలగు మునులతో కూడి కైలాసమున ఉమాదేవితో కొలువుండి మనుకులజులను రప్పించి వారి వంశమున పుట్టినవారికి విశ్వంభరుని శాపం కలియుగమున తటస్థించు కావున తిలవృత్తికి ఉపాయం ఆలోచించి, విశ్వకర్మను రప్పించి తన జటాజూటమునకు తిలరసం కావాలని కోరెను. విశ్వకర్మ భూమండలమును గానుగ రోలుగా, మేరు పర్వతమును రోకలిగా, హిమాలయమును బూజుగా, మహేశ్వరుని వాహనమగు వృషభమును వాహనంగాను, వేదాలను పలుపులుగా, మద్దర్శినిని మునుకోలుగా, సూర్యుని భ్రమణకర్తగా, చేసి తిలలను గానుగఆడించి, ఆతైలమును శివునకు సమర్పించెను. పరాత్పరుడు, భక్తివత్సలుడునగు శంకరుడు మను కుమారులకు ఆ యంత్రమును చూపి, ఈ విధముగా మీవారు కలియుగమున తిలలనుండి తైలమును తీసి జీవింపగలరని ఉపాయము చూపి వారిని గౌరవించి భూలోకానికి పంపించెను. నాటి నుండి నూనె గానుగలు తిరుగు చున్నవి. మనువీరులు చంద్రశేఖర దయారసపాత్రులై పరశురామునిచే ఇవ్వబడిన భూలోకరాజ్యమును ఏకచ్ఛత్రాధి పత్యముగా నేలుచుండిరి.

## ధార్మికత - ధర్మప్రవర్తన.

శౌనికాది మునులు మహాత్మా! రాజుల ఆచారములను, ధర్మములను, ప్రవర్తనలను వివరించి చెప్పమని కోరగా సూతుడు ఇట్లనెను.

॥మునీంద్రులారా! నాకు తెలిసినంత వరకు రాజ ధర్మాలను వివరిస్తాను. నీతి శాస్త్ర విచక్షణులగు రాజులు రాజ్యపాలనకు తగి ఉంటారు. లేనిచో హాస్యాస్పదు లవుతారు. శబ్దార్ధజ్ఞానము, వ్యాకరణం తెలియక పోతే లోకమువలన తెలియక పోతుందా? న్యాయ తర్కాలు తెలియక పోయినంత మాత్రాన సహజ సిద్ధములగు పదార్ధముల జ్ఞానం లేకుండా పోతుందా? మీమాంస శాస్త్రము తెలియకపోతే వేదవిహితమైన సత్కర్మ విధులు తెలియకుండా పోతాయా? శరీరం నశించునది అన్న వేదాంతదర్శనం వల్లకాని స్పష్టంకాదా? ఈ వ్యాకరణాది దర్శనములు తమ తమ మతాలను మాత్రమే తెలుపుచున్నవి. అవి ఆయా మతములను అనుసరించే వారిచే గౌరవింప బడుచున్నవి. కాని బుద్ధి కౌశలము కలగటం తప్ప నిత్య వ్యవహారానికి శాస్త్రాలవల్ల ప్రయోజనం వేరే ఏమి ఉండదు. నీతిశాస్త్రం లేకపోతే లోకవ్యవహారమే నడవదు. దేహధారులకు ఆహారం లేకపోతే శరీరం నిలువదు. అట్లే నీతిశాస్త్రం సమస్త కోరికలను సఫలము చేయును. అది సర్వసమ్మతం రాజులకు ముఖ్యంగా ఉపాధేయం నీతిలేని రాజులను శత్రువులు పధ్యం చేయని వారిని రోగాలు పీడించినట్లు బాధిస్తారు. రాజులకు ప్రజాపాలన, దుష్టజన నిగ్రహం ఈరెండు గొప్ప ధర్మములు అవి నీతి లేనిచో సమకూరవు. నీతి లేకపోవటమే రాజునకు భయకారణ మైనట్టిదని, శత్రు వృద్ధికరమైనట్టిదని, అదొక పెద్దఛిద్రమని నిశ్చయముగా చెప్పవచ్చును. నీతిని విడిచి స్వతంత్రుడై ప్రవర్తించే రాజు తాను దుఃఖముల పాలగుటయే కాక ప్రజలను కూడ కష్టాల పాలు చేస్తాడు. నీతి శాస్త్రము నందు చెప్పబడిన ధర్మమును విడిచి స్వతంత్రముగా ప్రవర్తించే రాజును సేవించుట కత్తిమొనను నాలుకతో నాకుటయే.

.రాజదండమునకు భయపడి ప్రజలు తమ వర్ణాశ్రమములను విడువరు తన ధర్మమునందు ఆసక్తిగలరాజు తేజోవంతుడు కాగలడు. రాజు తన బుద్ధిచేత, బలముచేత, పరాక్రమముచేత, నీతిచేత ప్రజలను పాలించుచు, అపరాధమునకు తగినట్లు శిక్షించిన పగవారు అతనిని కన్నెత్తి చూడలేరు.

సాత్విక, రాజస, తామస భేదములను బట్టి తపస్సు మూడు రకాలు. ఎవడు ఎట్టి తపస్సు చేస్తే వాడు అట్టి వాడవుతాడు. స్వధర్మ నిరతుడు, న్యాయ పరిపాలకుడు, దాత, దుర్వసన విముఖుడు, దేవ బ్రాహ్మణ సేవాతత్పరుడు అగు రాజు సాత్వికుడనవచ్చును. రాజ్యంతే నరకంధ్రువం అన్న సూక్తికి విరుద్ధముగా స్వర్గానికి వెళ్ళగలడు. రాజ్యాంతంలో ముక్తిని పొందగలడు. వీటికి విరుద్ధమైన గుణములు కలవాడు తామసుడు, తామసుడైన రాజు నరకానికే వెళ్తాడు. రాజసుండైన రాజు డాంభికుడు, లోభి, విషయసత్తుడు, మూర్ఖుడు, కలహప్రియుడునునై రాజ్యాంతంలో పశుజన్మ ఎత్తుతాడు. సాత్వికుడు దేవతాంశిలను తావసుడు రాక్షసాంశలను రాజసుడు మానవాంశలును కలిగి ఉంటాడు. కాబట్టి రాజు సత్వగుణ ప్రధానుడై ప్రవర్తించాలి. సకల లోకాలను రక్షించుటయందు సమర్థుడును, శూరుడును, దాంతుడును, పరాక్రమశాలియు, దుష్టజన నిగ్రహపరుడును అగు రాజు భువిలో పొగడబడును. రాజు తన రాజ్యాన్ని పాలించేకాలమే సత్యయుగం అవుతుంది. అతడు సామాన్యుడైతే త్రేతాయుగం అవుతుంది. రాజు స్వకృత్యము చూడడేని అది ద్వాపరయుగం అవుతుంది. కావున కాలమునకు రాజే కారణము కావున రాజు సత్కార్యాలు చేస్తూ దుష్టదండనము చేత ప్రజలను పాలిస్తూ ధర్మ రక్షణ చేయాలి.

## సప్తరాజ్యాంగములు.

రాజ్యానికి ఏడు అంగాలు ఉంటాయి. స్వామి, అమాత్యుడు, మిత్రుడు, కోశాగారం, రాష్ట్రం, దుర్గం, బలగం. రాజు శిరస్సు వంటి వాడు, అమాత్యుడు నేత్రం, మిత్రుడుశ్రోత్రం, ముఖము కోశం, మనస్సే బలగం, దుర్గ రాష్ట్రాలు హస్త పాదాల వంటివి. దైవం అనుకూలిస్తే చిన్నపని కూడ మంచి ఫలితాన్నిస్తుంది. సత్కర్మల వలన కోరిన కోరికలు నెరవేర గలవు. దుష్కర్మలవల్ల అరిష్టం కలుగుతుంది. కాబట్టి శాస్త్రాలనుండి మంచి చెడ్డలను బాగుగా విచారించి చెడ్డను విడచి మంచిని స్వీకరించాలి. మంచి చెడ్డల నెరగి పాలించేరాజు వృద్ధ సమ్మతుడై లోకముల యొక్క అభివృద్ధికి కారణ భూతుడు అవుతాడు. రాజు సక్రమంగా రాజ్యపాలన చేయకపోతే చుక్కాని లేని నావ సముద్రమున మునిగినట్లు ప్రజలు దుఃఖసముద్రములో మునిగి పోతారు. రాజు లేనిచో ప్రజలు తమ ధర్మములయందు నిష్ట చూపించరు. ధర్మ నిరతులైన ప్రజలు లేని రాజు కూడ శోభించలేడు. కాబట్టి ధర్మపరుడైన రాజు దైవాంశ సంభూతుడు. అధర్మ పరుడైన రాజు రాక్షస సంభూతుడు. లోకం అరాజకమైతే ప్రజలు అందు ఉండజాలరని మొదటనే సృష్టికర్త అష్ట దిక్పాలుర యందలి మంచి గుణాలను ప్రోగుచేసి వాటితో లోకరక్షణార్థము రాజును సృష్టించాడు. ప్రజా రక్షణ యందు సమర్థుడగు రాజు ఇంద్రుని వలె రాణిస్తాడు. రాజే ప్రజలకు తల్లి, తండ్రి, గురువు, సోదరుడు, బాంధవుడు, కుబేరుడు, యముడు కూడ ఆయాగుణ ములచే కాగలడు. తనకున్న దుర్గుణాలను విడిచి పరులాడు నిందావాక్యాలను సహిస్తూ, దాన, మాన, సన్మానములచే, రాజు ప్రజలను స్వజనులవలె సంరక్షిస్తూ ఉండాలి. శమము, దమము, శౌర్యము, శస్త్రాస్త్రకౌశలము కలిగి శత్రు సంహారకుడిగా ఉండాలి. నీతి శాస్త్రాను వర్తి, బుద్ధిమంతుడు, నీచజన సాంగత్య విముఖుడు, దూరదర్శి, పెద్దల మార్గాన నడచేవాడు, అయినరాజు దైవాంశ సంభవుడు అనబడును. లేకపోతే రాక్షసాంశ సంభవుడై నరకానికి పోతాడు.

మంత్రులు కూడ రాజునకు చెప్పిన సద్గుణములే తాము కలిగియుండి రాజుకు సహాయులై ఉండాలి. వినయ సంపన్నుడు గా ఉన్న రాజు పుత్రులను, మంత్రులను, ప్రజలను వినయవంతులను గావించును. వినయము నీతికి కారణము. శాస్త్రజ్ఞానము వలన వినయము అలవడును. వినయము ఇంద్రియ జయానికి కారణము అవుతుంది. ఇంద్రియాలను జయించినవాడు శాస్త్ర ధర్మాలను తెలుసు కోవటానికి సమర్దుడు అవుతాడు. కాబట్టి రాజు ఇంద్రియ నిగ్రహ శీలుడై ఉండాలి. విషయవాంఛ లనెడి అరణ్యములో సంచరించే మత్తగజాల వంటివి ఇంద్రియాలు. వాటిని జ్ఞానమనెడి అంకుశంతో మెల్లగా స్వాదీనంలోకి తెచ్చుకోవాలి. విషయ వాంఛల ప్రలోభంవల్ల మనస్సు ఇంద్రియాలను ఉద్రేకపరుస్తూ ఉంటుంది. కాబట్టి వాటిని ప్రయత్నంతో నిగ్రహించుకోవాలి. ఇంద్రియాలను జయించిన రాజు సకల శత్రువులను జయించినట్లే. అట్లు కాక తన మనస్సునే నిగ్రహించలేని రాజు చతుస్సముద్ర ముద్రితమైన భూమండలాన్ని ఎట్లు శాసించగలడు?

జూదం, స్త్రీ, మద్యం అను మూడును యుక్తి యుక్తముగా సేవింపబడితే ధనాన్ని, పుత్రులను, బుద్ధిబలాన్ని కలిగిస్తాయి. అట్లా కాకపోతే అనేకమైన అనర్థాలను కలిగిస్తుంది.

న్యాయద్యూతం పాడు చేస్తుంది. కపటద్యూతం ధనాన్ని ఇస్తుంది. పరాంగన పాడుచేస్తుంది. నిజకాంత వంశవృద్ధి కరులైన పుత్రులనిస్తుంది. అతిపానం మతిని నాశనం చేస్తుంది. మితపానం బుద్ధి విశాలతను, ధైర్యస్థైర్యాలను, మనోనిశ్చయాన్ని కలిగిస్తుంది.

॥కామ క్రోధాలు బహు ప్రమాదకరాలు. వాటిని రాజు యధోచితంగా స్వీకరించాలి. ప్రజాపాలనలో కామమును, శత్రు సంహార ములో క్రోధాన్ని వినియోగించాలి. సేవా రక్షణలో లోభాన్ని పాటించవచ్చు. రాజు ఎన్నడును పరస్త్రీ సాంగత్యంలో కామమును నిజ జనులను దండించటంలో క్రోధాన్ని పరధనమందు లోభాన్ని ప్రదర్శించరాదు. పరస్త్రీ సంతతి వలన కుటుంబీకులు పరధనం వల్ల ధనికుడు స్వజనులను శిక్షించుట వలన శూరుడు కాలేడు. న్యాయపాలన చేయలేని రాజును, తపస్వి కాని బ్రాహ్మణుని, దాతకాని ధనికుని దైవమే నశింపచేస్తాడు. ఆధిపత్యము, దాతృత్వము, ధనికత్వము అనునవి తపస్సుకు ఫలితాలు. అడుగుకొనుట, కొలుచుట, లేమి అను ఈ మూడు పాప ఫలాలు కాబట్టి రాజు శాస్త్ర పరిశీలన చేస్తూ మనస్సును నియమించుకొని యధోచ్ఛితమైన పనులను ఇహ పర సుఖములకై చేస్తూ ఉండాలి.

రాజవృత్తి ఎనిమిది విధాలని చెప్పవచ్చు. అవి దుష్టులను శిక్షించుట, ప్రజలను పాలించుట, రాజసూయాది యాగాలు చేయుట, న్యాయ మార్గమున కోశాగారమును అభివృద్ధి చేయుట, పన్నులను సేకరించుట, బలగాలను పెంచుట, శత్రు సంహారము ను చేయుట, భూములను అర్జించుట, సైనిక బలగాలను పెంచుకోకుండా, ఇతరరాజుల నుండి కప్పములను పుచ్చుకోకుండ, ప్రజలను సరిగా పాలించకుండా, మత్తులై ఉండే రాజులు నపుంసకులని చెప్పవచ్చును. నట, విట, గాయక, గణికాదులైన పామరజనాలతో నిత్యము విషయ సక్తుడై రాజు నింద్యుడై శత్రుముఖాన పడతాడు. బుద్ధిమంతులను ద్వేషిస్తూ, వంచకులను మన్నిస్తూ తన దుర్గమును కాపాడుకోలేని రాజు చెడిపోతాడు. రాజైనవాడు తనను ఎవ్వరు మెచ్చుకొంటున్నారో తన నడవడికను ఎవరు నిందిస్తున్నారో, తన మంత్రుల ప్రవర్తన ఎట్లా ఉన్నదో, తనపై ఎవరికి ప్రీతి ఉన్నదో, ఎవరికి అప్రీతి ఉన్నదో గూఢచారుల వలన ఎప్పటికప్పుడు తెలుసుకొని తనకు గల దుర్గుణములను విడిచిపెట్టాలి. ప్రజలు తనను నిందిస్తున్నారని వారిపై అసూయ పడరాదు. రాజు జాగ్రతతో ప్రజలను పాలించుట మేలు. యవ్వనం, జీవితం, మనస్సు, నీడ, శిరి, అధికారం ఈఆరు మిక్కిలి చంచలములైనవి. ఇది ఎరిగి రాజు ధర్మపరుడై ఉండాలి. వేట,జూదం,పానం రాజులు విడువతగినవి. వీనివల్ల క్రమంగా పాండురాజుకు, నలచక్రవర్తికి, యాదవులకు వినాశంకలిగినది.

॥కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు అరిషడ్వర్గము. ముందుగా వీటిని రాజు ప్రయత్నంతో గెలవాలి. అట్లు జయించిన రాజు సుఖపడతాడు. సత్పురుషులు మెచ్చే ధర్మార్థాలను వృద్ధిచేస్తూ గురువులను సేవించాలి. గురుసేవ వలన శాస్త్రజ్ఞానం కలుగు తుంది. విద్యా వినయ సంపన్నుడైన రాజు సజ్జన సమ్మతుడై కీర్తి ప్రతిష్టలు పొందుతాడు.

॥తన సుఖం కోసం రాజు దీనజనులను పీడించకూడదు. పీడించబడిన దీనుడు తనచావుకు సిద్దపడి రాజును చంపుతాడు. రాజు నిరంతరం ప్రియమైన మాటలతో ప్రజలను ఆనందిప జేస్తూ ఉండాలి. పరుష వచనములాడి, తర్వాత తాను ఎంత ధన మిచ్చినా ప్రజలు కోపోద్రేకులవుతారు. బుద్ధిమంతుడైన తనకెంత కష్టం వచ్చినాసరే ప్రజలకు హృదయశల్యము వలె బాధ కలిగించే పరుష వాక్కులు పలుకకూడదు. శత్రువులయెడ, మిత్రులయెడ ప్రియవచనాలే పలుకుతుండాలి. ముల్లోకాలలో దయ, మైత్రి, దానము, ప్రియ వాక్యములను మించిన వశీకరణ మంత్రము వేరొకటి లేదు.॥ అని సూతుడు రాజ ధర్మాలను ఉపదేశించెను. వీని నవలంబించి మనువీరులు న్యాయముగా పాలించుచుండిరి.

## సాధారణ మానవ జీవన ధర్మాలు.

శౌనికాది మునులు లోకోపకార ప్రజా ధర్మములను చెప్పమని వేడుకొనగా సూతుడు సర్వజన సాధారణ ధర్మములను ఇట్లు విన్నవించెను.

లోకంలో అందరూ తమకు సుఖం లభించాలని దుఃఖాలు కష్టాలు కలుగకుండా ఉండాలని కోరుకుంటారు. అందుకు ప్రయత్నిస్తుంటారు. అట్టి సుఖము ధర్మం వల్ల కల్గుతుంది. కాబట్టి మనుజుడు ధర్మపరుడై మెలగాలి. ధర్మ, అర్థ, కామములను త్రివర్ణాలకు సంఘర్షణ లేకుండా ప్రయత్నాలు చేస్తుండాలి. ఈ మూడింటికి భంగము లేకుండా సమస్త ధర్మాలను ప్రతి అడుగులోను పాటిస్తూ ఉండాలి.

ప్రతిరోజు మాలిన్య నిర్మూలనకై స్నానాలు వేకువనే చేయాలి. తన వర్ణమునకు తగిన ఉపాసనలు నిర్వర్తించాలి. కుటుంబ రక్షణకై గొడుగు చెప్పలు ధరించాలి. ముందు చూపుతో వ్యాయామం చేస్తూ ఉండాలి. త్రికరణ శుద్ధిగా మనసా వాచా కర్మణా దొంగతనము వంటి పదిరకాల పాపకర్మలను విడిచిపెట్టాలి. వృత్తిలేని వారికి రోగపీడితులకు శోకార్తులకు శక్తి కొలది సాయం చేస్తూ ఉండాలి. చీమలు, పురుగులు వంటి క్షుద్రజంతువులను కూడ తన లాగానే చూడాలి. తనకు కీడు చేయు శత్రువు నందు కూడా ఉపకార పరుడై ఉండాలి. తనకు సంపదలు వస్తే పొంగిపోకుండా, కష్టాలు వస్తే ఏడవకుండా ఒకే విధంగా ఉండాలి. ప్రసన్నమైన ముఖంతో, సత్వభావంతో, దయారసముతో కూడిన మనస్సుతో, చిరునవ్వు లొలికిస్తూ యుక్తి, యుక్తముగా, మితంగా, హితంగా సంభాషిస్తూ ఉండాలి. తన ఒక్కని సుఖాన్నే కోరుకుంటూ, నమ్మరాని వారిని నమ్ముతూ, మాట మాటకి సందేహించరాదు. అవతలి వాడు తన శత్రువో, తాను ఎవరికైనా శత్రువో తెలుసుకోకుండా అతనికి మనకు జరిగిన అవమానమును ప్రభువు దయ తప్పటంవంటి విషయాలు వెల్లడి చేయరాదు. ఎవడు ఎలా సంతోషిస్తాడో తెలుసుకొని మనం అలాగే వానిని సంతోష పెట్టటంలో తప్పలేదు. శాస్త్ర నిషిద్ధాలు, లోకదూషితాలు విషయ భోగముల వైపు ఇంద్రియాలను మళ్లించకూడదు. ఇంద్రియ లాలసత్వం పెరిగితే అది ప్రబలమై మనస్సును హరిస్తుంది. కాబట్టి అప్రమత్తుడై మానవుడు యధోచితంగా ఇంద్రియ భోగాలను అనుభవించాలి.

తల్లితో, చెల్లితో, కూతురుతో నైనాసరే ఒంటరి ప్రదేశంలో ఉండకూడదు. తన భార్యను సౌభాగ్యవతియని, ఇతర స్త్రీలను అక్క, అమ్మ, తల్లి, చెల్లి వంటి వరుసలు పెట్టి గౌరవముగా పిలుస్తూ ఉండాలి. స్త్రీలు ఇతరుల ఇళ్లల్లో క్షణంకూడా అనవసరంగా ఉండరాదు. ఇంటి పనులను విడచి తండ్రితోకాని, కొడుకుతోకాని, తమ్మునితోకాని మాట్లాడుతూ ఎక్కువకాలం ఉండటం మంచిది కాదు.

ఇంటి యజమాని తన శక్తి కొలది తన కుటుంబంలోని వారికి అన్న వస్త్రాదులు సమకూర్చుతూ, అలంకారాలచేత, ప్రియ వాక్యములచేత, తాను ఎక్కువకాలం వారిని విడిచిపెట్టి ఉండకుండా ఉండటంద్వారా భార్యాపుత్రులను పాలిస్తూఉండాలి. అనుమానం ఉన్న చెట్టును, నావను, వాహనాన్ని ఎక్కకూడదు. తరచుగా ముక్కును గోక్కుంటూ ఉండకూడదు. కాలివ్రేలితో నేలను గీయరాదు. రెండు చేతులతో తలను గోక్కొనరాదు. కరచరణాదులతో వికృతమైన చేష్టలు చేయకుండా పొందికగా ఉండాలి. శ్రమను పొందిన తర్వాత అలసట తీర్చుకోవాలి. మనోవాక్కాయ కర్మలను మానుకోవాలి. రాత్రిపూట చెట్టుక్రింద పడుకోరాదు. శూన్యారణ్యాలు, శూన్య గృహము, శ్మశానాలకు పగటిపూట పోకూడదు. తరచుగా సూర్యునివంక చూడరాదు. నెత్తిమీద బరువులు పెట్టుకొని మోయకూడదు.

బుద్ధిమంతులకు సమస్తవిషయాలలో లోకమే పరమగురువు. వివేకి పెద్దల మార్గాన్నే నడుస్తాడు. రాజ, దేశ, కుల, జాతి ధర్మాలను నిందించరాదు. తాను సమర్థుడనని లోకాచారం అతిక్రమించకూడదు. చేయకూడని పనులు చేసి అబద్ధాలు పలికి వానిని సమర్థించుకోకూడదు. తన దుర్గుణాలను తనఎదుటే ఎవరు ఎత్తిచూపరు. కాబట్టి లోకజ్ఞానం వల్ల, శాస్త్రపరిచయం వల్ల, స్వానుభవం వల్ల మన లోపాలను మనం గుర్తెరిగి వాటిని విడిచి పెట్టాలి. ఇతరులు చాలా తప్పలు చేస్తున్నారని, తాను ఒకతప్ప చేస్తేఏమని మనిషి పాప కార్యాలను చేయరాదు. చిన్న చిన్న నీటిబిందువులతో ఎంతపెద్ద కుండైనా నిండుతుంది కదా?।
।నేను ఏంచేస్తే రేయింబవళ్లు నాకు సుఖం కల్గుతుంది?॥ అని ఎప్పడూ ఆలోచిస్తూ ఉండకూడదు. నేర్పరి అయినవాడు శ్రుతి, స్మృతి, పురాణాదులకు విపరీత తర్కంచేత, తత్పురుష మొదలగు సమాసముల చేత, హేతువాదులచేత కల్పించబడే స్వాభిమతార్థమును విడిచి, ప్రశంసావాదములను పరిహరించి, ప్రయత్నంలో వాటిసారాన్ని గ్రహించాలి. ధర్మ తత్వము సులభగ్రాహ్యంకాదు. కాబట్టి పెద్దలు ఆచరిస్తున్న కర్మలనే మనమూ ఆచరిస్తూ ఉండాలి. బుద్ధిమంతుడైన మనిషి, వనితను, బాలుని, సేవకుని, పాడిపశువును, ధనమును, విద్యాభ్యాసమును, సత్పురుషుల సేవను నిముషము కూడ ఉపేక్ష చేయకూడదు. రాజు, ధనికుడు, శ్రోత్రియుడు, వైద్యుడు, ఆచారము, దేశము ఇవి శాస్త్ర విరుద్ధముగా ఉన్నచోట ఒక్కరోజు కూడ నివసించుట మంచిదికాదు. అలాగే నపుంసకుడు, స్త్రీ, బాలుడు, కఠినుడు, మూర్ఖుడు, సాహసి వీరు ఎక్కడ అధికారంలో ఉంటారో అక్కడకూడ ఒక్కరోజు నివసించకూడదు. అట్లే వివేకము లేని రాజు, పక్షపాత బుద్ధిగల సభికులు, అసత్యవాదులైన సాక్షులు, సన్మార్గాన్ని విడిచిన పండితులు ఎక్కడ ఉంటారో అక్కడ కూడ నివసించకూడదు. అలాగే ఏక్కడైతే దుర్మార్గవర్తులు, స్త్రీల, నీచజనుల ప్రాబల్యం అధికంగా ఉంటుందో అటువంటి స్థలంలో కూడ ఎవరూ ధనం, గౌరవం, నివాసం, జీవనం కోరకూడదు.

ప్రతి మనిషి సావధాన చిత్తుడై నిత్యము రాజును, దేవాన్ని, గురువును, అగ్నిహోత్రుని, తపస్విని, ధర్మవృద్ధుని, జ్ఞానవృద్ధుని సేవిస్తూ ఉండాలి. తల్లి తండ్రులతో, గురువులతో, అధికారులతో, అక్క చెల్లెళ్లతో, పుత్రులతో, మిత్రులతో ఏమనిషి ఎనడూ కలహం పెట్టు కోకూడదు. వారికి మనస్సులోనైనా అపకారం చేయకూడదు. ఆప్తులతో వైరము, బలవంతులతో స్పర్ధ పనికిరావు. స్త్రీ, బాల, వృద్ధుల తోను, మూర్ఖులతోను వివాదం పనికిరాదు. రుచిగా నున్న వస్తువులను ఇతరులకు ఎవరికి పెట్టకుండా తినరాదు. తానొక్కడే కార్యా లోచన చేయకూడదు. ఒంటరిగా త్రోవ నడువరాదు. అందరూ నిద్రపోతున్నప్పడు ఒక్కడూ మెలుకువతో కూర్చుని ఉండకూడదు. అట్లే పరధర్మాన్ని భంగ పరచకూడదు. ఇతరుల ధర్మములను తాను అవలంబించకూడదు.

ఈ ప్రపంచంలో సంపద కావాలనుకొనేవాడు నిద్రను, నిరుత్సాహాన్ని, భయాన్ని, కోపాన్ని, అలసత్వాన్ని, రేపుచూద్దాంలే అనే ధోరణిని, విడిచి పెట్టాలి. ఎప్పడూ విటూనే ఉండకూడదు. విన్నదానిని శీఘ్రముగా తెలుసుకోవాలి. తెలుసుకోన్న దానిని బాగా ఆచరించాలి.

క్రయ విక్రయాల సమయంలో అత్యాసకు పోకూడదు. దైన్యం విడిచిపెట్టాలి. పనేమీలేకుడా, అనుమతి తీసుకోకుండా, ఇతరుల ఇండ్లకు పోరాదు. తన ఇంటి సంగతులు అడిగినాకూడా ఎవరికీ చెప్పకూడదు. కార్యసాధకంగా ఉండి, అల్పాక్షరాలలో అనల్పమైన అర్థాన్ని స్ఫురింపజేసే మాటలే మాట్లాడుతూ ఉండాలి. అని సూతుడు సాధారణ మానవ జీవన ధర్మాలను వివరించేను.

ఇట్టి మానవ ధర్మాలతో ప్రజలు, ఇంతకు ముందు చెప్పబడిన రాజధర్మాలతో మనురాజులు ఆచరణశీలురై విలసిల్లారు. ఈ మనుకుల తిలకులకు కృతయుగంలో రేణుకాసిద్ధుడు, ద్వాపరలో ఏకోరామ దేశికుడు కులగురువులైరి. కలియుగమున శ్రీపతి పండితుడుగురువు కాగలడు. వారు విశ్వంభరుని శాపాన్ని పొందికూడా చింతాదైన్యాలను పోగొట్టుకొని, కీర్తి ధర్మములు కలిగి ప్రవర్తింపగలరు. అని సూతుడు శౌనికాది మునులకు చెప్పెను.

## చతుర్థ అధ్యాయం సమాప్తం

# పంచమ అధ్యాయం

శౌనికాది మునులు సూతునితో ఇట్లనిరి ॥సూతమునీంద్రా! పరాశురుని అనుగ్రహమున మీరు భూత భవిష్య వర్తమాన కాలములు తెలుసుకొనగల్గిన విజ్ఞానసంపన్నులు విశ్వంభర శాపానికి కలియుగంలో గురైన మనువంశసంభవులు ఎట్లా ప్రవర్తించారు ఆవృత్తాంతము చెప్పమని కోరగా శూతమహర్షి శౌనికాది మునులతో ఇట్లనెను.

ద్వాపర యుగాంతంలో పురంజయుడను రాజు ధరణీపతిగా ఉండేవాడు. అతడు దృష్టుడు అతని మంత్రి అయిన సునకుడు రాజు దృష్టత్వాన్ని సహింపలేక రాజునుచంపి అతనికొడుకు ప్రద్యోతనుని రాజుగా అభిషిక్తుని గావించాడు. తరువాత అతని కుమారుడు విశాకుడు రాజైనాడు. అతని తర్వాత రాజకుడు రాజైనాడు. తర్వాత అతని కుమారుడు నందివర్ధనుడు రాజ్యానికి వచ్చాడు. వీరు అయిదుగురు క్రమంగా కలియుగంలో నూటముప్పైఎనిమిది సంవత్సరాలు రాజ్యపాలన చేస్తారు. ఆతర్వాత శిశునాగుడు, కాకపర్ణుడు మొదలగు పదహేనుమంది రాజులు మూడువందల అరవై సంవత్సరాలు రాజ్యపాలన చేస్తారు.

అప్పటికి కలి ప్రబలం కాగలదు. రాజులు రాజధర్మాన్ని విడిచి శూద్రప్రాయులై నేలను ఏలుతారు. వారిలో మహాశూరుడు, ధార్మికుడునైన మహాపద్ముడు భూమండలాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలగలడు. వారి వంశస్థులైన భరతుడు, వటకుడు మొదలగు రాజులు నూరేండ్లు భూమిని పాలిస్తారు. ఆతర్వాత నవనందులు రాజ్యానికి వస్తారు. వారి తర్వాత చంద్రగుప్తుడు రాజు అవుతాడు. అతని కుమారులైన హరిసారుడు మొదలగువారు నూటముప్పదేండ్లు భూమిని పాలిస్తారు. తర్వాత బృహద్రధుని చంపి అతని సేనాధిపతి శృంగుడు రాజు అవుతాడు. ఆతర్వాత అగ్నిమిత్రుడు మొదలగు వారు నూరేండ్లు పాలిస్తారు. వారి తర్వాత కణ్వులు రాజు లవుతారు. కణ్వుల మంత్రి వసుదేవుడు శృంగాదులను చంపి తానే రాజవుతాడు. ఆతర్వాత భూమిత్రుడు నారాయణుడు అని కణ్వభాంధవులు మూడువందల నలభై సంవత్సరాలు భూమిని పాలిస్తారు. వారి తర్వాత కణ్వవశం వాడైన సువర్మను చంపి, అతని భటులలో ఒకరైన ఆంధ్రదేశపు శూద్రుడొకడు శక్తిమంతుడై రాజ్యంచేస్తాడు. అతని తర్వాత వారి తమ్ముడు కృష్ణుడు కొంతకాలం రాజ్యం చేస్తాడు. అతని తర్వాత శతార్ణుడు, హరిష్టుడు మొదలగు వారు నాలుగువందల ఏభైఆరు సంవత్సరాలు భూమండలమును ఏలగలరు. తర్వాత ఏడుగురు గొల్లలు, పదకొండు మంది గర్ధభులు, పదహారుమంది మహాకంకులు రాజులు అవుతారు. ఎనిమిదిమంది యవన విదేశీయులు, పద్నాలుగుమంది తురుష్కులు, పదమూడుమంది సురంతులు, పదకొండుమంది మౌనులు అనేవారు వెయ్యి సంవత్సరాలు రాజులు అవుతారు.

తర్వాత కింకలా నగరం నుండి భూతనందుడు మొదలగువారు నూటఆరు సంవత్సరాలు భూమిని పాలిస్తారు. క్రమముగా అతని కులస్థులు పదమూడుమంది, బాహ్లికులు, పుష్పమైత్రుడు మొదలగు త్రిలింగ దేశాధిపతులు ఏడ్గురు కోసల దేశాధిపతులు కొంత కాలము రాజులు అవుతారు. వైధూర్య దేశాధిపతులైన నిషధరాజులు, మగధదేశీయులు ఆర్యవర్తదేశాన్ని పాలిస్తారు.

## కలియుగంలో

కలియుగములో కలిప్రభావమున బ్రాహ్మణులు కొలువుకు అంగీకరిస్తారు. శూద్రులు, మ్లేచ్ఛులు రాజులు అవుతారు. వర్ణ శ్రమ ధర్మాలు నశిస్తాయి. ప్రజలు తరచుగా స్త్రీ, శిశు, పశు, బ్రహ్మ హత్యలు చేస్తుంటారు. ఇక సాధారణ జనులు పరస్త్రీ, పరదానాల మీద ఆసక్తి కలవారు అవుతారు. బలవంతులు కారు. రజస్థమోగుణ ప్రధానులుగా ఉంటారు. అల్పాయుష్కులుగా ఉంటారు. సంసార హీనులుగా, కర్మబ్రష్టులుగా అవుతారు. రాజులైన మ్లేచ్ఛాదులు నిర్దయులై ప్రజలను పీడిస్తారు. ఆనీచరాజుల పాలనలో ప్రజలు దుర్భిక్ష భాధితులై క్రమంగా నశిస్తారు.

కలియుగంలో ధర్మం, దయ, సత్యం, ఆయువు, సదాచారము, శమము, దమము, ఓర్పు మొదలగు సద్గుణాలు మనుజులకు తేలికగా అలవడవు.

కలియుగమున ధన సంపాదనే పరమధర్మం. నోటికి వచ్చునట్లు ప్రేలుటయే పాండిత్యం. ధంభవేషమే సాధుత్వం. జన్నదము పూనుటయే బ్రాహ్మణత్వం. కుటిలత్వమే ప్రౌఢత్వం. నీచులను సేవించుటే పరమ పురుషార్ధం. పరాంగనాసక్తియే దైవభక్తి, జూదమే వినోదం, వేటయే వీరత్వం, మద్యపానమే జ్ఞానం, స్వధర్మ త్యాగమే యోగం, చోరత్వమే శూరత్వం. సాధుజనులను వేధించుటయే పరమభోధ అని ప్రజలు వెర్రివిలువలు నేర్చుకొంటారు. శృతి స్మృతి భోధితమైన మార్గాన్ని విడచి కొత్తదారులు త్రొక్కటయే ఆచార్యత్వంగా తలుస్తారు. నీచులు, నిర్ధయులు, చోరసమానులు అయిన రాజులచే బాధింపబడుతూ ప్రజలు తమ భార్యాబిడ్డలతో అడవులకు పోయి ఫలమూలాదులతో జీవిస్తారు. ప్రజాభంగము వలన రాజ్యం నశిస్తుంది. కరవు ప్రబలమై, సకల వర్షాలుపడక, పంటలుపండక కాల వైపరీత్యాలు తరచుగా వస్తాయి.

కలియుగంలో వేదవిహీతములైన కర్మలన్ని నశిస్తాయి. సమస్తం వర్ణాచారాలు చెడిపోతాయి. ధర్మాలన్ని పాషండకర్మలు అవుతాయి. రాజులు జలగలవలె పన్నులను పెంచి ప్రజలను దోచుకుంటారు. ప్రజలలో దొంగతనం, దురహంకారం, అసత్యం, ప్రాణహింస పెరిగి పోగలవు. అన్ని వర్ణాలు వర్ణసాంకర్యానికి గురికాగలవు. బంధుజనులు శత్రువులుగా ప్రవర్తిస్తారు.

## మనువంశజుల పటిమ

ఇటువంటి కలియుగంలో కూడా మనువంశ సంభవులయిన మానవోత్తములు మాత్రము ఎటువంటి దుర్గుణములకు లోను కాకుండా విశ్వంభరుని శాపోపహతులైకూడ మహేశ్వరుని యొక్క అనుగ్రహము వలన సదాచార సంపన్నులై విలసిల్లుతారు. దైవ బ్రాహ్మణ భక్తికలవారును, ధర్మమార్గమును అనుసరించువారును, సత్యమును పలుకుటయందు ఆసక్తికలవారును, శివపూజా ధురంధరులు అయినవారై, వర్ణాశ్రమధర్మాలను పాటిస్తూ, దైవచోదితమైన తిలవృత్తిని అవలంబించి వ్యసనపరులు కాకుండా అసత్య

వాక్యములు పలుకకుండా, దుర్జన సాంగత్యం చేయకుండా, పరుష వచనాలు పలుకనివార్రై, పరాంగనా విముఖులై, పరులను భాదించకుండా, ఇతరులను నిందించకుండా, ప్రాణిహింస చేయకుండా, పాపకార్యాలకు లోబడకుండా, శమదమాదులు కలిగి శాంత స్వరూపులై మనువంశజులు జీవించగలరు. మన్నన పొందగలరు.

సహస్ర ఋషిగోత్రోద్భవులయిన ఆ మనుకుల తిలకులు మునిశాపంవల్ల కలియుగమున కలిగిన తిలవృత్తి కారణంగా దేవతిలకులు అని ప్రసిద్ధి పొందుతారు. తమతమ గోత్రాల నామముల చివర ।నువ్వులు। అనే పదానికి సరళరూపమైన ।నూళ్ళ। అనేపదం కలిపి వాడుకొంటారు. తిలలను గానుగ ఆడే తెలుకుల వారనీ, నువ్వులను కడిగి గానుగ ఆడేవారు దేవగాండ్ల వారనీ, నువ్వులను కడుగకుండా గానుగ ఆడేవారు కసిగాండ్ల వారనీ గానుగ ఆడేవారు మడియుగాండ్ల వారనీ పిలవబడతారు. ముదల, మౌసల, శౌనక, అనే రాజర్షి గోత్రాలపేర్లు తద్భవ, తత్సమాది రూపాలలో క్రమముగా ముదునూళ్ళ, ముసునూళ్ళ, చేనూళ్ళ వంటి గ్రామ్య గోత్రనామాలు వాడుకలో ఉన్నాయి. ముద్గల - ముదునూళ్ళ, మౌసల - ముసునూళ్ళ, శౌనక - చేనూళ్ళ.

## మనువంశ గ్రామ్య గోత్రాలు - 390

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| | సంగనూళ్ళ. | సకలనూళ్ళ. | సంతనూళ్ళ. | సావిత్రినూళ్ళ. | గురునూళ్ళ. | ముదునూళ్ళ. |
| సగనూళ్ళ. | సమనూళ్ళ. | సదనూళ్ళ. | సంపనూళ్ళ. | శకలనూళ్ళ. | సనకనూళ్ళ. | సరినూళ్ళ. |
| సాకినూళ్ళ. | గుసునూళ్ళ. | గరనూళ్ళ. | సబనూళ్ళ. | సన్ననూళ్ళ. | గూనూళ్ళ. | సర్వనూళ్ళ. |
| గులనూళ్ళ. | సంకునూళ్ళ. | గుటనూళ్ళ. | గుంటనూళ్ళ. | గునకనూళ్ళ. | గుమ్మనూళ్ళ. | గుదదునూళ్ళ. |
| గంపనూళ్ళ. | గుండ్రనూళ్ళ. | గుశినూళ్ళ. | గాచినూళ్ళ. | గననూళ్ళ. | కంబనూళ్ళ. | గళనూళ్ళ. |
| గోననూళ్ళ. | గౌనూళ్ళ. | గరనూళ్ళ. | గళనూళ్ళ. | గురువునూళ్ళ. | గుణదనూళ్ళ. | గాజునూళ్ళ. |
| గిలకనూళ్ళ. | గోగునూళ్ళ. | మెగికనూళ్ళ. | గాగినూళ్ళ. | గందనూళ్ళ. | పాలుపునూళ్ళ. | విద్దెనూళ్ళ. |
| కంపనూళ్ళ. | పొంచునూళ్ళ. | తులసినూళ్ళ. | తిలకనూళ్ళ. | తాలునూళ్ళ. | తులకనూళ్ళ. | పెరటనూళ్ళ. |
| తప్పనూళ్ళ. | విరచినూళ్ళ. | పత్తినూళ్ళ. | సెనగనూళ్ళ. | వెట్టినూళ్ళ. | పెద్దనూళ్ళ. | వింజనూళ్ళ. |
| నురివినూళ్ళ. | తిమ్మనూళ్ళ. | విరునూళ్ళ. | పుటనూళ్ళ. | వినునూళ్ళ. | వరనూళ్ళ. | విగదినూళ్ళ. |
| విదపనూళ్ళ. | ఆమెనూళ్ళ. | వెదకినూళ్ళ. | వాడినూళ్ళ. | వసునూళ్ళ. | వడినూళ్ళ. | విటునూళ్ళ. |
| వెండినూళ్ళ. | వాజనూళ్ళ. | వెలదినూళ్ళ. | వస్తునూళ్ళ. | వెటునూళ్ళ. | వారునూళ్ళ. | మాణిక్యనూళ్ళ. |
| వెంగునూళ్ళ. | వేబనూళ్ళ. | మరదనూళ్ళ. | మనికనూళ్ళ. | ఇచ్చినూళ్ళ. | మదునూళ్ళ. | వినునూళ్ళ. |
| మొగనూళ్ళ. | వాసినూళ్ళ. | మరచినూళ్ళ. | మొలకనూళ్ళ. | వలసినూళ్ళ. | మాగనూళ్ళ. | మణికెనూళ్ళ. |
| మళయనూళ్ళ. | మాగునూళ్ళ. | మొరననూళ్ళ. | మదనూళ్ళ. | మిట్టనూళ్ళ. | ముదునూళ్ళ. | మిరిగునూళ్ళ. |
| మొనయనూళ్ళ. | మడుగునూళ్ళ. | మిరియనూళ్ళ. | ముతుకునూళ్ళ. | బాగనూళ్ళ. | ముత్తెనూళ్ళ. | ముదిరినూళ్ళ. |
| బందనూళ్ళ. | ముసునూళ్ళ. | బొంతినూళ్ళ. | మొలనూళ్ళ. | మాటునూళ్ళ. | వరకనూళ్ళ. | మోపునూళ్ళ. |
| వెలసినూళ్ళ. | మెరుపునూళ్ళ. | ముడుపునూళ్ళ. | మరదినూళ్ళ. | మెరపునూళ్ళ. | రెపనూళ్ళ. | రుదనూళ్ళ. |
| రాగినూళ్ళ. | గుజనూళ్ళ. | రంగనూళ్ళ. | కంబునూళ్ళ. | రులుదనూళ్ళ. | కంచునూళ్ళ. | కంతనూళ్ళ. |
| కర్మనూళ్ళ. | కొననూళ్ళ. | కోడినూళ్ళ. | కోతినూళ్ళ. | రుననూళ్ళ. | కొలనూళ్ళ. | కొత్తనూళ్ళ. |
| కొరనూళ్ళ. | కంజనూళ్ళ. | కొంగనూళ్ళ. | కల్వనూళ్ళ. | కటకనూళ్ళ. | కొప్పనూళ్ళ. | కలగునూళ్ళ. |
| కురుకునూళ్ళ. | కెలువనూళ్ళ. | కుప్పనూళ్ళ. | కుకునూళ్ళ. | కెంత్రునూళ్ళ. | కదినూళ్ళ. | కమ్మనూళ్ళ. |
| కెల్వనూళ్ళ. | కందనూళ్ళ. | కదుగునూళ్ళ. | కేగునూళ్ళ. | కదపనూళ్ళ. | తేటనూళ్ళ. | కంజనూళ్ళ. |
| కిదుగునూళ్ళ. | తెలనూళ్ళ. | తాళినూళ్ళ. | తుమునూళ్ళ. | కులనూళ్ళ. | తరునూళ్ళ. | తియ్యనూళ్ళ. |
| అరనూళ్ళ. | దిబ్బనూళ్ళ. | తారునూళ్ళ. | తుమ్మినూళ్ళ. | త్రిపురనూళ్ళ. | తడవనూళ్ళ. | అంపనూళ్ళ. |
| తీతనూళ్ళ. | అయితనూళ్ళ. | తెంకినూళ్ళ. | తమ్మినూళ్ళ. | ఆమనూళ్ళ. | అందనూళ్ళ. | తాగనూళ్ళ. |
| అందేనూళ్ళ. | అతినూళ్ళ. | అక్కునూళ్ళ. | అయినూళ్ళ. | అదినూళ్ళ. | అందెనూళ్ళ. | అడవనూళ్ళ. |
| చానూళ్ళ. | బయినూళ్ళ. | బదినూళ్ళ. | బరగనూళ్ళ. | చేనూళ్ళ. | బాదునూళ్ళ. | చిలమనూళ్ళ. |
| బోదనూళ్ళ. | బయిదనూళ్ళ. | చిక్కనూళ్ళ. | బులకనూళ్ళ. | బలుకనూళ్ళ. | చేలనూళ్ళ. | బసునూళ్ళ. |
| బన్ననూళ్ళ. | భృగునూళ్ళ. | దాళనూళ్ళ. | బలిమినూళ్ళ. | బోగినూళ్ళ. | బడనూళ్ళ. | యిందునూళ్ళ. |
| ఏయమ్మినూళ్ళ. | బద్రినూళ్ళ. | యిలమినూళ్ళ. | ఏకనూళ్ళ. | యదినూళ్ళ. | యనమనూళ్ళ. | విసుకనూళ్ళ. |
| యగజనూళ్ళ. | ఏపునూళ్ళ. | ఈగునూళ్ళ. | యిదునూళ్ళ. | యుడునూళ్ళ. | ఈశ్వరనూళ్ళ. | హరనూళ్ళ. |
| యిమ్మనూళ్ళ. | యరదనూళ్ళ. | యుగునూళ్ళ. | హంసనూళ్ళ. | అనుగునూళ్ళ. | యవతినూళ్ళ. | ఆదినూళ్ళ. |
| రేయునూళ్ళ. | బుకునూళ్ళ. | యిదినూళ్ళ. | రింపనూళ్ళ. | ప్రభనూళ్ళ. | క్షేమనూళ్ళ. | క్షవరనూళ్ళ. |
| బలసినూళ్ళ. | శోభనూళ్ళ. | శాంబనూళ్ళ. | శనగనూళ్ళ. | సిరినూళ్ళ. | రుజునూళ్ళ. | శివనూళ్ళ. |
| శీమనూళ్ళ. | శెలనూళ్ళ. | శక్తినూళ్ళ. | శిపనూళ్ళ. | సిద్దునూళ్ళ. | శూర్వనూళ్ళ. | శెలమనూళ్ళ. |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| జ్ఞానినూళ్ళ. | శుతినూళ్ళ. | శింపనూళ్ళ. | దగమనూళ్ళ. | దెనుగునూళ్ళ. | దేవనూళ్ళ. | దామనూళ్ళ. |
| దశనూళ్ళ. | దిశననూళ్ళ. | శెట్టినూళ్ళ. | దినుబనూళ్ళ. | దబ్రునూళ్ళ. | శిలమనూళ్ళ. | దంటనూళ్ళ. |
| దిరునూళ్ళ. | దిరుగునూళ్ళ. | దమకనూళ్ళ. | దినదనూళ్ళ. | గణనూళ్ళ. | హలనూళ్ళ. | నీలనూళ్ళ. |
| శృతినూళ్ళ. | నెలుగునూళ్ళ. | నేగునూళ్ళ. | నందనూళ్ళ. | నూగునూళ్ళ. | నిలవనూళ్ళ. | నృపునూళ్ళ. |
| నుసికనూళ్ళ. | మృదువనూళ్ళ. | నిగ్గునూళ్ళ. | నొంగునూళ్ళ. | నేకెనూళ్ళ. | నృజకనూళ్ళ. | నొప్పనూళ్ళ. |
| లక్షినూళ్ళ. | లోకనూళ్ళ. | నిన్నునూళ్ళ. | లలంకనూళ్ళ. | లోలనూళ్ళ. | యిరికినూళ్ళ. | లొంకనూళ్ళ. |
| వెంకలనూళ్ళ. | విరినూళ్ళ. | దేవనూళ్ళ. | వేగునూళ్ళ. | లింగనూళ్ళ. | లంపనూళ్ళ. | లంభనూళ్ళ. |
| శుభగనూళ్ళ. | లగునూళ్ళ. | లన్నునూళ్ళ. | ఇలనూళ్ళ. | వింపనూళ్ళ. | దమనూళ్ళ. | రధనూళ్ళ. |
| లనునూళ్ళ. | శవనూళ్ళ. | దంకనూళ్ళ. | లంతినూళ్ళ. | డ్రాబనూళ్ళ. | డొనకనూళ్ళ. | శననూళ్ళ. |
| దాబినూళ్ళ. | దిలకనూళ్ళ. | దువనూళ్ళ. | రావునూళ్ళ. | డింపులనూళ్ళ. | దైబనూళ్ళ. | రవ్వనూళ్ళ. |
| యెనికనూళ్ళ. | చిత్రనూళ్ళ. | ద్విలకనూళ్ళ. | నాగినూళ్ళ. | చెంగనూళ్ళ. | పురజనూళ్ళ. | చూచినూళ్ళ. |
| చెబనూళ్ళ. | చిక్కనూళ్ళ. | రతులనూళ్ళ. | చేనూళ్ళ. | చెట్టునూళ్ళ. | చెడినూళ్ళ. | చెదనూళ్ళ. |
| చెల్వనూళ్ళ. | రుచినూళ్ళ. | చెందనూళ్ళ. | చెంచినూళ్ళ. | చిలుకనూళ్ళ. | చంద్రనూళ్ళ. | చాగనూళ్ళ. |
| చీరసనూళ్ళ. | చెంగునూళ్ళ. | చాటునూళ్ళ. | చుక్కనూళ్ళ. | చితినూళ్ళ. | చొప్పనూళ్ళ. | అయబనూళ్ళ. |
| చెప్పనూళ్ళ. | అయిననూళ్ళ. | విప్పనూళ్ళ. | అయినూళ్ళ. | దిజనూళ్ళ. | యతినూళ్ళ. | యింకునూళ్ళ. |
| అయిపనూళ్ళ. | యాశునూళ్ళ. | జంబనూళ్ళ. | యమనూళ్ళ. | వృషలనూళ్ళ. | జంపనూళ్ళ. | ఈవునూళ్ళ. |
| ఋలకనూళ్ళ. | ఋదనూళ్ళ. | విజనూళ్ళ. | ఋగునూళ్ళ. | ఋమ్మనూళ్ళ. | ఋలమనూళ్ళ. | ఋంగనూళ్ళ. |
| జలబనూళ్ళ. | ఋమునూళ్ళ. | ఋంచనూళ్ళ. | ఋగునూళ్ళ. | ఋక్కనూళ్ళ. | ఋలనూళ్ళ. | ఋరగనూళ్ళ. |

మొదలగు వెయ్యి గోత్రములు కలవు.

## ఋషి గోత్రాలు - గ్రామ్యగోత్రాలు

| | | |
|---|---|---|
| ముదల | - | ముదునూళ్ళ. |
| మౌసల | - | ముసునూళ్ళ. |
| శౌనక | - | చేనూళ్ళ |
| సనకస | - | గుంజపాల |
| రుజనూళ్ళ | -. | సనకనూళ్ళ. |
| విశ్వామిత్ర | - | విసునూళ్ళ. |
| కౌశిక | - | మాండవల్లి |
| మందనూళ్ళ. | - | పులస్తి |
| పులకనూళ్ళ. | - | సనందన |
| నందనూళ్ళ. | - | భృగునూళ్ళ. |
| వశిష్ఠ | - | వసునూళ్ళ. |

ఇట్లా ఋషి సహస్ర గోత్రాలతో దేవతిలకుల తిలకులంతా సమావేశమైరి. కలియుగంలో విశ్వంభరుని శాపంవల్ల తామందరూ ఒక పద్ధతిలో మర్యాదలో ఉండాలని నిశ్చయించుకుంటారు. బెజవాడ తమకు ఉనికిపట్టు కాగలదని శ్రీమల్లిఖార్జునస్వామి తమ ఇష్టదైవమని శ్రీపతి పండితుడు తమ కులగురువని నిశ్చయించుకుంటారు. బెజవాడగా పిలువబడే విజయవాటికకు వారు వచ్చి శ్రీ శివాలయం ముఖమంటపంలో వారు గురుజనులను, బ్రాహ్మణులను యధోచితంగా పూజించి వివాహాది శుభకార్యములయందు చతుర్గోత్ర సంభవులకు అగ్రతాంబూలం ఇచ్చుటకు సమయం చేసికొనగలరు. శ్రీమల్లిఖార్జున స్వామికి ముఖమండపాదులను కట్టించి ఆదేవదేవునికి నిత్యోత్సవాలను, ధూపదీప నైవేద్యాలను అఖండముగా జరిపింపగలరు.

చినుకునకు ఒక చిన్న మెత్తుగా బంగారువాన కురిపింప చేసిన మాధవవర్మ, అనేరాజు, చిక్కభూపతి, రణరంగ భూవిభుడు, నాగభూపాలుడు మొదలైన రాజులు పూర్వము శ్రీమల్లిఖార్జునస్వామికి, కనకదుర్గకు భోగ రాగాదులను ఏర్పరిచారు. వారి తర్వాత వచ్చిన రాజులు వాటిని నిలిపివేశారు.

అందువల్ల మానవోత్తములైన మనుకులజులు అభిమానంతో ఐకమత్యముతో గానుగునకు ఐదేసిపలముల తైలముతీసిదానిని ప్రతి సోమవారము స్వామికి, అమ్మవారికి సమర్పిస్తూ, అఖండదీపారాధన, నిత్యనైవేద్యములు పూర్వంకంటే అధికంగా జరిపించ గలరు. అంతటితో తృప్తిచెందక వారు తిలకేశ్వరుడు పేర శివప్రతిష్ఠ చేయించి, మల్లిఖార్జున స్వామి దేవస్థానమునకు తిలకేశ్వరస్వామి దేవస్థానమునకు ధర్మకర్తృత్వమును గణపవరపు వారికిచ్చి ఆఇరువురు వేల్పులకు ఏలోటులేకుండా నిత్యోత్సవ, మాసోత్సవ, వత్సరోత్సవము లను అఖండంగా ఆచంద్రతారార్కంగా జరిపిస్తూ ఉండగలరు. ఈవిధంగా ఎడతెగని భక్తితో మనువంశ సంభవులు మహాదేవుని నిరంతరం ఆరాధించగలరు. కావున భక్తవ శంకరుడైన శంకరుడు అనురాగ హృదయుడై దినదిన ప్రవర్ధమానమైన సంపదలు ప్రసాదించగలడు.

మనువంశ ప్రవరులు నదీతీరములందు శివప్రతిష్ఠలు చేయుచూ, తోటలు వేయించుచూ, బ్రాహ్మణులకు అగ్రహారాలిస్తూ, బాటసారుల శ్రమను తీర్చుటకు త్రోవలలో చెరువులు తవ్విస్తూ, ధనముతో కూడిన బంగారు కుండలను నిక్షేపిస్తూ, ఎడారులలో మంచి నీటి నూతులు తీయింప గోరుతూ, కవీంద్రుల గ్రంధములకు కృతిపతులై కీర్తి పొందుతూ, బీదల పెండ్లిండ్లుచేస్తూ ఆచంద్రతారార్కంగా కీర్తి పొందగలరు. పరుషముగా మాట్లాడరు. బ్రాహ్మణ దైవ నిందలు చేయరు. దుష్టులతో స్నేహం చేయరు. మనసు భోగరాగమును తలపరు. ఈవిధంగా మనుప్రవరులు విలసిల్లగలరు.

## కులాచారములు - దినచర్య

1. దేవతిలకుల కులాచారములు చెప్పెదను వినండి. దేవతిలకుల సంభవుడైన జనుడు వేకువనే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకొని శిరస్నాన, గళస్నాన, కటిస్నాన, జంఘాస్నానములు నాల్గింటిలో ఏదోఒకస్నానం చేస్తాడు.
2. నుదుట విభూతిధరించి అష్టోత్తరశతంకాని, త్రిశతికాని, సహస్రంకాని సద్గురువుఉపదేశించిన మూలమంత్రాన్ని జపించాలి.
3. గంధాక్షతాది పూజాసామాగ్రిని సమకూర్చుకొని తన ప్రధాన వృషభమును చేరంజని నమస్తేజగదాధారా! శంకరాంకిమూపుర భవతో మత్కృతాం బాధాం క్షమస్వ వృషభోత్తమ! అనే మంత్రాన్ని పఠించి ఆవృషభమును షోడశోపచార విధులతో పూజించాలి. లేత పచ్చిక వంటి ఆహారాన్ని తృప్తిగా తినిపించాలి.
4. లోహనిర్మితముకాని చందనదారు నిర్మితముకాని అయిన ఉమామహేశ్వరుని ప్రతిమను ఆగమమునందు చెప్పబడిన రీతిగా అర్చించాలి. పవిత్రాన్నం దేవతానివేదనం చేయాలి.
5. తర్వాత తిలవృత్తిచేకాని, దాన్యాది వ్యాపారములచేకాని జీవనం గడపాలి.

## మనుకులంలో మహిళల ధర్మాలు

1. దేవతిలకుల గృహిణి వేకువజామున భర్తకన్నా ముందే నిద్రలేచి సర్వమంగళను మదిలో స్మరించి మహేశ్వర రూపంగా పతిని భావించుచూ అతనికి పాదాభివందనం చేయాలి.
2. తర్వాత దంతధావనాది కృత్యాలు నిర్వర్తించుకొని మంగళాలంకారములు ధరించాలి.
3. పరమ పవిత్రయై అంగణ లేపనాది ఇంటిపనులు ఓపికతో పూర్తిచేసుకొని భర్తకు పనిపాటులలో తోడ్పడాలి.
4. పతివ్రత శాస్త్రాలలో చెప్పబడిన సద్గుణాలు కలిగిఉండాలి.
5. మెల్లగా, మితంగా, మృదువుగా మాట్లాడాలి.

ఈ విధంగా సత్ప్రవర్తన కల వనితలు ఇహలోకమున ప్రతిష్ఠ పొంది అవసానమున ఉత్తమ లోకమును పొందును.

## దేవతిలకుల సంభవులలో కొన్ని కొన్ని గోత్రాల వారికి కొన్ని వృక్షాలు పవిత్రమైనట్టివి

1. పూర్వం రమణకుడు అనేముని కైలాస శిఖరాన బండారు చెట్టుక్రింద కూర్చుని ఆచెట్టు పువ్వులతో చంద్రశేఖరుని అర్చిస్తూ పదివేల సంవత్సరాలు తపస్సు చేసాడు. మహదేవుని వరప్రసాదమున సిద్ధుడై సిద్ధక్షేత్రాలు పర్యటిస్తూ కృష్ణానది తీరాన ఉన్న విజయ వాటికకు వచ్చాడు. అక్కడ తనపేరుమీద రమణక లింగాన్ని ప్రతిష్ఠ చేసి రమణక సముద్రమును తటాకమును తనయోగ బలంతో నిర్మించాడు. అందువల్ల తనవంశ సంభవులగు అడుసునూళ్ళ గోత్రంవారు బండారు చెట్టును నరకకూడదు.
2. జీవంతుడు అనే ముని సింధూరవృక్షం క్రింద తపస్సు చేసాడు. కాబట్టి తన వంశస్థులైన అరవకుల గోత్రంవారు ఆచెట్టును నరుకకూడదు.
3. విలసుడనే మునిగన్నేరు చెట్టుక్రింద తపస్సుచేసాడు. కాబట్టి తత్కులీనులగు నూరునూళ్ళ గోత్రంవారు ఆచెట్టును నరకకూడదు.
4. విశ్వామిత్రుడనే ముని అశ్వత్థవృక్షము క్రింద తపస్సు చేసాడు. కాబట్టి ఆవంశజులైన కట్నూరు గోత్రంవారు ఆచెట్టును నరకకూడదు.
5. శిష్టాంశుడనే ముని శాల్మలీసాలం క్రింద తపస్సు చేసాడు. కాబట్టి తత్కుల జనితులైన అమృతనూళ్ళ గోత్రంవారు ఆచెట్టును నరకకూడదు.
6. నారదముని సాలవృక్షము క్రింద నారాయణు నర్చించాడు. కాబట్టి తద్వంశజులైన కూరాళ్ల గోత్రంవారు ఆచెట్టును కొట్టరాదు.
7. వైగుడనేముని కరివీర వృక్షం క్రింద, మోదకుడు ఇంద్రాక్షి వృక్షము క్రింద, ఆర్కాంశుడు కొండరేల చెట్టుక్రింద, భరద్వాజుడు దేవదారు చెట్టుక్రింద, వికలుడు శింశుపా వృక్షంక్రింద, వ్యాసముని బదరీవృక్షంక్రింద, వరజుడు కురువక వృక్షంక్రింద, బార్హస్పత్యుడు తియ్యమామిడి చెట్టుక్రింద, మరుడు జమ్మి చెట్టుక్రింద, మైత్రావరుణుడు కామ్మక వృక్షంక్రింద, ఆత్రేయముని ఉసిరిక చెట్టుక్రింద, రాజీవాక్షుడు కేసరవృక్షం క్రింద, సనకుడు కరకవృక్షం క్రింద, సూలాహ్వయుడైన ముని శాఖమూలమున, విరూపాక్షుడు మన్మధవృక్షం క్రింద, తపస్సులు చేస్తూ ఆయా చెట్టు పువ్వులతో మహేశుని పూజిస్తూ ఈశ్వరుని అనుగ్రహం పొంది విజయవాటికకు వచ్చి అచట తమ పేర్లమీద శివలింగ ప్రతిష్ఠలు చేసి చెరువులు తవ్వించి ప్రసిద్ధికెక్కారు. కాబట్టి క్రమముగా ఆయా గోత్ర సంభవులైన రమనూళ్ళ గోత్రం వారు కరవీర వృక్షమును, ముదకనూళ్ళ గోత్రంవారు ఇంద్రాక్షి వృక్షమును, కలతెల్ల గోత్రంవారు కొండరెల్ల చెట్టును, మయినూళ్ళ గోత్రం వారు దేవదారు వృక్షమును, సనకనూళ్ళ గోత్రంవారు శింశుపావృక్షమును, వసూళ్ళ గోత్రంవారు బదరీవృక్షమును, శివనూళ్ళగోత్రంవారు కురవక వృక్షమును, పన్నూళ్ళగోత్రంవారు తియ్యమామిడి చెట్టును, మరుదనూళ్ళ గోత్రంవారు జమ్మిచెట్టును, కూరాళ్ళగోత్రంవారు శామ్మకవృక్షమును, నందనూళ్ళ గోత్రంవారు ఉసిరికచెట్టును, రాజనూళ్ళ గోత్రంవారు కేసరవృక్షమును, సనకనూళ్ళ గోత్రంవారు కరక చెట్టును, సుచినూళ్ళ గోత్రంవారు శాఖామూలంబును, విరునూళ్ళ గోత్రంవారు మన్మధవృక్షమును, కొట్టకూడదు.

అంతేకాక ఆయా వృక్షాలను ఆయా గోత్రాదులు తమ పుట్టినరోజున షోడశోపచారములతో పూజించి యథాశక్తిగా బ్రాహ్మణులకు అన్నదానం మొదలగునవి చేయాలి.

| వృక్షము | గోత్రము | ఋషి | వృక్షము | గోత్రము | ఋషి |
|---|---|---|---|---|---|
| బండారు | నడుసునూళ్ళ | రమణుకుడు | సింధువార | యరకుల | జీవకుడు |
| గన్నేరు | నూరునూళ్ళ | వేలసుడు | అశ్వత్థ | కట్లూరు | విశ్వామిత్రుడు |
| శాల్మలి | అమృతనూళ్ళ | శిష్టాంశుడు | సాల | గూరాళ్ళ | నారదుడు |
| కరవీరము | రమనూళ్ళ | వైగుడు | ఇంద్రాక్షి | ముదకనూళ్ళ | మేదికుడు |
| కొండరేల | కలతెల్ల | ఆర్కాంశుడు | దేవదారు | మైనూళ్ళ | భరద్వాజుడు |
| శింశుప | సనకనూళ్ళ | వికలుడు | బదరీ | వనూళ్ళ | వ్యాసుడు |
| కురవక | శివనూళ్ళ | వరజుడు | తియ్యమామిడి | పన్నూళ్ళ | బార్హస్పత్యుడు |
| జమ్మి | మరుదనూళ్ళ | మరుడు | కామ్యక | కూరాళ్ళ | మైత్రావరణుడు |
| ఉసిరిక | నందనూళ్ళ | ఆత్రేయ | కేసర | రాజనూళ్ళ | రాజీవుడు |
| కరక | సనకనూళ్ళ | జనకముని | శాఖ | సుచినూళ్ళ | సూలాహ్వయుడు |
| మన్మథ | విరునూళ్ళ | విరూపాక్షుడు | | | |

## మనుకుల ప్రవరుల గోత్రప్రవరలు
## ఋషిత్రయ విశిష్ఠంబులయి త్ర్యార్షేయ ప్రవరలు

| | ఋషి త్రయము | | | గోత్రనామాలు |
|---|---|---|---|---|
| 1. | కందన | ఆత్రేయ | కణ్వ | అడుసునూళ్ళ |
| 2. | మౌసల | మైత్రావరుణ | రమణక | ముసునూళ్ళ |
| 3. | సతనూళ్ళ | కౌండిన్య | మైత్రేయ | సతనూళ్ళ |
| 4. | కూరాళ్ళ | మరునిభ | కుముద | కూరాళ్ళ |
| 5. | అరవకుల | అంగీరస | గౌతమ | అరవకుల |
| 6. | అమృతనూళ్ళ | అభివాద | రూక్షాగ్ని | అమృతనూళ్ళ |
| 7. | ముదునూళ్ళ | భరద్వాజ | సావర్ణ | ముదునూళ్ళ |
| 8. | అరవనూళ్ళ | శ్రీవత్స | సురద | అరవనూళ్ళ |
| 9. | కూనూళ్ళ | కౌశిక | వైగసంవిద | కూనూళ్ళ |
| 10. | అనుమనూళ్ళ | అర్క | జీవంత | అనుమనూళ్ళ |
| 11. | ఇరవకుల | శైవల | విశ్వామిత్ర | ఇరవకుల |
| 12. | కుట్నూళ్ళ | క్రౌంచిక | మోదుక | కుట్నూళ్ళ |
| 13. | తిలకుల | పౌండ్రక | అగ్నిచైత్య | తిలకుల |
| 14. | పోగునూళ్ళ | పుండరీక | రాజవాక్ష | పోగునూళ్ళ |
| 15. | బందనూళ్ళ | శ్రీవత్స | వరజ | బందనూళ్ళ |
| 16. | జీవకుల | శార్ఙి | వెలస | జీవకుల |
| 17. | శివనూళ్ళ | శౌనక | ఆర్కాంశు | శివనూళ్ళ |
| 18. | కంతెర్ల | గౌతమ | బార్హస్పత్య | కంతెర్ల |
| 19. | శిరపాల | సుమంత్ర | భరద్వాజ | శిరపాల |
| 20. | వేబాల | సుముఖ | వెలస | వేబాల |
| 21. | ప్రాగునూళ్ళ | ప్రతిపక్ష | రుక్ష | ప్రాగునూళ్ళ |

| | ## ఋషి త్రయము | | | ## గోత్రనామాలు |
|---|---|---|---|---|
| 22. | ప్రతినూళ్ళ | భగీరథ | జాంభవ | ప్రతినూళ్ళ |
| 23. | గజనూళ్ళ | చంచల | సదానంద | గజనూళ్ళ |
| 24. | ఉత్తాల | వశ్య | వాస్తవ | ఉత్తాల |
| 25. | ఫాలాల | భవ్యసిల | విరూపాక్ష | ఫాలాల |
| 26. | గుదునూళ్ళ | గాంగేయ | విషదువ్వయ | గుదునూళ్ళ |
| 27. | వెదునూళ్ళ | వైశ్రవణ | ధనేశ్వర | వెదునూళ్ళ |
| 28. | యరవకుల | కౌంతేయ | ధృవ | యరవకుల |
| 29. | నిత్రాళ్ళ | సనక | సనంద | నిత్రాళ్ళ |
| 30. | జాబాల | విశ్వామిత్ర | వైద్యవ | జాబాల |
| 31. | మదనపాల | శండిల | శాండిల్య | మదనపాల |
| 32. | విచ్చుపాల | వత్సలవాల | ఖిల్య | విచ్చుపాల |
| 33. | మిధునపాల | మైత్రావరుణ | మాండవ్య | మిధునపాల |
| 34. | కనకపాల | కౌండిన్య | గౌతమ | కనకపాల |
| 35. | జనపాల | సనక | సనత్కుమార | జనపాల |
| 36. | త్రేతాయపాల | వాస్తేయ | కశ్యప | త్రేతాయపాల |

## ఋషి పంచకంబులు కలిగిన పంచార్షేయ ప్రవరలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | కానిన్య | కౌండిన్య | వసుభద్ర | మాండవ్య | కానిన్యగోత్రం |
| 2. | చెందనూళ్ళ | సాగర | వినశ | పాండ్య | చెందనూళ్ళగోత్రం |
| 3. | మందపాల | వశిష్ఠ | వాసుదేవ | రేభవాశిష్ఠ | మందపాలగోత్రం |

ఈవిధంగా ఋషిత్రయ విశిష్టంబులయి త్ర్యర్షేప్రవరులు ఋషి పంచకములు కలిగి పంచార్షేయ ప్రవరులును కలిగి మను వంశ సంభవులు వర్ధిల్లుచూ పూర్వం విశ్వంభరుడు పెట్టిన శాపమున వ్యవహార వృత్తిచే ప్రవర్తించుచూ శివభక్తి, గురుభక్తి కలవారై యుందురు. అని మనువంశ చరిత్రను సూతమహర్షి శౌనికాది మునులకు వివరించారు. తిలక్రయ విక్రయులై ఉండికూడా మనుకుల ప్రభువులు లోకప్రసిద్ధి పొంది క్షత్రియ ఉపవంశ్యులు అని పిలవబడిరి.

## మనువంశ గోత్ర గృహ నామములు

| | |
|---|---|
| ముసునూళ్ళ - | కుకునూరు, కుకునూరి, దేవగానుగల, దేవగండ్ల, దేవగాండ్ల, సిరిపల్లె, చింతకుర్తి, కోరు, భీముడు. |
| అరవకుల - | అడ్డా, అడ్డాల, అమృతసర్పి, గమిని, చిట్టాల, ఆత్మాల. |
| అరునూళ్ళ / నడునూళ్ళ - | పెండ్యాల, మునగాల, కాశిన, కట్రుబాస, నూడిది, వెన్నా, దుద్దెపు, కొదమూరి, చేబ్రోలు, వీరవిల్లి, పెడసనగంటు, మడికి, వీరమల్లు. |
| ముదునూళ్ళ - | రెడవెల్లి, యడవల్లి. |
| క్రొత్తనూళ్ళ - | దద్దిళ్ళ, తాళ్ళ, కోన, కాళపు, పెండలపు. |
| కూరాళ్ళ - | చొప్పకట్టు, పోతముపల్లె, గువ్వ, సింపూడి, ఘంటశాల, పిల్లలమర్రి, మాగంటి, గాదె. |
| అనుమనూళ్ళ - | పచ్చిపాల, ఘంటశాల, బూచి. |
| శనగనూళ్ళ - | నందమడుగు, మల్లు, కొండగుంటూరి, బెజవాడ. |
| కంతెర్ల - | ఇనగడప, వీరమల్లు. |
| మడుపునూళ్ళ - | గృధ్వ, జుజ్జూరి, మాడుగుల, నరహరిశెట్టి, పండా, ఎర్రమల్లు, ఒత్తుమల్లి, బంట, ఉయ్యూరి, సంకెన, వాసము. |
| కుమునూళ్ళ - | పిన్ననసాని, ఓహంసము, మన్నెపుగంటి, వీడుపుగంటి. |
| ఇరవకుల - | వెల్లంకి, కేతమశెట్టి, పాపా, బందల, బొందల, గుంపెన, గ్రుధ్ర. |
| కట్లూళ్ళ - | అడిగంటు, బాపట్ల, చమదభక్తుని, కాంజ, అమరశెట్టి. |
| ఆలకుల - | బాచ. |
| పొంగునూళ్ళ - | కోటు, మండపాక, కొండూరి, కొంటూరి, మందివెద్ది, మాదిపెద్ది, నందమడుగు, తుమ్మూరి. |
| ఇందునూళ్ళ - | వీరవెల్లి, మల్లూరి, మల్లబోని, కోండ్రు, కాండూరి. |
| ప్రావకుల - | కొండవరులు, కోడిశెల, గోపాలు, గొంపల్లి, త్రాళ్ళ. |
| శివనూళ్ళ - | సిరిపల్లె, బొందల, బత్తుల, నందిగం. |

| | | | |
|---|---|---|---|
| శిరిపాల - | యేలూరి, ఏలూరి. | తయపాల - | రాజవరపు, బూచి, కొలవీటి. |
| పొట్నూళ్ళ - | చట్రాతి. | పత్తిపాల - | జక్కా, మంకి. |
| అమృతనూళ్ళ - | శివ్వన. | కానిన్న - | గణపవరపు, కరటి, కొండ. |
| పన్నూళ్ళ - | చేమర్తి, దేవగానుగుల. | ఉత్తల - | మడిపల్లె, మాసము. |
| పాలర్ల - | కోటి. | నెరవకుల - | తుమ్మూరి. |
| గుడునూళ్ళ - | కస్మెట్టి, జగ్గవరపు, ముంజవరపు. | నిత్రాళ్ళ - | కాజ. |
| యనమనూళ్ళ - | తిమంది, కొండెపల్లె, కొంపెల్ల, తాళ్ళ, గుంపెన, చింత, గూటాల. | | |
| వెలదినూళ్ళ - | ఈమని, వాసము. | | |

బోల్డ్ చేసిన గోత్రములు వాడుకలోనున్నవి. ఇట్లు ఆయా గోత్రములయందు ఆమానవోత్తములు ప్రసిద్ధికెక్కిరి.

## శ్రీపతి పండితుల ధర్మోపదేశం.

వివిధ గోత్రాలవారు విజయవాడలోను, అంతర్గత గ్రామములందు నివసిస్తూ తమకు ఇష్టదైవమైన శ్రీమల్లిఖార్జునస్వామిని ఆరాధిస్తూ సదాచారపరులై ఉండిరి.

ఒకరోజున తమ కులగురువైన శ్రీపతి పండితులవారు వచ్చారు. ఆ మహాత్ముని వారు అర్ఘ్యపాద్యాదులతో పూజించారు. మను వంశజులంతా ఒకగొప్ప సభ జరిపి ఆసభలో ఆపండితోత్తమునికి అగ్రాసనమిచ్చి గౌరవించారు. వినయభక్తి వినమ్రులై తమ తమ స్థానాలలో కూర్చుని ధర్మాలను వినుటలో ఆసక్తి కలవారై యున్నవారికి శ్రీపతి పండితులవారు ధార్మిక ప్రభోధం చేసారు.

॥మానవోత్తములారా! ధర్మపరులైన స్వకుల ధర్మాచారాలను గూర్చి ఎక్కువగా చెప్పవలసిన పనిలేదు. సంప్రదాయాలను మరువ కుండా ధర్మాలను విడువకుండా సకల దేవస్వరూపుడైన మహేశ్వరుని భక్తితో కొలుస్తూ బ్రాహ్మణపూజ నిరంతరం చేస్తూ ఉండండి. ఇది మీకు పరమధర్మం. దాని వలన మీకు ఇహపర సుఖాలు అలవడునని ఉపదేశించారు.

ఆ సహస్రఋషి గోత్రోద్భవులు సంతసించి సంసారబంధం నుండి విముక్తిని కోరినవారై మోక్షధర్మం ఉపదేశింపుమని అడిగారు.

## ఆత్మానాత్మ విచారక్రమము.

మనుకుల సంభవుల చిత్తసుద్ధికి ఆనందించి శ్రీపతి పండితుడు ఇట్లనెను. ॥ఓముముక్షువులారా! మీరు పవిత్ర చరిత్ర కలవారు. అనేక జన్మల పుణ్యములవల్ల పాపకృత్యములు నశించినవారు. కావున మీకు మోక్షమునందు కోరిక కలిగినది. ఇది సామాన్యులకు లభింపదు. కావున మీకు ఈ పరమ రహస్యమును ఉపదేశించెదను శ్రద్ధగా వినుడు.

వర్ణాశ్రమ ధర్మాలను ఆచరించుట వలన పాపములు తొలగి శమదమాది సాధన సంపన్నులు, ఫలభోగ విముఖులు మోక్షము నందు కోరిక గల మీకు ఆత్మజ్ఞానమును ఉపదేశించెదను.

జ్ఞానము మోక్షమునకు ముఖ్య సాధనము. అగ్ని లేకున్న పాకము సిద్ధించనట్లు జ్ఞానము లేకున్న మోక్షము సిద్ధింపదు. అజ్ఞానము నకు కర్మ విరోధి కాదు. వెలుగు చీకటిని పోగొట్టునట్లు జ్ఞానము అజ్ఞానమును పోగొట్టును. మబ్బు విడిపోయినంతనే సూర్యుడు ప్రకాశించినట్లు అజ్ఞానం నశించిన వెంటనే ఆత్మ ప్రకాశించును. ఇండుగు పొడి మలినమైన నీటిని నిర్మలముగా చేయునట్లు జ్ఞానము జీవుని పరిశుద్ధునిగా చేసి తాను నశించును. రాగము, ద్వేషము మొదలగు ఆడంబరములు గల ఈ సంసారము కల వంటిది. తాను నడచుచున్నంత వరకు నిజమనిపించును. వేదాంత వాక్యములను వినుటచే జ్ఞానము కలిగి అసత్యము వంటిదగును. ముత్యపుచిప్ప ఇది అని తెలియనంతసేపు వెండివలె నుండును. బ్రహ్మము తెలియనంత వరకు సంసారము సత్యముగ తోచును. సత్య, జ్ఞాన ఆనందాత్మకము నిత్యము సర్వాంతర్యామి అగు బ్రహ్మము నందు దేవతలు, మనుష్యులు, పశుపక్ష్యాదులు, స్థావరములు మున్నగు భేధము బంగారమందు కంకణ కీయూరాదులవలె కల్పించబడినవి. మనస్సు మున్నగు ఇంద్రియాలకు ప్రవర్తకుడగు పరమేశ్వరుడు అజ్ఞానముచే కల్పించబడిన ఉపాధులయందు ప్రతిబింబితుడై ఆకాశమువలె విభిన్నుడువలె తోచును. మాయచే కల్పించబడిన దేహనాశము బ్రహ్మ ఆత్మ ఐక్యజ్ఞానము వలన కలుగును. అనేక విధముల ఉపాధి భేదము చేతనే ఆత్మయందు నామ రూప వర్ణాశ్రమాదులు స్వభావ మంధురమగు జలమునందు కారం, పులుపు, చేదు, వగరు మున్నగు ధర్మములవలె మాయచే ఆరోపించబడినవి. భూమి మున్నగు పంచభూతములచే నిర్మింపబడిన ఈశరీరము సుఖ, దుఃఖములను అనుభవించుటకు ఉనికిపట్టు.ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములు అను పంచ ప్రాణములు జ్ఞాన, కర్మ, అంతరింద్రియములు, బుద్ధి, శబ్ద, వాచ, నిశ్చయాత్మక అతఃకరణ వృత్తి అను వీనితో కూడి పంచభూతముల నుండి పుట్టిన శరీరము సుఖములకు దుఃఖములకు సాధనమైనది. ఉన్నదనికాని లేదనికాని చెప్పటకు వీలు పడని అవిద్య కారణ శరీరమందున శరీరత్రయము అను మూడు ఉపాధులకు సాక్షి అగు ఆత్మను తెలిసికొనదగును. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయములు అను పంచకోశములతోను, ప్రాణధర్మములగు ఆహార పిపాసలతోను, మనోధర్మములగు శోక మోహములతోను దేహ ధర్మములగు జరామరణములతోను కూడుకొనుటచే మిధ్యా ఆధారమును పొందిన పరిశుద్ధాత్మ నీల, పీత, వస్త్రాది యోగముచే ఏటికవలె దానిలో వినమగునట్లుండును. ఆత్మకు పంచశోకములతో మిధ్యా తాదాత్మము వలన కల్పితమైన శరీర త్రయము అను నూకతో కూడుకొన్న పరిశుద్ధమగు అంతరాత్మ అను బియ్యమును మననము అనియెడి దంచుటచే శరీరత్రయ తుషమువలన వేరుపరచి పొందాలి. భూతకార్యమగుటచే ఈస్థూలదేహము ఆత్మకాదు. స్థూలదేహ, అనాత్మ అనుమానంచే సూక్ష్మకారణ శరీరములు కూడ ఆత్మ కావు.

ఆత్మ ఎల్లప్పుడు అంతటా వ్యాపించి స్వయంప్రకాశమానమై యుండును. ఆత్మ నాడములగు నేత్రాది ఇంద్రియాలకు కన్పించదు. అద్దమందు ప్రతిబింబము వలె రాగాదులచే ఉపహతము కాని బుద్ధియందే వెలుగును. అంతట ప్రకాశింపదు. రాజు తన పురమున నుండి మంత్రులు వ్యవహరించుచుండ తాను సాక్షియై వారిని చూచుచున్నట్లు దృశ్యములు జడములునగు దేహ, ఇంద్రియ మనో బుద్ధులకు సాక్షి ఆత్మయని తెలిసికొనాలి. ఆకాశములో మబ్బులు గాలిచే పరుగిడుచున్నప్పుడు చంద్రుడు నడుచుచున్నట్లు తోచును. గురూపదేశము లేనివారికి ఇంద్రియములు ప్రవర్తించుచుండ ఆత్మయే ప్రవర్తించుచున్నట్లు కన్పించును. ఆత్మ జ్ఞాన స్వరూప మైనది. సూర్యకాంతిని ఆశ్రయించి జనులు వ్యవహరించునట్లు చైతన్యము నాశ్రయించి జడములగు దేహ, ఇంద్రియ, మనో, బుద్ధ్యాదులు తమతమ విషయములందు ప్రవర్తించును. పరిశుద్ధమగు ఆకాశమందు బాలురు నీలత్వమును ఆరోపించునట్లు దేహ, ఇంద్రియ, మనో, బుద్ధి ధర్మములను సత్వాది గుణములను కర్మ, ఇంద్రియ వ్యాపారములను సచ్చిదానంద స్వరూపము, నిర్మలమునగు పరమాత్మయందు అజ్ఞానులు జ్ఞానము లేకపోవుటచే ఆరోపిస్తారు.

నీటియందున్న కదలిక మున్నగు ధర్మములు నీటియందు ప్రతిఫలించిన చంద్రునియందు అజ్ఞానము వలన కన్పింపబడు నట్లు, మనోధర్మములగు కర్తృత్వాదులు ఆత్మయందు ఆరోపించబన్నవి. కోరిక, ద్వేషము, సుఖము, దుఃఖము జాగ్రత్స్వప్నాములు యందు బుద్ధిఉండును కాన కలుగును. సుషుప్తియందు బుద్ధిలేదు కావున రాగము, ద్వేషము ఉండవు కావున అవి బుద్ధి ధర్మములే కాని ఆత్మ ధర్మములు కావు.

సూర్యునికు కాంతి, నీటికి చల్లదనము, అగ్నికి వేడి స్వభావమైనట్లు సచ్చిదానంద నిత్యనిర్మలత్వము ఆత్మ స్వరూపములు ఆత్మ యొక్క సచ్చిద్భావము అనుబుద్ధి వత్తిలేని దీపము. అవివేకముచే ఆత్మ అహంకార వృత్తి ప్రవర్తించుచున్నది కాని ప్రత్యగాత్మలో ఏవికృతి లేదు. ఆత్మకు ఏవికారమును లేదు. బుద్ధికి భోధలేదు అయినను జీవుడు సాభాస అహంకారమును, సాభాస మనోవృత్తియును, తప్త ఆయఃపిడన్యాయమున ఒకటిగా తలచుచూ నేను కర్తను, జ్ఞాతను, దుష్టను అని భ్రాంతి పొందుచున్నాడు. చీకటిలో త్రాడును చూచి పాము అనుకొని త్రుళ్ళిపడునట్లు నేను జీవుడను అనుకొని తానుకూడ దుఃఖసముద్రములో మునుగును. వేదాంతశాస్త్ర అర్ధజ్ఞానము కలిగిన వెంటనే విచారణ చేతనను అఖండానందైక స్వరూపునిగా తెలిసికొనుచూ నేను జీవుడను కాను నేను పరమాత్మను అని తెలిసికొని భయము, దుఃఖము లేనివాడై సుఖించును.

దీపము కుండను ప్రకాశింప జేయునట్లు స్వప్రకాశమగు ఆత్మయే, మనస్సును, బుద్ధిని, అహంకారము ప్రకాశింపచేయును. కాని జడములగు వానిచే ప్రకాశింపబడదు. తనను ప్రకాశింపజేసుకొనుటకు దీపమునకు ఇతర దీపము అక్కరలేనట్లు ఆత్మభోధ స్వరూపమగుట వలన తనను తెలిసికొనుటకు జ్ఞానాంతర అపేక్ష లేదు.

॥అధాత ఆదేశోనేతినేతి॥ అను ఉజనిషత్ వాక్యముచే ॥తత్వమసి॥ అను వాక్యములోని సర్వజ్ఞత్వము, కించిత్‌జ్ఞత్వం మొదలగు ఉపాధులు ఆత్మ కావు అని తెలిసి నిరసించి ॥తత్వమసి, అహం బ్రహ్మాస్మి, అయమాత్మా బ్రహ్మేత ద్యోహం॥ అను వేదాంత వాక్యములచే అజవాల్లక్షణ వలన సిద్ధించిన బ్రహ్మాత్మైక్య జ్ఞానాన్ని పొందాలి. దేహము ఇంద్రియాలు అవిద్యా కల్పితమై కన్పించుట వలన నీటి బుడగవలె నశించును. కావున ఈదేహ, ఇంద్రియములకు విలక్షణమై సచ్చిదానందాత్మక బ్రహ్మమునేనయితిని. అనితెలుసుకొన్న పురుషుడు ధన్యుడు

నేను స్థూల, సూక్ష్మ, కారణ శరీరములకు విలక్షణుడ నగుట వలన నాకు జన్మ, జరా, కార్శ్య, లయాదులు లేవు. నేను ఇంద్రియాలతో సంబంధములేని వాడనగుటచే శబ్దాది విషయ భోగముల అనుభవము నాకు లేదు.

నాకు మనస్సు మొదలగు వాని సంబంధం లేదు కావున వాని ధర్మములగు రాగము, ద్వేషము, భయము, కామము, సంకల్పము మొదలగునవి నాకు లేవు. బుద్ధి లేనందున నేను నిర్గుణుడను. ఇంద్రియాదులు లేకపోవుటచే క్రియా రహితుడను. నాశము లేదు కావున నిత్యుడను. మనస్సు లేకపోవుటచే నిర్వికల్పుడను. అంతము లేదు కావున నిరంజనుడను. పదహారు కళలతో కూడిన లింగ దేహ శూన్యుడగుట వలన నిర్వికారుడను. అవయవములు లేనివాడగుట వలన నిరాకారుడను. సంబంధ శూన్యుడనగుట నిత్యముక్తుడను అవిద్య తత్కార్య విహీనుడను కావున నిర్మలుడను. ఇటువంటి నేను వెలుపల, లోపల ఆకాశమువలె వ్యాపించియుంటిని. కావున సర్వము నాయందే విశక్తమగుట ఇది ఎల్లనేనైయుంటిని. నాశనము లేని వాడను పూర్ణుడను, సర్వసముడను, పరిశుద్ధుడను, నిర్లిప్తుడను, మలారహితుడను కాన అబలుడను.

సత్యం, జ్ఞానం, అనంతంబ్రహ్మ అను వేద ప్రతిపాదిత సత్య, జ్ఞాన, ఆనందాత్మక బ్రహ్మము నేనైతిని అని చిరకాలము అభ్యసింప బడిన వాసన, చిరకాల సేవితమగు ఔషధము రోగముల నశింపజేయునట్లు అవిద్యాకృత విక్షేపములను పోగొట్టును. జన సంబంధం లేని ప్రదేశంలో కూర్చొని, కోరికలు లేనివాడై, ఇంద్రియాలను జయించినవాడై, ఆత్మను భావించుచుండాలి.

పరిశుద్ధ మనస్కుడైన పురుషుడు, పరిశుద్ధ బుద్ధిచే సమస్త దృశ్యజాతమును సమాధి కాలమునందు తనయందే లయము చేసి అధిష్ఠానమునకు వ్యతిరేకముగా ఆరోపింపబడునది ఉండదని నిశ్చయించి ఆకాలమున రెండవది లేదు కావున, ఆత్మనే భావిస్తూ, వినిర్మలాకాశంవలె ఉండాలి. పరమార్ధమును చూచుచుండుమని అవిద్య కల్పితమైన నామ రూపములను విడిచి పరిపూర్ణ జ్ఞానానంద స్వరూపుడై యుండును.

జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము అను మూడును అవిద్యాకర్తృకము కావున ఆత్మయందున్నట్లు తోచును కాని నిజముగా లేదు. ఆత్మ జ్ఞాన ఆనంద స్వరూపమగుట వలన స్వయముగా ప్రకాశించు చున్నది. మనస్సు అనే అగ్ని మధన దారువు నందు ధ్యానమనే మధనమును చేయగా పుట్టిన అగ్నిజ్వాలా రూపమైన అపరోక్ష జ్ఞానము అజ్ఞానమనే ఇంధనములను దహించును.

అరుణ కాంతిచే గాఢాంధకారము పోగా వెంటనే సూర్యుడు ఆవిర్భవించునట్లు జీవాత్మ పరమాత్మలకు ఏకత్వ జ్ఞానముచే అవిద్యాకల్పితమైన అంధకారము నశించిన వెంటనే పరమాత్మ తనకుతాను అవిర్భవించును. ఆత్మ పరిపూర్ణము, ఆనందరూపము

అగుట వలన, మనోవృత్తి సాక్షి అగుటచే, పొందబడి ఉన్నదైనను, అవిద్యావశమగుటచే కంటగతచామీ కరమువలె పొందబడనియట్లు త్రోచును, చీకటిలో నున్న మొరడును చూచి వీడు దొంగ భయపడినట్లు భ్రాంతిచే బ్రహ్మమందు జీవత్వము ఆరోపించబడుచున్నది. శాస్త్రోపదేశం వలన కలిగిన వివేకదృష్టిచేత తత్త్వం పదార్థ లక్ష్యమగు జీవుని సత్యస్వరూపం తెలియబడిన వెంటనే కల్పితమైన ఆజీవత్వం మళ్ళును. జీవాత్మ పరమాత్మలకు ఏకత్వానుభవం వలన కలిగిన జ్ఞానము వీడు మనుష్యుడు, నేను బ్రాహ్మణుడను, వీడు నాకొడుకు అను అజ్ఞానమును సూర్యోదయం దిక్భ్రమను పోగొట్టునట్లు నశింపజేయును.నేను, నాది అను ప్రతీతి నశించిన వెంటనే జ్ఞానవంతుడైన యోగి జ్ఞాన నేత్రముచే అందరకు కన్పించు ప్రపంచమును తనయందే అభేధముగా చూచును. కనబడుచున్న ప్రపంచమంతా ఆత్మకార్యమగుట ఆత్మయేకాన ఆత్మకన్న వేరగునదిలేదు. కుండ మొదలగునవి మట్టితో చేయబడుట వలన మట్టివేరుకాదుకదా! అవిద్యాకల్పితమైన దేహ, మనో, బుద్ధి మొదలగు ఉపాధులను సత్వాది గుణములను ఇవి నేను కానని విడచుటయే జీవన్ముక్తి. ఈ అవస్థను పొందినవాడు భ్రమరకీట న్యాయమున సచ్ఛిదానందాత్మకుడగును.

ఆత్మానుభవ సుఖముచే నివృత్తుడైన జీవన్ముక్తుడు ఇంద్రియ విషయ సుఖప్రీతి వాసనను విడిచి కుండలో నున్న దీపమువలె తనలో వెలుగుచుండును. శరీరము మొదలగు ఉపాధులయందు సాక్షియై, జీవన్ముక్తుడు తానున్నను, కుండ మొదలగు ఉపాధుల యందున్న ఆకాశమువలె, కృశించుట, లావగుట మొదలగు ధర్మములతో ఆసక్తుడై, తాను సర్వజ్ఞుడైనా, పామరునివలె నుండి విషయము లందు ఆశక్తిలేక, ప్రారబ్ధము క్షీణించు వరకు ప్రవర్తించుచుండును.

ఉపాధి భూతమగు దేహద్వయము ప్రారబ్ధ క్షయముచే నశింపక జీవన్ముక్తుడు అంతటా వ్యాపించు పరమాత్మయందు చెరువునందు కుండ అను ఉపాధిచే విడిచిన నీటిని, ఆకాశమునందు కుండ అను ఉపాధిచే విడిచిన ఆకాశమును, అగ్నియందు నిప్పకణము ప్రవేశించునట్లు ఐక్యమునొందును. బ్రహ్మ సాక్షాత్కారముకన్న వేరొక లాభమును, బ్రహ్మను భవానందముకన్న వేరొక సుఖమును పరమాత్మ పరోక్ష జ్ఞానముకన్న వేరొక జ్ఞానము లేదు.

దేనిని స్వస్వరూపముగా చూచిన వేరొకటి చూడదగినది లేదో దేనిలో ఐక్యము పొందిన జనన మరణములు ఉండవో, దేనిని తెలిసికొనిన తెలియదగినది వేరొకటి లేదో, క్రిందను మీదను ప్రక్కను వెలుపల ఏది నిండియుండి సచ్ఛిదానందాత్మకమో, ఆదాత ఆదేశోనేతినేతి అను ఉపనిషత్ వాక్యముచే ఏదితెలియబడునో అది బ్రహ్మమని తెలిసికొనుడు. ఆనంద స్వరూపమగు పరమాత్మయొక్క ఆనందము నాశ్రయించి ఆనంద భేధముచే బ్రహ్మాదులు ఆనందం పొందుచున్నారు. దేహము మొదలగు ఆనాత్మ వస్తువులు లౌకికి వ్యవహారమును చిదానంద యుక్తమైనది. కాన ప్రియముగానున్నది. పాలయందున్న నెయ్యివలె బ్రహ్మము సర్వగతమై ప్రేమస్వదమైనది.

కాంతితో కూడిన ఏజ్ఞానము సూర్యుని, చంద్రుని వెలిగించుచున్నదో, ఏది సూర్యునిచే చంద్రునిచే ప్రకాశింపబడదో, ఏబ్రహ్మ ప్రకాశముచే భూతభౌతికమైన ఈలోకము వెలుగుచున్నదో అదియే బ్రహ్మమని తెలిసికొనుము. స్థూల, సూక్ష్మ, నామ, రూప, గుణాదులు లేక నిషేధ హేతుభూతమైన సన్మాత్రమే ప్రహ్మమని ఎరుగుము.

తత్త అయఃపిండమును అగ్నివలె భూత భౌతికాత్మకమైన జగమును బ్రహ్మము లోపల వెలుపుల వ్యాపించి వెలిగించుచు అన్ని ఆకారములలో ప్రకాశించుచున్నది. దానికి వేరుగా కొంచెమును లేదు. అజ్ఞానులు జగత్తు వేరు బ్రహ్మ వేరు అని జగత్తుకు విలక్షణముగా బ్రహ్మను గ్రహించుచున్నారు. జగత్తు బ్రహ్మ కార్యముగా విచారించిన సర్వజ్ఞులగు జ్ఞానులచే బ్రహ్మకన్నా ఇతరములేదు అని తెలియబడును.

జగత్తు బ్రహ్మ విలక్షణముగా తోచుట ఎండమావిలోని నీటివలె భ్రాంతికాని వేరొండుకాదు. కంటితో చూడబడుచున్నది, చెవిచే వినబడుచున్నవి, మనసుచే స్మరింపబడుచున్నవి, వాక్కుచే పలుకబడుచున్నవి తత్వజ్ఞానము వలన పరమార్థముగా విచారించిన ఇది అంతా బ్రహ్మమేకాని బ్రహ్మకు వేరుగా కొంచెమునులేదు.

వేదాంతశాస్త్ర శ్రవణమువలన బ్రహ్మ పరోక్షజ్ఞానముగల యోగి సర్వవ్యాపకమును సచ్ఛిదానంద స్వరూపమునగు పరమాత్మను స్వస్వరూపముగా చూచును. శరీర ఇంద్రియాదులయందు ఆత్మబుద్ధిగల అజ్ఞాని సర్వోపాధి వినిర్ముక్తమగు ఆత్మ సర్వగత మయ్యేను. గుడ్డివాడు అంతటా అంతట ప్రకాశించు సూర్యుని చూడలేనట్లు చూడజాలడు. ఆత్మబోధ స్వరూపమగుట వలన కనబడనిది కాన నేత్రాది ఇంద్రియములచే గ్రహింపబడదు.

కర్మచేతను తపస్సుచేతను సాధ్యములగు స్వర్గలోక సత్యలోకాదులు అనిత్యము లగుటవలన తపస్సుచేకాని కర్మచేకాని ఆత్మ స్వరూపము లభించదు. జ్ఞాననేత్రముచే విశుద్ధ సత్వుడైన మహాత్ముడు పరమాత్మను అంతట చూచును కాని అందరకు అది చూడ శక్యము కాదు. జీవుడు శ్రవణ మననాదులచే ప్రజ్వలితమైన ఆత్మజ్ఞానము అనే అగ్నిచే పుటము వేయబడిన వృత్తాజ్ఞాన తత్కర్మ మాలినము కలిగినవాడై మేలిమి బంగారమువలె స్వయముగా ప్రకాశించును. ఈవిధంగా పరిశోధితమైన ప్రత్యగాత్మ బ్రహ్మాకార మనో వృత్తియందు ప్రతిఫలించి ఆయా ఉపాధులకు ఆశ్రయ భూతమగు అజ్ఞానము అనే చీకటిని పోగొట్టుచు ప్రబోధ సూర్యుడు హృదయ మనే ఆకాశంలో ఉదయించి సర్వమును ప్రకాశింపజేయును.

చంపకమాల-

నిరతిసుఖంబు, సర్వగము, నిర్మలమాంతర శుద్ధిదాయియున్ । నిరతిశయంబు, శీతముఖవిఘ్నము, యాచితదేశకాలమై ।
బరగెడునాత్మ తీర్థమును పావనమున్, భుజియించువాడెవో । పరమపదంబునొందు పెరవారలు బొందగలేరు భూస్థలిన్ ।

భావము - నిత్యము సుఖము నుచ్చునది, అంతటా వ్యాపించినది, నిర్మలమైనది, అంతర శుద్ధిని కలిగించునది, నిరతిశయ మైనది, శీతముఖ విఘ్నమైనది, యాచితదేశకామైనది, పావనమైనది అయిన ఆత్మజ్ఞానమనే తీర్థమును ఎవరైతే త్రాగెదరో వారే మోక్షమును పొందెదరు ఈ భువిలో ఇతరులెవ్వరును మోక్షమును పొందలేరు.

కాబట్టి ఓ మానవోత్తములారా! మీరు నాఈ ఉపదేశమును నిరంతరం మననం చేసుకొంటూ, జీవన్ముక్తులై ఇహలోకంలో ఆనందాన్ని అనుభవించి అంతంలో మోక్షాన్ని పొందగలరు ॥ అని శ్రీపతి ఆచార్యుడు మనువంశస్థులకు ఉపదేశించెను.

మరల శ్రీపతి ఆచార్యుడే ఇట్లు చెప్పాడు. ॥ పూర్వం కృతయుగంలో మీ పూర్వులలో ఒకరైన విమలవిదుడు హరిశ్చంద్రాది రాజులచే మాన్యుడైనాడు. త్రేతాయుగంలో విశ్వమూర్తి దశరథాదుల చేతనూ, ద్వాపరయుగంలో భూరిభుజుండు ధృతరాష్ట్ర పాండు రాజులచేతనూ సత్కరింపబడినారు గౌరవింపబడినారు. ఈ కలియుగంలో మీరు విశ్వంభర మునిశాపవశమున రాజ్యాన్ని కోల్పోయి నప్పటికి శ్రీ విజయవాటికా నగరీ విరాజమాన శ్రీమల్లిఖార్జునస్వామి అనుగ్రహము వలన సకల రాజ్యుల చేతనూ పూజ్యులై వాణిజ్య వృత్తిలో వృద్ధి పొందుతారు.

కృతయుగంలో మీ పూర్వులకు మహేశ్వరుడే గురువు. త్రేతాయుగంలో కపిలమహర్షి, ద్వాపరయుగంలో వేదవ్యాసుడు మీకు కులగురువులైరి. ఈ కలియుగంలో మిమ్ము ఉద్ధరించటానికై శ్రీ చింతామణి యోగి, త్రిమూర్తుల అంశతో శ్రీవత్సస గోత్రమున అవతరించగలడు. ఆ మహనీయుడు మీ వంశ చరిత్రను ఉభయ భాషలలో రచించి మీకీర్తిని ఆచంద్ర తారార్కము వెలిగించును. కాబట్టి మీవంశ సంభవులు ఆమహనీయుని కులాచార్యునిగా చేసుకొని ఆరాధించగలరని శ్రీపతి పండితుడు మను ప్రభువులకు ధర్మోపదేశము చేసి అంతర్హితుడై నాడని సూతమహర్షి శౌనకాది మునులకు మనువంశ చరితను చెప్పెను.

## ఉపశ్రుతి

పూర్వం మాధవవర్మ పెదవేగి యెర్రపోతముసెట్టి, నిడదవోలు సోలిసెట్టి, తద్వాయి సోమిసెట్టి, తడికెలపూడి బొమ్మిసెట్టి, యణ్ణము రామిసెట్టి మొదలగు తెల్కి సెట్లకు గౌరవసూచకంగా ఇచ్చిన ధర్మశాసనం నేడు బెజవాడ యందు నెలకొనియున్న శ్రీమల్లికార్జునస్వామి మహాదేవాలయం తూర్పు కడది స్తంభమునందు విరాజమానమై వారికీర్తిని ఆచంద్ర తారకముగా ప్రకటిస్తూ ఉన్నది.

ప్రతాపచోళుడు మాననీయులగు మానవోత్తముల కీర్తి ప్రతిష్ఠలకు సంతసించి, వారిలో ముఖ్యులగు గణపవరపు సేతమసెట్టి మొదలగు పదహారుమంది తెల్కిసెట్లకు బెజవాడ, చాట్రాయి, విజయరాయి జననాథపురము, తడికలపూడి, పద్మావతి, భోగవతి, తాడివాయి, చింతలపూడి, గౌతవరము, సాకేతవరము, పాంచాలపురము, ఆత్రేయపురము, మణికర్ణికాపురము అను నగరాలను, జన పదాలను కానుకగా ఇచ్చారు. వారిలో ఆ మనువంశ ప్రముఖులలో కొందరు సత్రాలు కట్టించారు. మరికొందరు చెరువులు తవ్వించారు. తోటలు నాటించి శివ ప్రతిష్ఠలు కావించారు. బ్రాహ్మణ అగ్రహారాలను చేయించారు. పెళ్లిళ్ళు చేయించారు. షోడశదానాలు చేసారు. విద్వత్కవులచే గ్రంధాలు వ్రాయించారు. ఇట్లు వారు ధర్మాచరణ తత్పరులై దైవ బ్రాహ్మణ భక్తియుక్తులై విలసిల్లారు. శ్రీమల్లిఖార్జునస్వామి ఇష్టదైవంగా, శ్రీపతి పండితుడు కులగురువుగా చేసుకొని ప్రవర్తిస్తూ చాళుక్య ప్రభువులు విష్ణువర్ధన మహారాజ దేవభళ్లానపెరుమాళ్ళు ప్రతాపచోడ నరేంద్రులు పాలించుకాలములో శాలివాహన శకము 1190 (క్రీస్తుశకము-1268) సంవత్సరంలో వేయించిన శాసనము వలన వర్తక వ్యాపారాలలో ప్రసిద్ధిగాంచారని తెలియుచున్నది.

మనుకుల సంభవుడైన రామయణ్ణము రామిసెట్టి కానిన్య గోత్రజుడగు గణపవరపు పెదచంద్రసెట్టి శివాలయంలో వేయి స్తంభాల మండపం కట్టించాలని సంకల్పించారు. తమ వారందరిని పిలిపించారు. అందరమూ కలసి ఐకమత్యంగా మంటపనిర్మాణం చేద్దామని సూచించారు. కొందరు అందుకు అంగీకరించారు. మరికొందరు మాత్రం కృష్ణానదీతీరంలో మల్లిఖార్జుస్వామివలె పినాకినీ తీరంలో మూలస్థానేశ్వరుడు ఉన్నాడని, తాము నెల్లూరులో ఉండగలమని చెప్పి వారు దక్షిణాభిముఖులై వెళ్లిపోయారు. తర్వాత రామిసెట్టి, పెదచంద్రసెట్టి గారలే దేవతిలకుల సహాయ సహకారాలతో, సెట్టి అనగా శ్రేష్ఠము కావున ( శ్రేష్ఠము ప్రకృతి సెట్టి వికృతి ) అర్థవంతం అయ్యేటట్లుగా వేయికాళ్ల మండపం కట్టించారు, నిత్యోత్సవాలు నిరాటంకంగా జరిగే ఏర్పాట్లు చేసారు. తైలరసం, నారికేళ రసం, అవిశలరసం, విప్పపువ్వురసం, గసగసాలరసం, పుష్పరసం, చిల్లతైలం, ఊర్వారకరసం మొదలగు ఎనిమిది విధముల తైలములచే నిత్యము అఖండ దీపారాధనలు జరుగునట్లు నియమించారు.

ఇట్లు ఆ మనువంశజులు కలియుగాంతం వరకు ధర్మ నిష్ఠాగరిష్ఠులై తమ మర్యాదకు లోపం రాకుండా కాము గడపి, విశ్వంభర శాపము నుండి విముక్తులై పూర్వమువలె భూమండలమును ఏకచ్ఛత్రంగా పాలించగలరు.

కందపద్యము - మనువంశ పురాణంబును, । మనుజుడు సద్భక్తితోడ, మాటికి వినినన్, ॥
గనినన్, వ్రాసిన, జదివిన, । తనదగు వాంఛితము నొందు తప్పక ధరణిన్. ॥

భావము - ఈ లోకములో ఏ మనుష్యుడైతే మనువంశ పురాణమును భక్తితో వినునో, కనునో, వ్రాయునో, చదువునో ఆ మనుష్యుని కోరిక తీరును.

అని సూతుడు శౌనికాదులకు మనువంశభవుల వృత్తాంతమును వివరించెను.

## పంచమ అధ్యాయం సమాప్తం.